యాత్రాగీతం

# నా కళ్లతో అమెరికా

డా॥ కె. గీత

కథలు

సత్య ప్రచురణలు

అలాస్కా

# భాగం-1

అమెరికాలో "అలాస్కా" చూసి రావడం అనేది ప్రతీ ఒక్కరికీ "బక్కెట్ లిస్టు"లో భాగం.

అంటే ఈలోకంలో ఉన్నప్పుడు తీరాలనుకున్న కోరికల పద్దులో ముఖ్యమైనదన్నమాట.

ఇక మేం ఎన్నాళ్లుగానో చూడాలనుకున్న ముఖ్య ప్రదేశాల్లో ఇదీ ఒకటి.

కానీ ఎప్పటి నుంచో వాయిదా పడుతూ వస్తూంది. ఇందుకు ఒక ప్రధాన కారణం ఏవిటంటే అలాస్కా అమెరికా సంయుక్త రాష్ట్రాలలో ఒకటైనప్పటికీ భౌగోళికంగా ఇది ప్రత్యేకంగా కెనడా దేశాన్ని దాటి విడిగా ఉండడం.

కానీ శ్రద్ధగా చూస్తే మేమున్న కాలిఫోర్నియా రాష్ట్రం నించి నిజానికి అమెరికా తూర్పు తీరాన ఉన్న న్యూయార్క్‌కి వెళ్లడం కంటే ఇదే దగ్గిర.

అంతే కాదు ఇక్కడి నుంచి వెళ్లేందుకు మూడు ప్రధాన రవాణా మార్గాలున్నాయి.

ఒకటి విమాన మార్గం, రెండు క్రూయిజ్ లనబడే అతిపెద్ద విహార నౌకా మార్గం, మూడు రోడ్డు మార్గం.

మొదటిదైన విమాన మార్గంలో తక్కువ సమయంలో చేరుకోవచ్చు. అయితే అతిపెద్దదైన అలాస్కా రాష్ట్రంలో సముద్ర తీర ప్రాంతాలలో ఉన్న ప్రధాన విశేషాలు, ముఖ్యంగా హిమానీనదాలు (గ్లేషియర్స్)ని చూసే అవకాశం కోసం చాలా మంది రెండో మార్గమైన క్రూజ్ లని ఎంచుకుంటారు. అయితే ఈ క్రూజ్ లలో వెళ్లిరావడానికి కనీసం పదిరోజుల సమయం పడుతుంది. అంతే కాకుండా ఆ మార్గంలో అలాస్కా లోని రోడ్డు మార్గం లోని విశేషాల్ని చూసే అవకాశం ఉండదు.

ఇక మూడోదైన రోడ్డు మార్గంలో మధ్యలో కెనడా దేశాన్ని దాటుకు వెళ్లాంటే అమెరికా పౌరులు కాని మా లాంటి వారు కెనడా వీసా తీసుకోవాల్సి ఉంటుంది. పైగా డ్రైవ్ చెయ్యగల్గిన దగ్గిర దూరమేమీ కాదు. కాబట్టి చివరిది మాకొక ఆప్షను కానే కాదు.

మాకున్న సెలవులు వారం మాత్రమే. అందులో సాధ్యమైనంత వరకు సముద్ర తీరపు విశేషాల్ని, రోడ్డు మార్గం లోని విశేషాల్ని కూడా కలిపి చూసే విధంగా ప్రణాళిక తయారు చేసేం.

దాని ప్రకారం అలాస్కాలోని యాంకరేజ్ వరకు విమానంలో ప్రయాణించి, అక్కడి నుంచి

రోడ్డు మార్గం ద్వారా వెళ్లి అక్కడి విశేషాల్ని చూడడమే కాకుండా విహారపు రైళ్లలోప్రయాణం చెయ్యడం, సముద్ర ప్రాంతాల్ని అక్కడిలోకల్ క్రూజ్ లు, బోట్ ట్రిప్పులలోను దర్శనం చెయ్యడం.

ఇక అలాస్కాలో అధికభాగం శీతాకాలంలో మంచుతో కప్పబడి ఉండడం వల్ల, వెళ్లి రావడానికి అనువైన కాలం వేసవి కాలమే కాబట్టి ఆ సీజన్ కే బుక్ చేసుకున్నాం. చవకగా విమాన టిక్కెట్లు దొరకాలంటే ముందే బుక్ చేసుకోవాలి కాబట్టి దాదాపు నాలుగైదు నెలల ముందే రిజర్వేషన్లు చేసేం.

ఇక రానుపోను విమానపు టిక్కెట్ల తర్వాత మేమక్కడ ఉండే వారం రోజులకి హొటల్స్, చూడవలసిన ప్రదేశాల జాబితాలు తయారు చెయ్యడంలో అర్థమైన విషయం ఏవిటంటే అలాస్కా టూరిజం పేకేజీ తీసుకోవడం అత్యుత్తమమని.

అలాస్కా నడి బొడ్డున ఉన్న దెనాలి నేషనల్ పార్కు నుంచి దక్షిణంగా మాత్రమే పిల్లలతో చూడదగిన విశేషాలు ఉన్నాయి. గ్లేసియర్లయితే పూర్తిగా దక్షిణ తీరంలోనే ఉన్నాయి.

ఉత్తరానికి వెళ్లే కొలదీ ఆర్కిటిక్ వలయానికి దగ్గర కావడం వల్ల దాదాపు నిర్మానుష్యంగా ఉంటుంది అలాస్కా.

ఇక అలాస్కా చూడాలని తపించడానికి మరో కారణం ఏవిటంటే అలాస్కా రమణీయ ప్రకృతి సౌందర్యంతో బాటూ వేసవిలో అర్థరాత్రి సూర్యుడు కనిపించే అద్భుతాన్ని కళ్లారా వీక్షించడం.

*(ఇంకా ఉంది)*

♦ ♦ ♦

# భాగం-2

# అర్ధరాత్రి సూర్యోదయం

మా ప్రయాణం మొదలయ్యే రోజు వారం రోజుల్లోకి రానే వచ్చింది. మిగతా అన్ని విషయాలూ ఆన్ లైనులో, అక్కడా ఇక్కడా తెలిసినా మేం వెళ్లిన జూలై చివరి వారంలో వాతావరణం ఎలా ఉంటుందనేది సరిగా అంచనా వెయ్యడం కష్టమైంది. అందుకు కారణం మేమున్న కాలిఫోర్నియా బే ఏరియాలో వేసవిలోనూ గట్టిగా ఎండ కాసే రోజులు అతితక్కువగా ఉంటాయి. ఒక రోజున్నట్టు మరొక రోజుండదు. ఒకోసారి పగలు వేడిమున్నా రాత్రుళ్లు పూర్తిగా చల్లబడి పోవడం కద్దు. అలాస్కా ఇదే విధంగా ఉంటుందో లేదో తెలియదు. ఉత్తరార్ధగోళంలో కెనడాకు సమాంతరంగా ఉండే దేశం, శీతాకాలంలో మంచుతో కప్పబడిఉండే దేశం కాబట్టి మరికాస్త చల్లగా ఉంటుందో తెలియదు. ఒకవేళ వేడిగా ఉన్నా పూర్తిగా దక్షిణార్ధగోళంలో ఉండే వేడిమి అంత మాత్రం ఖచ్చితంగా ఉండదని అంచనా వేసుకున్నాం.

ఇక బట్టలు సర్దుకునేటప్పుడు వేసవి దుస్తులతో బాటూ ఒక్కో లైట్ జాకెట్ కూడా పెట్టుకున్నాం ఎందుకైనా మంచిదని. ఇక గ్లేసియర్లు చూడడం, ఒక గ్లేసియరు మీదికి వెళ్లి దిగే టూరు మా టూరుల్లో భాగంగా ఎంచుకున్నాం కాబట్టి తలా ఒక మంచు కోటు (జాకెట్టు), గ్లోవ్స్, మంచుటోపీలు కూడా సర్దుకున్నాం. బాగా చల్లగా ఉంటే మంచులో వేసుకోవలసిన లోదుస్తులు ఇక అక్కడే కొనుక్కోవాలని అనుకున్నాం. అమెరికాలో అంతటా దేశీయ విమాన ప్రయాణంలో హ్యాండ్ లగేజీ లాంటి చిన్న సూటుకేసులు మాత్రమే ఉచితంగా తీసుకెళ్లవచ్చు. కేబిన్‌లో వేసే పెద్ద లగేజీలు, సూట్ కేసులకి ఒక్కోదానికి $25 డాలర్ల పైబడి రుసుము చెల్లించాల్సి ఉంటుంది. సాధారణంగా మేం తలా ఒక చిన్నసూట్కేసు సర్దుకుంటాం. కానీ అందువల్ల లగేజీ ఎక్కువ పట్టుకెళ్లడానికి అవకాశం ఉండదు. మరి పరిమితమైన దుస్తులతో వారానికి పైబడి ఉండాల్సి వస్తే ఎలా అంటే, మధ్యలో ఒకరోజు హొటల్లోనే బట్టలు వాషింగ్ మెషిన్లలో వేసుకుంటాం. ఇందులో నేను కనిపెట్టిన కొన్ని కిటుకులు ఏవిటంటే కోట్లు వంటివి విమాన ప్రయాణంలో ఒంటి మీదో, భుజానో వేసుకోవాలి. ఇక వేసుకునే బట్టల్ని గుండ్రంగా, దగ్గిరగా మడతలు పెట్టి సర్దుకోవాలి. లోదుస్తుల వంటివి బ్యాగుల ప్యాకెట్లలో సర్దాలి. ఎక్స్ ట్రా చెప్పులు, బూట్లు వంటివి పట్టుకెళ్ళడం కుదరదు కాబట్టి ఏబట్టలు

వేసుకున్నా అమరే అరబూట్ల వంటివి వేసుకోవాలి. ఇక ప్రతీ ప్రయాణంలో లాగే గబుక్కున జ్వరమో జలుబో వస్తే వేసుకోవడానికి ముఖ్యమైన మందులు దగ్గర పెట్టుకున్నాం. పిల్లల్తో ప్రయాణం చేసేటప్పుడు ఎప్పుడు ఆకలంటారో తెలియదు అందుకని ఒకట్రెండు స్నాక్ బార్ల వంటివీ పర్సులో వేసుకున్నాను. తక్కువ లగేజీలో అత్యవసరమైన అన్నీ సర్దేసరికి వారం ఇట్టే అయిపోయింది.

మోర్గాన్ హిల్ లోని మా ఇంటి నుంచి ఊబర్ తీసుకుని శానోజేలోని చిన్న విమానాశ్రయానికి పదిగంటల కల్లా చేరుకున్నాం. ఏడున్నర గంటల విమాన ప్రయాణంలో మధ్యలో సియాటిల్‌లో ఒక గంట మధ్య ఆగుతూ వెళ్లినా అలాస్కా చేరుకునేసరికి రాత్రి భోజన సమయం అయిపోతుంది. విమానంలో కొనుక్కోవడానికి చల్లని సాండ్ విచెస్ వంటివి తప్ప ఇంకేం దొరకవుకాబట్టి మధ్యాహ్న భోజనానికి శానోజే ఎయిర్పోర్టులో దొరికే వేడి బర్గర్ల వంటివేవో కొనుక్కుని బయలుదేరేం. సియాటిల్‌లో ఒక విమానంలోంచి దిగి, బాత్రూములకెళ్ళొచ్చి, మళ్లీ ఇంకొక విమానం ఎక్కేసరికి గంటలే ఓవర్ ఇట్టే అయిపోయింది. అక్కణ్ణించి ఏకబిగిన మూడున్నర గంటల ప్రయాణం చేసి రాత్రి తొమ్మిది గంటలకి ఏంకరేజ్ విమానాశ్రయానికి చేరుకున్నాం. అప్పటికే రాత్రి భోజన సమయం కావడం వల్ల అక్కడే భోజన కార్యక్రమం ముగించాం.

విమానాశ్రయం బయటికి ఎయిర్ పోర్టు టాక్సీ కోసం వేచి చూసే ప్రాంతంలోకి రాగానే వెచ్చని గాలి చుట్టుముట్టింది. "మన శానోజే లోనే చల్లగా ఉంది కదా మమ్మీ ఇక్కడికంటే" అంది వరు. ఒంటి మీద వేసుకున్న కోట్లన్నీ అర్జెంటుగా విప్పి నవ్వుకుంటూ నడుములకి కట్టుకున్నాం. హొటల్ ఎయిర్ పోర్టు టాక్సీలోనే వెళ్ళేం.

ఇంతకీ ఈ టూరులో విమానం టిక్కెట్లు తప్ప మిగతా టూర్లు, హొటళ్లతో సహా అలాస్కా టూరిజం ప్యాకేజీ లోనే భాగంగా ఉండేటట్టు బుక్ చేసుకున్నాం. అందువల్ల ఎయిర్ పోర్టు, రైలు, బస్సు స్టేషన్ల నుండి రవాణా కూడా వాళ్లే ఏర్పాటు చేసేరు. మొత్తం వారం రోజుల ప్రయాణంలో హొటలు బస, ఉదయపు అల్పాహారం, పగటిపూట భోజనాదులు, చూడవలసిన ప్రదేశాల టిక్కెట్లు కూడా అందులో భాగమే. మనిషికి రెండు వేల డాలర్లు ఖరీదైన ప్యాకేజీ అది. మేం హైఎండ్ హొటల్స్, గ్లేసియర్ హెలికాప్టర్ టూర్ల వంటి వాటితో అప్ గ్రేడ్ చేసుకునేసరికి మనిషికి మూడువేల పైచిలుకు అయ్యింది. రానూపోనూ విమానం టిక్కెట్లు, అక్కడ కొనుక్కునే వస్తువులు, రాత్రి భోజనం ఇలా అన్నీ కలిపి మనిషికి మరో వెయ్యి డాలర్ల వరకూ పడ్డాయి. అలాస్కా ప్రయాణం ఎందుకు బక్కెట్ లిస్టులో చేర్చాల్సిన గొప్ప ప్రయాణమో అప్పుడర్థం అయ్యింది.

ఇక మా వంతు ఎయిర్ పోర్టు టాక్సీ కోసం వేచి చూసి దాదాపు కొండమీదున్నట్టున్న డౌన్

టౌన్ లోని హొటలుకి చేరుకునే సరికి రాత్రి పదిన్నర అయ్యింది. అయినా సాయంత్రం ఆరుగంటల వేళలా వెలుతురుగా ఉంది. ఇక రాత్రి పన్నెండయ్యినా సాయంత్రపు మసక వెలుతురుగానే ఉండడం ఒకపక్క సరదాగా ఉన్నా నిద్రపట్టకపోవడం పెద్ద సమస్యగా మారింది. కిటికీలకు అత్యంత దట్టమైన తెరలు ఉన్నాయక్కడ. అయినా మూలమూల్నించి కళ్లలోకి వెలుతురు ప్రసరిస్తూనే ఉంది. ఇక మా చిన్నమ్మాయి సిరి అయితే చీకటయ్యేకే పడుకుంటానని భీష్మించుక్కూర్చుంది. మొత్తానికి ఒంటిగంట ప్రాంతంలో చీకటి అయ్యి మళ్లీ నాలుగింటికే వెలుతురు వచ్చేసింది. అలా అర్థరాత్రి సూర్యోదయం సరదా మొదటి రోజునే తీరిపోయింది మాకు.

*(ఇంకా ఉంది)*

♦ ♦ ♦

# భాగం-3

మర్నాడు ముందే బుక్ చేసుకున్న టూరు ప్రకారం మేం ఏంకరేజ్ నుండి ఉదయం **9.45**కు బయలుదేరే గ్లాస్ డూమ్ ట్రైనులో విట్టియార్ అనే ప్రదేశానికి మధ్యాహ్నం **12.45**కు చేరుతాం. అక్కణ్ణించి వెంటనే బయలుదేరే షిప్పులో గ్లేసియర్ టూరుకి వెళ్లి సాయంత్రం **6** గం.కు విట్టియార్ తిరిగొచ్చి మళ్లీ ఏంకరేజ్‌కు రాత్రి **9** గం.కు గ్లాస్ డూమ్ ట్రైనులో తిరిగొస్తాం.

మొత్తం టూరులో హొటలు నుంచి రైలు స్టేషనుకి రానూపోనూ వ్యాను సౌకర్యం టూరు వాళ్లే కల్పిస్తారు. ఇక ట్రైనుకి, షిప్పుకి టికెట్లు, ట్రైనులో, షిప్పులో భోజనాలు, ఉపాహారాలు,డ్రింక్స్ కూడా కలిపిన పేకేజీ ఇది.

ఇక ముందురోజు అర్థరాత్రి సూర్యుణ్ణి చూస్తూ సంబరపడుతూ చీకటి ఎప్పుడు పడుతుందో, మళ్లీ ఎప్పుడు తెల్లారుతుందో చూద్దామని దాదాపు మెలకువగానే ఉన్నాను. దాంతో పొద్దుట లేచే సరికి తల తిరగడం మొదలెట్టింది. ఇక అర్థరాత్రి వరకూ చీకటి పడకపోవడంతో పిల్లలు కూడా పడుకునేసరికి లేటయ్యి పొద్దున్న లేవడం వాళ్ళకీ కష్టమయ్యింది.

అయినప్పటికీ ఏడుగంటలకల్లా గబగబా తయారయ్యి హొటలు ప్రాంగణంలోని బ్రేక్ ఫాస్ట్ సెషన్ పూర్తి చేసుకుని ఉదయం **8.30** కల్లా హొటలు నుంచి రైల్వే స్టేషనుకి షటిల్ వ్యానులో బయలుదేరేం. స్టేషనుకి పది పదిహేను నిమిషాల వ్యవధిలోనే డౌన్ టౌన్‌లో ఉంది మా హొటల్. బయటంతా మబ్బుగా ఉన్నా చల్లగా లేదు జూలై నెలలో అక్కడ. బొత్తిగా రణగొణ ధ్వని ఏవీ లేని ఒక పాతకాలపు మాములు ఆఫీసు బిల్డింగులా ఉన్న రైల్వే స్టేషను చూసి నవ్వొచ్చింది.ూూూఖూా =ూ×ూ=ూూణ అనే పెద్ద అక్షరాల్తో ఆ బిల్డింగు పాతదైనా, బయట వేలాడే పూల కుండీలతో, చక్కగా కొత్తమాయని కోరా రంగు సున్నంతో అందంగా ఉంది.

ముందు రైల్వే స్టేషనుకి ఎదురుగా పాతకాలపు రైళ్ల జ్ఞాపకంగా కట్టిన చిన్న సైజు పొగబండి దగ్గిరికి పరుగెత్తి ఫోటోలు తీసుకున్నాం.

ఇక స్టేషను ఎంట్రన్సుకి ఒక పక్కగా చిన్న గేటులో నుంచి లోపలికి ప్రత్యేకంగా ఓపెన్ లాట్‌లో లైను ఉంది. చిన్న హ్యాండ్ బ్యాగులు తప్ప పెద్ద లగేజీ ఏవైనా ఉంటే ఆ లైనులో వెళ్లి చెకిన్ చెయ్యాలి. వాటికి అక్కడే ట్యాగులు వేసి తీసుకుని, దిగేక తీసుకోమని చెప్తున్నారు. లగేజీ చెకిన్ పూర్తిగా ఉచితం.

మా దగ్గిర ఏవీ పెద్ద లగేజీ లేకపోవడంతో మేం తిన్నగా మా రిజర్వేషను కాగితాలు తీసుకుని లోనికి వెళ్లి పెద్ద హాలులో ఉన్న బెంచీలపై కూచున్నాం.

అసలు మాతో ప్రయాణం ఎవరైనా చేస్తారా లేదా అని ఆలోచించుకుంటుండగా సరిగ్గా అరగంటలో హాలు కిక్కిరిసేలా జనం పోగయ్యేరు.

ఎక్కడా కూర్చునేందుకు చోటు లేక చాలా మంది నిలబడ్డారు.

దాదాపు 70 మంది వృద్ధులే ఉన్నారు. మాలాగా పిల్లలతో వచ్చిన వాళ్ళు 20, యువకులు 10 ఉన్నారు.

అలాస్కా రైలురోడ్డు చారిత్రాత్మకమైనది. దాదాపు 110 సంవత్సరాల ముందే నిర్మించబడినది. తొలిదశలో ఇక్కడి ప్రధాన పారిశ్రామిక ఉత్పత్తులైన క్రూడ్ పెట్రోలియం, సహజవాయువు, బొగ్గు, బంగారం, జింక్, కలప, సముద్ర వనరులు మొ.న వాటి రవాణా కోసం మాత్రమే రైలు మార్గాల్ని విరివిగా వాడినా 1959లో అలాస్కాను అధికారికంగా అమెరికా సంయుక్త రాష్ట్రంగా ప్రకటించిన తర్వాత టూరిజం కోసం ప్రత్యేక మార్గాలలో, ప్రత్యేక రైళ్లని నడుపుతున్నారు.

అలాస్కాని రష్యా నుండి 1867లో ఏడు మిలియన్ డాలర్లకు కొనుగోలు చేసింది యుఎస్ఏ. వైశాల్యంలో అమెరికా సంయుక్త రాష్ట్రాలలోకెల్లా అలాస్కాయే అతి పెద్ద రాష్ట్రం. అంతేకాకుండా అమెరికా సంయుక్త రాష్ట్రాల మొత్తం సముద్ర తీరంకంటే అలాస్కా సముద్రతీరం పెద్దది. అలాస్కాలో విస్తారమైన సహజ వనరులు ఉన్నాయి. క్రూడ్ ఆయిల్ ఉత్పత్తిలో అలాస్కా దేశంలోనే రెండవ స్థానంలో ఉంది.

ఇక రాజధాని జునేయు అయినప్పటికీ అలాస్కాలో అత్యంత జనసంఖ్య కలిగినది మేమున్న ఏంకరేజ్ నగరమే.

దక్షిణ మధ్య భూభాగంలో ఉన్న ఏంకరేజ్ నుండి అలాస్కాలోని అన్ని ఇతర ప్రాంతాలకు, అమెరికా సంయుక్త రాష్ట్రాలలోని అన్ని ప్రధాన నగరాలకు విమాన సౌకర్యం ఉంది. ఒక విధంగా ఏంకరేజ్ అన్నిటికీ కూడలి వంటిది.

ఇక మేమెక్కవలసిన రైలు నిర్ణీత సమయానికి పట్టాల మీద సిద్ధంగా ఉంది.

ప్లాటుఫారం వంటిదేమీ లేనేలేదు. పరిశుభ్రంగా ఉన్న పట్టాల మీద ఠీవిగా ఆకాశంలోకి నిలబడిన ఆ డబుల్ డెక్కర్ రైలు ఎక్కడానికి చక్కగా చిన్న మెట్లు ఉన్నాయి.

ముందున్న ఇంజనుని ఆనుకుని గ్లాస్ డూమ్ పెట్టెలు రెండు మాత్రమే ఉన్నా, మొత్తం

పదికి పైగా పెట్టెలతో విహార యాత్రకి మాత్రమే ఉద్దేశించిన ప్రత్యేక రైలది. ఈ రైలు పేరు Chugach Explorer.

మా టిక్కెట్టు ర్యాంప్ ఎక్కేముందే పరిశీలించి లోపలికి ఆహ్వానించేరు. అక్కడ కొద్దిమంది ప్రధాన స్టాఫ్ తప్ప మిగతా అంతా వేసవి ఉద్యోగాలు చేస్తున్న హైస్కూలు పిల్లలే.

నవ్వుతూ, తుళ్లుతూ, మర్యాదపూర్వకంగా మాట్లాడుతూ సీతాకోకచిలుకల్లా ఉన్న వాళ్ళని చూస్తే భలే ఆనందం, ఉత్సాహం వేసింది.

పై అంతస్థులో టాప్ సగం వరకూ గ్లాస్ డూమ్‌తో ఉన్న రైలు పెట్టెలో ప్రయాణం అంతకంతా భలే ఆహ్లాదంగా ఉంటుంది. గాల్లో విహంగంలా రెక్కలు సాచి ప్రయాణిస్తున్నట్టు.

చుట్టూ కమ్ముకునే చెట్లు, పర్వతాలు, ఆకాశం, మేఘాలు, ఒరుసుకుని ప్రవహించే నీటి చెలమలు, కిటికీల మీదికి విస్తరించినట్లున్న ప్రకృతిలో మనమూ మమేకమై అల్లనల్లన మెల్లగా సాగిపోతూ. ఓహ్... అత్యద్భుతమైన ప్రయాణం అది.

ఆ రైలుకి దూసుకుపోవడం ప్రధాన ధ్యేయం కాదు కనుక గంట సేపట్లో వెళ్లాల్సిన దూరానికి మూడుగంటలు పడుతుంది.

హాఫ్ గ్లాస్ డూమ్ రైలు కాబట్టి పిల్లలు కిటికీ సీటు కోసం కొట్టుకోకుండా బుద్ధిగా కూచున్నారు.

వరుసల మధ్య తగినంత స్థలంతో వరుసకు నాలుగు సీట్ల చొప్పున మధ్యన టేబుల్తో ఎదురుబొదురుగా రెస్టారెంటులో ఉన్నట్టున్నాయి సీట్లు.

మెట్లెక్కి పైకి వచ్చే చోటే చిన్న స్నాక్స్ & డ్రింక్స్ బార్ ఉంది.

కింద పెట్టె కూడా అలానే ఉన్నా మెట్లెక్కలేని పెద్దవాళ్ళ కోసం కేటాయించేరు ఆ సీట్లని.

డ్రింక్స్, స్నాక్స్ అన్నీ టిక్కెట్టులోనే కవర్ అవుతాయి.

అతి ముఖ్యంగా ఈ ప్రయాణంలో అలాస్కాలోని మరి కొన్ని ఊళ్లు చూసేం.

ఎంకరేజ్ పొలిమేరల్లోఉన్న ఇళ్లు ఎకరానికొకటి చొప్పున కట్టినట్లున్న పెద్ద పెద్ద స్థలాల్లో ఉన్నాయి. విశేషం ఏవిటంటే ఇంటికొక కారున్నట్టు ఇక్కడ ఇంటికొక చిన్న విమానం ఉంది!

*(ఇంకా ఉంది)*

♦ ♦ ♦

# భాగం-4

ఏంకరేజ్ నుండి ఉదయం 9.45కు బయలుదేరి గ్లాస్ డూమ్ ట్రైనులో అనుకున్నట్టే విట్టియార్ అనే ప్రదేశానికి మధ్యాహ్నం 12.45కు చేరాం. దారిపొడవునా గడ్డి భూములు, ఎత్తైన పర్వతాలు, సరస్సులు, మంచుకొండలు గ్లాస్ డూమ్ ట్రైనులో నుంచి చూసి ఆస్వాదిస్తూ ఉంటే సమయమే తెలియలేదు.

రైలు పెట్టెలోనుంచి ఒడ్డునున్న పెద్ద క్రూయిజ్ షిప్పు చూసి సంబరపడిపోయారు పిల్లలు. తీరా చూస్తే ఇంతకీ మేం ఎక్కాల్సింది దాని కొక పక్కనున్న రెండు మూడంతస్తులతో ఉన్న పెద్ద సైజు పడవ.

రైలు దిగుతూనే రోడ్డు కెదురుగా ఉన్న షిప్ యార్డ్‌లో టిక్కట్ల లైనులో నిలబడి మా రిజర్వేషను కాగితం చూపించి టిక్కెట్లు తీసుకున్నాం. అప్పటికే బయలుదేరడానికి సిద్ధంగా ఉన్న పడవలో మా కోసం కేటాయించిన నంబరు టేబులు దగ్గిర కూచున్నాం.

ఈ మొత్తం స్టెప్పులన్నీ ఎక్కడా కన్ఫ్యూజన్ లేకుండా చక్కగా పద్ధతి ప్రకారం ఉన్నాయి.

పొద్దున్న మా రిజర్వేషను కాగితంలో విట్టియార్‌కి రైలు చేరే సమయం, విట్టియార్ నుండి షిప్పు బయలుదేరే సమయం ఒక్కటే ఉండడంతో దారంతా ఒకవేళ రైలు ఆలస్యమైతే షిప్పు అందుకోగలమా అని ఒకటే ఆలోచిస్తూ ఉన్నాను. కానీ ఎక్కడా ఒక్క నిమిషం తేడా లేకుండా రైలు చేరడమూ, షిప్పుని అందుకోవడం వంటి వాటికి కరెక్టుగా మేచ్ అయ్యేలా ప్రీ ప్లాన్డ్ టూరు అని చేరేక అర్థమైంది. ఒకవేళ ఏదైనా కారణాల వల్ల రైలు రాకపోతే షిప్పు కదలదు. అవి రెండూ ఇంటర్ కనెక్టెడ్ టూర్స్ అన్నమాట.

మా టేబులు దగ్గిర రెస్టారెంటులో ఉన్నట్టు ఫోర్కులు, స్పూన్లు వగైరా పెట్టి ఉన్నాయి. మధ్యాహ్న భోజన సమయం కావడంతో కరకరా ఆకలేస్తోంది అందరికీ. ముందే మా మీల్ ఛాయిస్‌లు కూడా టూరు బుక్ చేసినప్పుడే రాసుకున్నారు కాబట్టి కరెక్టుగా పది నిమిషాల్లో మా టేబుల్ మీద ఫుడ్ సర్వ్ చేసేరు.

ఆ రోజు సాటర్డే కావడంతో మేం వెజిటేరియన్ ఆర్డర్ చేసేం. ఏదో బీన్ సూప్, చిన్న పావ్ బ్రెడ్, కోల్స్లా అనబడే క్యాబేజీ సలాడ్ ఇచ్చేరు. పిల్లలు ఏదీ నచ్చక కొంచెం కొంచెం తిని వదిలేసేరు.

ఇక అటూ ఇటూ పచ్చని కొండల మధ్య సముద్రపు పాయలో వేగంగా దూసుకుపోతున్న పడవలో కింది అంతస్తుల్లో డైనింగు పూర్తికాగానే అంతా వరండాల్లో ఉన్న ఖాళీ స్థలాలల్లోను, పడవ ముందు వెనక గ్లాసు డోర్ల బయట ఉన్న బెంచీలమీద, అన్నిటి కంటే పై డెక్‌లో ఉన్న బెంచీల మీద, అంచుల్ని ఆనుకుని నిలబడే స్థలాల్లోను చేరుకుంటున్నారు. ఆ పై డెక్ మీద విసురుగా చలిగాలి వీస్తూ ఉండడం వల్ల, సిరి రానని పేచీ పెట్టడం వల్ల మేం ఎవరో ఒకళ్ళం కింది డెక్‌లో ఉండి సిరిని చూసుకుంటూ, పై డెక్‌కి ఇద్దరిద్దరం వెళ్లొచ్చేం.

నిజానికి నాకు సముద్ర ప్రయాణం, అందునా బోట్ జర్నీ అస్సలు పడదు. అందుకే ఇంటి నుంచి కొని తెచ్చుకున్న సీ సిక్ నెస్‌ని దూరం చేసే హ్యాండ్ బ్యాండేజ్ ఒకచేతికి పెట్టుకున్నాను. అందుకో ఏమో అసలు జర్నీలో సిక్నెస్ అనిపించలేదు.

సరిగ్గా గంట ప్రయాణం తర్వాత దూరంగా అత్యద్భుతంగా పర్వతమ్మీద నుంచి అమాంతం సముద్రంలోకి దూకుతున్నట్టున్న హిమనీనదాన్ని (గ్లేసియర్) మొదటిసారి చూసి నోటమాట రాలేదు నాకు.

దూరం నుంచి ఏదో తెల్లని పాము పర్వతాన్ని పాకుతున్నట్టున్నా దగ్గిరికి వెళ్లే కొలదీ అతిపెద్ద తెల్లని మంచు ప్రవాహం కిందికి దూకుతూ పొరల మధ్య మధ్య అతివిచిత్రమైన ఆకాశ నీలం రంగుతో మెరుస్తూ ఉన్నట్టుండి పర్వత అంచులనించి సముద్రంలోకి పెళ్లలుగా విరిగి పడుతూ అత్యంత సౌందర్యంగా ఉన్నా, భీతిగొల్పుతూ ఉంది. ఇన్నాళ్లూ హిమనీనదాన్ని ఊహించుకున్నదానికీ ఇక్కడ కనిపించేదానికి వెయ్యిరెట్లు తేడా ఉంది.

ఒకపక్క ఎండ కాస్తున్నా చుట్టూ పర్వతాల మీంచి, మంచు ప్రవాహాల మీంచి, వీస్తున్నట్టున్న అతిశీతల గాలులు.

ఆపేసి ఉండుండీ పడే మంచు పెళ్లల దృశ్యాలు ఒడిసి పట్టుకోవడాకన్నట్టు మా బోట్‌ని దగ్గిరగా తీసుకెళ్లి కొంత సేపు ఆపేసేరు. అలలమీద ఉయ్యాయలలూగుతూ తళతళా మెరిసే నిశ్శబ్ద ఆకాశం కింద అలా ఆ క్షణాన హిమనీనదాన్ని కళ్లనింపుకోవడం చెరగని అనుభూతి.

బోట్ చుట్టూ వెన్నముద్దల్లా తేలుతున్న పెద్ద పెద్ద మంచుగడ్డలు. అక్కడ సముద్రఉష్ణోగ్రత మైనస్ డిగ్రీల్లో ఉంటుందని, పొరపాటున ఎవరైనా నీట్లో పడితే ఆ చలి తట్టుకోలేక వెంటనే మరణిస్తారని గైడు చెప్తుంటే ఒళ్లు గగుర్పొడిచింది. ఈ మంచు ప్రవాహం మిలియన్ల ఏళ్ల కొద్దీ అతి కొంచెం కొంచెంగా కదులుతూ వస్తుందని, ఇప్పుడు మేం చూస్తున్నది ఎప్పుడో ఐస్ ఏజ్ నాటిదని చెప్తుంటే అబ్బురమనిపించింది. అయితే గ్లోబల్ వార్మింగ్ వల్ల గత పదేళ్లలో అతివేగంగా

మంచు కరిగి సముద్రంలోకి పడిపోతూ ఉందని, అందువల్ల సముద్రమట్టపు ఎత్తు పెరిగి ఎన్నో దీవులు నీట మునిగిపోతున్నాయని మనిషే ప్రకృతి వినాశకానికి కారణమని గైడు చెప్తున్నప్పుడు ఇవన్నీ ఇంతకు ముందే తెలిసినా గొప్ప బాధగా అనిపించింది.

ఆ మంచుగడ్డల్లో కొన్నిటిని తోడి తీసి బోట్ లో ప్రదర్శనకు ఉంచారు. అంతే కాకుండా కూల్ డ్రింక్స్‌లో వేసి అమ్మకానికి పెట్టేరు. అతి స్వచ్ఛమైన ఆ మంచు తినడం వల్ల మంచి జరుగుతుందో, చెడు లేదో జరుగుతుందో తెలియదు కానీ గొప్ప సరదాగా, సంతోషంగా అనిపించింది.

నేను బోట్ చుట్టూ ఎక్కడ ఖాళీగా ఉన్నా ఫోటోల మీద ఫోటోలు తీసుకుంటూలోకాన్ని మరిచిపోయినట్టు ఎంతోసేపు తిరుగుతూనే ఉన్నాను.

“ఏమైనా స్వయంగా కంటితో చూడడమే వేరు కదూ!” అంటూ మురిసిపోతున్న నన్ను ఎప్పట్లానే స్వేచ్ఛగా వదిలేసి పిల్లల్ని భద్రంగా చూసుకుంటున్న సత్య మీద గౌరవం రెట్టింపైంది.

దాదాపు గంట తర్వాత పడవ వెనక్కి తిప్పినపుడు ఏదో దిగులు చుట్టుముట్టింది. “అయినా ఈ ప్రయాణంలో మరొక రోజు మనం స్వయంగా హిమనీ నదం మీదికి వెళ్లి దిగే హెలికాప్టర్ టూరు కూడా ఉంది కదా” అని సత్య సముదాయించడంతో స్థిమితపడ్డాను.

తిరిగొచ్చేటపుడు గైళ్లు పిల్లల కోసం ఏవో గేముల వంటివి పెట్టేరు. నేను సిరిని తీసుకుని వెళ్లి సరదాగా పాల్గొన్నాను. అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానం చెప్పినందుకు సిరికి ఒక గైడు కం రేంజర్ అలాస్కా బ్యాడ్జ్‌ని బహూకరించేడు.

అలా ఆహ్లాదంగా ఆనాటి మా గ్లేసియర్ టూరు సాయంత్రం 5 గం.కే పూర్తయ్యింది.

విట్టియార్ నుంచి ఎంకరేజ్ తిరిగెళ్లే మా రైలు 6గం.కు కావడంతో వరు, నేను నాలుగడుగుల్లో ఉన్న ఒక చిన్న బ్రిడ్జి దాటి రెస్టారెంటు వంటి చోటికెళ్లి రాత్రి భోజనంగా బర్గర్ల వంటివి కొనుక్కొచ్చేం.

మళ్లీ ఏంకరేజ్‌కు రాత్రి 9 గం.కు తిరిగొచ్చేం. రైలు స్టేషను నుంచి హొటలుకి ఊబర్ టాక్సీలో వచ్చేసరికి పదయ్యింది. రోజల్లా అలిసిపోయినా బయట వెలుతురు సాయంత్రం నాలుగ్గంటలు అయినట్టు ఉండడంతో సిరి ముందురోజులాగే నిద్ర పోవడం మానేసి ఆట మొదలు పెట్టింది. ఇక అందరం టీవీ పెట్టుకుని కూచుని, అర్థరాత్రయినా పడుకోకుండా కబుర్లు చెప్పుకుంటూ కూచున్నాం. ఆ నిద్రలేమి మర్నాటి నుంచి బాగా దెబ్బతీసింది మా అందరినీ.

*(ఇంకా ఉంది)*

♦ ♦ ♦

# భాగం-5

మా పేకేజ్ టూర్‌లో భాగంగా మర్నాడు మేం ఎంకరేజ్ నుండి బయలుదేరి దెనాలి నేషనల్ పార్క్‌కి బయలుదేరేం. ఎంకరేజ్ నుండి దెనాలి నేషనల్ పార్క్‌కి ఒక పూట ప్రయాణం. ఆ రోజు, మర్నాడు రెండు రాత్రుల పాటు దెనాలి నేషనల్ పార్క్‌లోనే మా బస ఏర్పాటుచెయ్యబడింది.

ఉదయం ఎంకరేజ్ లోని హొటల్లో బ్రేక్ ఫాస్ట్ పూర్తి చేసుకుని హొటలు నించి రైలు స్టేషనుకి ఉన్న ఫ్రీ షటిల్‌లో

నిన్నటిలానే ఎంకరేజ్ రైల్వే స్టేషనుకి సమయానికి అరగంట ముందే చేరుకున్నాం. అయితే ఇవేళ మా లగేజీ కూడా మాతోనే ఉండడంతో ముందుగా స్టేషనులోకి వెళ్లకముందే నిర్దేశించిన లగేజీ లైనులో వెళ్లి మా లగేజీని పేర్లు రాసి, ట్యాగులు కట్టి అప్పగించి వచ్చాం.

ఇక మేమెక్కవలసిన రైలు నిర్ణీత సమయానికి పట్టాల మీద సిద్ధంగా ఉంది.

ప్లాటుఫారం వంటిదేమీ లేనేలేదు. పరిశుభ్రంగా ఉన్న పట్టాల మీద ఠీవిగా ఆకాశంలోకి నిలబడిన ఆ డబుల్ డెక్కర్ రైలు ఎక్కడానికి చక్కగా ర్యాంప్ పరిచి ఉంది.

ముందున్న ఇంజనుని ఆనుకుని గ్లాస్ డూమ్ పెట్టెలు రెండు మాత్రమే ఉన్నా, మొత్తం పదికి పైగా పెట్టెలతో విహార యాత్రకి మాత్రమే ఉద్దేశించిన ప్రత్యేక రైలది.

మా టిక్కెట్టు ర్యాంప్ ఎక్కేముందే పరిశీలించి లోపలికి ఆహ్వానించేరు. అక్కడ కొద్దిమంది ప్రధాన స్టాఫ్ తప్ప మిగతా అంతా వేసవి ఉద్యోగాలు చేస్తున్న హైస్కూలు పిల్లలే.

నవ్వుతూ, తుళ్లుతూ, మర్యాదపూర్వకంగా మాట్లాడుతూ సీతాకోకచిలుకల్లా ఉన్న వాళ్ళని చూస్తే భలే ఆనందం, ఉత్సాహం వేసింది.

పై అంతస్థులో టాప్ సగం వరకూ గ్లాస్ డూమ్‌తో ఉన్న రైలు పెట్టెలో ప్రయాణం అంతకంతా భలే ఆహ్లాదంగా ఉంటుంది. గాల్లో విహంగంలా రెక్కలు సాచి ప్రయాణిస్తున్నట్టు.

ముందురోజు మేం విట్టియార్‌కి వెళ్లొచ్చినది ఆర్డినరీ డూమ్ ట్రైన్ అయితే ఇవేళ్టి ఎంకరేజ్ నుండి దెనాలి నేషనల్ పార్క్‌కి వెళ్లే గ్లాస్ డూమ్ ట్రైన్ గోల్డ్ స్టార్ అని పిలిచే స్పెషల్ ట్రైన్ అన్నమాట.

నిజానికి అసలు సిసలైన గ్లాస్ డూమ్ అంటే ఇదే. ఇందులో కూచుంటే ఆకాశంలో కూచున్నట్టే ఉంది మరి!

చుట్టూ కమ్ముకునే చెట్లు, పర్వతాలు, ఆకాశం, మేఘాలు, ఒరుసుకుని ప్రవహించే నీటి చెలమలు, పట్టాల వరకు విస్తరించినట్లున్న సముద్ర జలాలు ప్రకృతిలో మనమూ మమేకమై అల్లనల్లన మెల్లగా సాగిపోతూ. ఓహ్ అత్యద్భుతమైన ప్రయాణం అది.

ఆ రైలుకి దూసుకుపోవడం ప్రధాన ధ్యేయం కాదు కనుక గంట సేపట్లో వెళ్లాల్సిన దూరానికి మూడుగంటలు పడుతుంది.

గ్లాస్ డూమ్ రైలు కాబట్టి పిల్లలు కిటికీ సీటు కోసం కొట్టుకోకుండా బుద్ధిగా కూచున్నారు.

వరుసల మధ్య తగినంత స్థలంతో వరుసకు నాలుగు సీట్ల చొప్పున మధ్యన టేబుల్తో ఎదురుబొదురుగా రెస్టారెంటులో ఉన్నట్టున్నాయి సీట్లు.

మెట్లెక్కి పైకి వచ్చే చోటే చిన్న స్నాక్స్ & డ్రింక్స్ బార్.

కింద పెట్టెలో రెస్టారెంటుని తలపించే చక్కని డైనింగ్, దానిని ఆనుకుని బయటికి కనబడని పాంట్రీ.

ఫుడ్, డ్రింక్స్, స్నాక్స్ అన్నీ టిక్కెట్టులోనే కవర్ అవుతాయి.

అక్కణ్ణించి పక్క పెట్టెలోకి వెళ్తే అదీ గ్లాస్ డూమ్ పెట్టే కానీ కింద డైనింగ్ ఉన్నట్టు లేదు. ఇక మేం రైలంతా సందర్శించే ఉత్సుకతతో రైలుకి మరో మూల ఉన్న డెలీ వరకు వెళ్లి ఐస్ క్రీములు తీసుకున్నాం. అయితే ఆ డెలీ మామూలు పెట్టెల్లో ప్రయాణీకులకు ఉద్దేశించినది కావడంతో అక్కడేం తీసుకున్నా డబ్బులు కట్టాలి.

ఇక పెట్టెకి, పెట్టెకి మధ్య దాటేటప్పుడు మధ్య ఉన్న కనెక్టివ్ ర్యాంప్ వంటిది బాగా కదలడం, గ్లాస్ డూమ్ పెట్టెలకి, మామూలు పెట్టెలకి మధ్య కిందికి, పైకి చిన్న ఇరుకు మెట్ల మీద ఎక్కి దిగాల్సి రావడంతో సిరి భయంతో బాగా పేచీ పెట్టేసింది.

తిరిగి ఆ పిల్లనెత్తుకుని వెనక్కి మా పెట్టెలోకి వచ్చేసరికి మా తల ప్రాణం తోక్కొచ్చింది.

మధ్య దార్లో వచ్చిన టల్కీనా (ఖశ్రీనివఖ్ఖుఖు) స్టేషను దగ్గిర రైలు పదిహేను నిమిషాలు ఆగింది. సత్య, నేను దిగి అటూ ఇటూ పచార్లు చేసి మళ్లీ ఎక్కేం. చిన్నప్పుడంతా నాకు ఇండియాలో రైలు ప్రయాణాల్లో స్టేషనొచ్చినపుడు రైలు దిగి మళ్లీ ఎక్కడం భలే ఇష్టమైన విషయం. కానీ

చిన్నప్పుడంతా చిన్నపిల్లనని దిగనిచ్చేవారు కాదు. పెద్దయ్యాక ఒక్కదాన్ని ప్రయాణించినపుడు దిగితే రైలెక్కడ కదిలిపోతుందో అన్న భయంతోనూ, కూడా ఎవరో ఒకరు ఉన్నపుడు దిగడానికి బిడియంతోను ఆ సరదా అలా తీరకుండా ఉండి పోయింది. "దిగుదామా" అని సత్యతో అన్నదే తడవుగా పదమంటూ చక్కగా నా ముందు నడిచేడు. అందుకో ఏమో ఎంతో అపురూపంగా అనిపించాయి ఆ క్షణాలు.

దాదాపు పన్నెండు గంటల వేళ నుంచి లంచ్ ప్రారంభమయ్యింది. కింద డైనింగ్ కారులో సీటింగ్ లిమిటెడ్‌గా ఉండడంతో అరగంటకొక బాచ్ చొప్పున పిలవసాగేరు. అయితే ముందే ఎవరు ఏ బాచ్‌లో వెళ్లాలనుకుంటారో అడిగి రాసుకోవడం వల్ల మన వంతు కోసం ఎదురుచూడక్కర లేకుండా ఏర్పాట్లు జరిగేయి.

ఉదయం నించి స్నాక్స్ తింటూ, కూల్ డ్రింక్స్ తాగుతూ ఉండడంతో మేం చివరి బ్యాచ్‌కి వెళ్ళేం.

మెనూలో మాకేం కావాలో ఆర్డర్ ఇవ్వడం దగ్గరనించి ఫుడ్ సర్వ్ చెయ్యడం వరకు రెస్టారెంటు స్టైల్ లాగే ఉంది.

పెద్ద అద్దాల్లోంచి పట్టాల బయటి ప్రకృతిని ఆస్వాదిస్తూ భోజనం చెయ్యడం బాగా నచ్చింది మాకు.

ఇక ఫుడ్ కూడా రుచికరంగా చాలా బావుంది. అప్పటివరకు బానే ఉన్న సిరి ఆ పూట సరిగా తినలేదు.

తనకి ఇండియన్ ఫుడ్ బాగా ఇష్టం. అమెరికన్ ఫుడ్ సరిగా తినదు. అందువల్లనేమో అనుకున్నాం.

మధ్యాహ్నం మూడు గంటల వేళ దెనాలి నేషనల్ పార్కు స్టేషనుకి చేరుకున్నాం. పట్టాల్ని ఆనుకుని ఉన్న

పార్కింగులాటులో నేషనల్ పార్కుకి వెళ్లే బస్సు మాకోసం సిద్ధంగా ఉంది.

*(ఇంకా ఉంది)*

♦ ♦ ♦

# భాగం-6

ఏంకరేజ్ నుండి ఆ ఉదయం బయలుదేరి గ్లాస్ డూమ్ ట్రైనులో అత్యంత హాయిగా ప్రయాణించి దెనాలి నేషనల్ పార్క్ స్టేషనుకి మధ్యాహ్నం 3 గం.ల ప్రాంతంలో చేరుకున్నాం.

దెనాలి నేషనల్ పార్క్ చూడకుండా అలాస్కాని చూసినట్టే కాదని ఎన్నో చోట్ల చదివేను.

మొత్తానికి ఈ రోజు ఆ పార్కులో బస చెయ్యబోతున్నామన్న విషయం భలే ఆనందాన్నిచ్చింది.

పట్టాల్ని అనుకుని ఉన్న పార్కింగు లాటులో మా విడిదికి మమ్మల్ని చేరవేసే బస్సు సిద్ధంగా ఉంది.

కాని బస్సు మన ఎర్రబస్సులా దారుణంగా ఉంది. అదే కాదు నేషనల్ పార్కులో ఎక్కడికి వెళ్లాలన్నా తిరిగే ప్రతి షటిల్ బస్సూ అలాగే ఉంది. పైగా కొండలు ఎక్కిదిగడమేమో ఎట్టి పడేస్తూ. అమెరికాలో ఇంతవరకూ అటువంటి అనుభవం కలగని మాకు ఈ బస్సుని చూస్తేనే నవ్వొచ్చింది.

సరిగ్గా అరగంటలో అక్కణ్ణించి నేషనల్ పార్కులో మా రిసార్టుకి చేరుకున్నాం.

దారంతా ఎక్కడా చెట్టూ చేమా లేని నునుపైన కొండలు ఎక్కుతూ దిగుతూ.

నేషనల్ పార్కులో రిసార్టులన్నీ కొండమీదే ఉన్నాయి.

అవి ఉన్న ఎత్తుని బట్టి ఖరీదు కూడా ఉన్నట్టున్నాయి.

అన్నిటికన్నా పైనున్న రిసార్టులో మమ్మల్ని చివరగా దించేరు.

చుట్టూ పైన్ వృక్షాలతో కొండ కొసన ఉన్న ఆ కాటేజీ నాకు భలే నచ్చింది.

వెళ్తూనే రిసార్టు నేషనల్ పార్కులో పదిహేను నిమిషాల ప్రయాణపు దూరంలో ఉన్న మైనర్స్ ప్లాజాలోని హెూమ్ ఆఫ్ కాబిన్ నైట్ డిన్నర్ థియేటర్ అనేచోట సాయంత్రం డిన్నర్‌తో కలిపి ఉన్న ప్రదర్శనశాలకి టిక్కెట్లు కొనుక్కుని వెళ్ళేం.

అయిదు గంటలకి ప్రారంభమయ్యే ప్రదర్శన చివర్లో డిన్నర్ అదే హాల్లో వడ్డిస్తారు. పెద్ద పెద్ద చెక్క బల్లలకి అటూ ఇటూ ఉన్న పొడవాటి బల్ల మీద మాకు నిర్దేశించిన చోటులో కూర్చున్నాం. మాకెదురుగా ఒక అమెరికన్ ఫామిలీ కూర్చున్నారు.

పెద్ద స్వరాలతో సంగీత రూపకంగా సాగుతున్న ఆ ప్రదర్శన అలాస్కాకి తొలిరోజుల్లో వచ్చి సెటిల్ అయిన వ్యాపారుల జీవన విధానం గురించిన ప్రదర్శన. ఇది అలాస్కాలోని స్థానిక ఆటవికజాతుల గురించి అని ఊహించుకున్న నాకు ఈ ప్రదర్శన ఆశాభంగమైంది.

ఇక ప్రదర్శన తర్వాత భోజనం దగ్గర పెట్టిన తినుబండారాలు మా అందర్నీ నిరుత్సాహ పరిచాయి. మేం అస్సలు తినని పోర్క్ రిబ్స్, కాస్తో కూస్తో మా పెద్దమ్మాయి మాత్రమే తినే మేక్ & ఛీజ్, ఎవరూ ఇష్టపడని ఉడకబెట్టిన బంగాళా దుంపలు, నేను మాత్రమే తినగలిగిన ఆకులూ అలములతో ఆ డిన్నర్ పూర్తిగా డబ్బులు దండగ కార్యక్రమంగా మిగిలింది.

ఇక దెనాలి నేషనల్ పార్క్‌ను అని చూసే అలాస్కాను లాస్ట్ ఫ్రాంటియర్ అని పిలుస్తారా అనిపించింది. అమెరికాలోని అత్యంత సహజమైన నేషనల్ పార్క్స్ లలో దెనాలి నేషనల్ పార్క్ ఒకటి. దెనాలి నేషనల్ పార్క్‌ను మౌంట్ మెక్ కిన్లీ పార్క్ అని పిలిచేవారు. మౌంట్ మెక్ కిన్లీ ఉత్తర అమెరికాలోనే అతిపెద్దదైన పర్వతం.

దెనాలి నేషనల్ పార్క్ చుట్టుప్రక్కల మనుషులు దాదాపు **11,000** సంవత్సరాలకు పైగా నివసిస్తున్నారట. దెనాలి చుట్టూ అనేక త్రవ్వకాల సైట్లు **8,000** సంవత్సరాల నాటి నాగరికతకు సంకేతాలుగా ఉన్నాయి. **1906** ప్రాంతంలో ఛార్లెస్ అలెగ్జాండర్ షెల్టాన్ దెనాలి చుట్టుపక్కల ప్రాంతంలో సౌందర్యాన్ని గుర్తించి దానిని ఒక జాతీయ ఉద్యానవనంగా మార్చాలని భావించాడు.

షెల్టన్ ఆలోచనకు స్థానిక అలాస్కాన్ల మద్దతును చేర్చుకునేంతవరకు అది సాధ్యం కాలేదు. **1916** ఏప్రిల్లో కాంగ్రెసులో ఈ బిల్లు ప్రవేశపెట్టబడింది, చివరికి ఫిబ్రవరి **19 1917**న ఆమోదించబడింది. చాలా భాగం నిర్జన ప్రదేశంగా గుర్తించబడి, ఆరులక్షల ఎకరాల్లో వ్యాపించి ఉన్న ఈ పార్క్ కేవలం ఒక్క రోజులో చూడగలిగే పార్కు కాదు.

అయితే మర్నాటికి నిర్దేశించబడిన మా టూరు దెనాలి నేషనల్ పార్క్‌లో మౌంట్ మెక్ కిన్లీ వ్యూ పాయింట్ వరకు కవర్ చేసే ఒన్ డే టూరు.

మర్నాడు ఉదయానే మేం దెనాలి నేషనల్ పార్కు సందర్శనకు వెళ్లాల్సి ఉండడంతో పెందరాళే నిద్రకుపక్రమించాం. బయటి వెలుతురు కళ్ళల్లోకి రాకుండా ఉండడం కోసం మూడు వరసల చిక్కని కర్టెన్లు ఉన్నా నిద్రపోవడం మళ్లీ మామూలుగానే ఇబ్బంది అయ్యింది. ఇక మర్నాడు చూడబోతున్న టూరు గురించిన సంతోషంతో సగం నిద్రే రాలేదు.

*(ఇంకా ఉంది)*

♦ ♦ ♦

# భాగం-7

దెనాలి నేషనల్ పార్కు సందర్శనకు ఉదయానే రెడీ అయ్యి మా రిసార్టు బయటికి వచ్చేం.

అనుకున్న సమయానికి బస్సు వచ్చింది. కానీ ముందురోజు లాంటి ఎర్రబస్సే ఇది కూడా.

అనుకున్న సమయానికి బస్సు వచ్చింది. కానీ ముందురోజు లాంటి ఎర్రబస్సే ఇది కూడా. అన్ని రిసార్టుల నించి ఎక్కించుకున్నా

సగం బస్సు కూడా నిండలేదు.

కొండ తరవాత కొండ ఎక్కి దిగుతూనే ఉన్నాం.

అక్కడక్కడా ఆగుతూ అక్కడక్కడా దుప్పుల్ని చూపిస్తూ బస్సు డ్రైవరు

పార్కు చారిత్రక వివరాలు చెప్తూ ఉంది.

సరిగ్గా గంట ప్రయాణం చేసేమో లేదో మా సిరి అలవాటు లేని బస్సు కుదుపులకి హడావిడి చేసింది.

బస్సు ఆపమని నేను సిరితో కిందికి దిగేను. ఒక వాంతితో డీలా పడిపోయిన పిల్లతో ఏదోలా బస్సులో ఎక్కేం గానీ, మళ్లీ వాంతులయితే వెనక్కి వెళ్లే బస్సులో వెళ్ళిపోదామని అనుకున్నాం.

అయితే అదృష్టం కొద్దీ కాస్సేపట్లోనే సర్దుకుంది.

ఎక్కడా ఎత్తైన చెట్లు గానీ, మొక్కలు గానీ లేని అతి చిన్న గడ్డి కొండల మీదుగా అతిపెద్ద దెనాలి నేషనల్ పార్కులో ఉత్తరంగా మధ్యాహ్నం వరకూ ప్రయాణం చేసేం. ఎంతదూరం వెళ్లినా చూడాల్సిన అద్భుత దృశ్యాలు గానీ, గొప్ప జంతువులు గానీ కనిపించకపోవడం గొప్ప వెలితిగా అనిపించింది.

మధ్యాహ్నానికి మా టూరులో చివరి పాయింటయిన ఉత్తర అమెరికాలోనే అతిపెద్దదైన పర్వతమైన మౌంట్ మెక్ కిన్లీ వ్యూ పాయింటుకి చేరేం.

వ్యూ పాయింటులో కొద్దిగా ఎత్తుకి నడిస్తే దూరంగా విశాలమైన గడ్డి భూమి మీద ఆకాశపుటంచులో అద్భుత మేఘంలాగా నిలబడ్డ మెక్ కిన్లీ పర్వతం ఫోటోలు తీసుకున్నాం. సిరి

బస్సు దిగి పక్కనే ఉన్న రాళ్లతో ఆడసాగింది. తన దగ్గిర ఎవరో ఒకళ్ళం ఉండి, ఇద్దరిద్దరం వెళ్ళొచ్చాం.

మధ్యాహ్న భోజనమంటూ ఏవీ లేకుండా ఒక అరటిపండు, ఒక బిస్కెట్టు, చిన్న చిప్సు ప్యాకెట్టు ఉన్న స్నాక్ బాగ్స్ మాత్రం ఇచ్చేరు.

అక్కడ నుండి మళ్లీ వెనక్కి ప్రయాణిస్తూ వచ్చిన దారిలో రెస్ట్ ఏరియా దగ్గిర ఆపేరు. ఆ పక్కనే పెద్ద పెద్ద టెంట్లు వేసి ఉన్నాయి.

ఒక దాంట్లో గిఫ్ట్ సెంటర్ నడుపుతున్నారు. మరొకదాంట్లో నేషనల్ పార్క్ చరిత్రకు సంబంధించిన విశేషాలు ప్రదర్శనకు ఉంచారు. వాటి బయట పెద్ద పెద్ద దుప్పి కొమ్ములు ఆడుకోవడానికి, ముట్టుకుని చూడడానికి అనుమతించారు. అక్కడ మా బస్సు ఒక అరగంట ఆగడంతో మేమందరం వాటిని ఒకదానితర్వాతొకటి తలల మీద పెట్టుకుని ఫోటోలు తీసుకుని, దుప్పుల్లా ఒకళ్ళ వెనక ఒకళ్ళు పడి ఆడుకుని, నవ్వుకున్నాం. అన్నిటికంటే నన్ను బాగా ఆకర్షించినది ఆ పక్కనే సన్నగా చిన్న ప్రవాహాలుగా విడిపోయి ప్రవహిస్తున్న నది. పార్కింగ్ లాటు నుంచి కొద్దిగా దిగువకి నడిచి సన్నని గులకరాళ్ల మీద నుంచి స్వచ్ఛంగా ప్రవహిస్తున్న ఆ నీళ్లలో చెయ్యి ముంచి, తల మీద పవిత్ర గంగా ప్రవాహమని నీళ్లు జల్లుకుని మురిసిపోయాను.

అల్లంత దూరాన పురాతత్వ రహస్యాల్ని దాచుకుని గడ్డకట్టిన హిమానీనదం అపురూపంగా కరిగి అత్యంత స్వచ్ఛంగా ప్రవహిస్తున్న నీరది. ఆ నీటిని తాకగానే అంతటి అద్భుతమైన భావనా కలిగింది నాకు.

మళ్లీ గంటల తరబడి ప్రయాణం. అదేలాంటి గడ్డి కొండలు. బహుశా: శీతాకాలమంతా మంచుతో కప్పబడి ఉండడం వల్ల ఇక్కడ ఇంతకంటే ఎత్తు మొక్కలు, వృక్షాలు పెరగవన్నమాట. పిల్లలు అంతటి కుదుపుల బస్సులోనే బాగా నిద్రపోయేరు.

నాకు ఇండియాలో రోజూ అతి మామూలుగా బస్సుల్లో వేళ్ళాడుతూ తిరిగిన రోజులు జ్ఞాపకం వచ్చేయి. ఇటువంటివి అలవాటు లేని పిల్లలు ఏం గోల పెడ్తారో అని భయపడ్డాం ఏం పేచీ లేకుండా కానీ బుద్ధిగా కూచున్నారు పాపం. ముఖ్యంగా మా సిరి. ఈ ప్రయాణంలో నిద్ర నీరసం వల్ల సగం, సరిగా తినక సగం డీలా పడిపోయింది. అయినా పేచీ పెట్టలేదు.

రోజల్లా తిరిగినా గొప్ప విశేషం అని చెప్పుకోదగినవేవీ లేవు. అయినా దెనాలి నేషనల్ పార్కుకి ఇంత పేరెందుకు వచ్చిందా అని భలే ఆశ్చర్యం వేసింది. నిజానికి అమెరికాలో మా కాలిఫోర్నియాకి

దగ్గర్లో ఉండే నేషనల్ పార్కులు ఇంతకంటే చాలా గొప్పగా ఉంటాయి. నేను ఆకాశం కింద ఉండే ఏ భూభాగమైనా ఇష్టపడతాను కానీ, సత్య బాగా నిరాశ పడ్డాడు.

పెద్దగా తిరగకపోయినా సాయంత్రం నాలుగైదు గంటల వేళ తిరిగి రిసార్టుకి వచ్చేసరికి అందరికీ ఓపిక మాత్రం అయిపోయింది నాకు తప్ప!

*(ఇంకా ఉంది)*

♦ ♦ ♦

# భాగం-8

మధ్యాహ్నం లంచ్ అంటూ ఏవీ తినలేదేమో సాయంత్రానికే అందరికీ కరకరా ఆకలి వెయ్యసాగింది. కొండ పైనున్న మా బసకి మా బస్సు మలుపు తిరిగే రోడ్డు దగ్గిర ఏవో రకరకాల హొటళ్లు ఉండడం చూసేం. మరో అరగంటలో పిల్లల్ని హొటల్లో దించేసి కాస్త మొహాలు కడుక్కుని కొండ దిగువకి వెళ్తున్న బస్సు పట్టుకుని ఆ ప్రాంతానికి వచ్చాము.

ప్రధాన రోడ్డు పక్కన ఉన్న సర్వీసు రోడ్డుని మీద ఉన్న చిన్న చిన్న దుకాణాల్ని వరసగా చూస్తూ నడవసాగేం. వరసగా గిఫ్ట్ షాపుల మధ్య అక్కడక్కడా ఉన్న చిన్న చిన్న భోజనం దుకాణాల్ని, ఐస్క్రీము దుకాణాన్ని దాటుకుని చివరి వరకు నడిచి చివరికి హిందీలో పేరు రాసున్న ఒక భోజనం దుకాణాన్ని ఆశ్చర్యంగా చూసేం. అయితే అటూ ఇటూ పది నిమిషాల పాటు తిరిగినా అసలు దుకాణం ఎక్కడుందో అర్థం కాలేదు మాకు.

మొత్తానికి కాస్సేపటికి కనిపెట్టినదేవిటంటే బయటికి కనిపిస్తున్న గిఫ్ట్ షాపులో నుంచే లోపలి వెళ్తే ఒక పక్కగా చిన్న కిచెన్, నాలుగు టేబుళ్లు వేసున్న ఏరియానే రెస్టారెంట్ అన్నమాట. అప్పటికి సిరి రెండ్రోజులుగా ఫుడ్ సరిగా తినడం మానేసింది. తనకి ఇండియన్ ఫుడ్ ఇష్టం కాబట్టి ఇతరత్రా తినడం లేదేమో అని బాధపడుతున్న మాకు ఇక్కడ ఇండియన్ రెస్టారెంట్ చూడగానే గొప్ప సంతోషం వేసింది. నార్త్ ఇండియన్ రెస్టారెంట్ కావడంతో రోటీలు, కర్రీలు, వైట్ రైస్ ఆర్డర్ చేసేం. ఒక గంట తరవాత కనబడమని రెస్టారెంటు ఓనర్ కమ్ కుక్ చెప్పడంతో బయటికి వచ్చేము.

రోడ్డు దాటి అవతల వైపు ఉన్న మరొక రిసార్ట్ వైపు నడిచేం.

కొండ దిగువన ఉన్నా చాలా బావుంది రిసార్ట్. పైగా కొత్తగా కట్టినట్టు ఉంది. లోపలే రెస్టారెంటు, గిఫ్ట్ షాపులతో కళకళలాడుతోంది. ఒకవేళ బైట ఏవైనా కొనుక్కోవాలన్నా రోడ్డు దాటితే చాలు. పిల్లలతో వచ్చిన మాలాంటి వాళ్ళకి ఇదే ఉత్తమం. ఈ సారి వస్తే ఇక్కడ బస తీసుకోవడం మంచిదని అనిపించింది.

మాకు చెప్పిన సమయానికి అయిదు పదినిమిషాలు ఆలస్యంగానే వచ్చినా మరికాస్సేపు వేచిచూడవలసి వచ్చింది. పక్కపక్కనే ఉన్న గిఫ్ట్ షాపుల్లో పిల్లల కోసం ఏవో ఒకట్రెండు బొమ్మలు, చాకెలెట్లు కొన్నాం.

అక్కణ్ణించి మలుపు చివరి వరకు నడిచి కొండమీదికి వెళ్లే బస్సు కోసం నిర్దేశించబడిన వేచి చూసే స్థలానికి వచ్చి నిల్చున్నాం. అది బస్టాండూ కాదు, కూర్చోవడానికి ఏవీ లేవు. బస్సొస్తే కనబడే దూరంలో ఉన్న చెక్క బెంచీ మీద చతికిలబడి దాదాపు అరగంట వేచి చూసేక వచ్చిన బస్సు పట్టుకుని మొత్తానికి ఎక్కేమ్. ఇక మొదటి మా బస్సు కొండమీద ముందు వచ్చే రిసార్ట్ దగ్గిర ఆగి, అక్కడి నుంచి ఐదునిమిషాలు తర్వాత మా రిసార్టుకి బయలుదేరింది.

మేం ఎక్కడున్నామో అని మా పెద్దమ్మాయి వరూధిని అప్పటికే మాకు రెండు సార్లు ఫోను చేసింది. మా దగ్గిర ఫుడ్ చల్లారిపోతుందన్న ఆదుర్దా ఒక పక్క, మరోపక్క పిల్లల్ని ఇద్దర్నీ వదిలేసి వచ్చాము అన్న గాభరా. అయినా చేసేదేం లేక మాట్లాడకుండా కూచున్నాం. తిరిగి హొటలుకి పరుగులాంటి నడకతో గదికి చేరేసరికి పిల్లలిద్దరూ హాయిగా టీవీ చూస్తూ ఉన్నారు. హమ్మయ్య అని స్థిమితపడ్డాం.

మా చేతుల్లోని ప్యాకెట్లు చూడగానే గెంతుకుంటూ వచ్చి ఆకలి అంటూ చుట్టుముట్టేరు. నిజానికి ఫుడ్ అంత రుచికరంగా లేదు. అయినా అందరం చకచకా అవగొట్టేసేం. కానీ సిరి ఎందుకో అస్సలు సరిగా తినలేదు. అసలే అలాస్కా వచ్చినప్పటి నుంచి మెల్లమెల్లగా తినడం తగ్గించేసింది. ఇక తనకిష్టమైన ఇండియన్ ఫుడ్ కూడా తినకపోయేసరికి నాకు బెంగ పట్టుకుంది. వీలైనంత వరకు జ్యూసులు, లిక్విడ్స్ ఇవ్వడానికి ప్రయత్నించేను.

అసలే ఆ మర్నాడు మేం తిరిగి వెనక్కి వెళ్లే ప్రయాణంలో భాగంగా తల్కీట్నా (Talkeetna) అనే ఊర్లో బస చేసి హెలికాప్టర్ ద్వారా గ్లేసియర్ల మీద దిగే అడ్వెంచర్ టూరు చెయ్యబోతున్నాం.

కానీ సిరికి వొంట్లో బాలేక ఏవైనా మళ్లీ హడావిడి చేస్తుందేమో అని భయం పట్టుకుంది. అదృష్టం కొద్దీ జ్వరంవంటిదేవీ రాలేదు. కానీ డల్‌గా అయిపోయింది.

మొత్తానికి దేనాలి నేషనల్ పార్కు ఒక నిరాశని మిగిల్చింది. బహుశా టండ్రాలు మంచుతో కప్పబడిన వేళల్లోనే అందంగా ఉంటాయేమో. వేసవిలో చూసేందుకేమీ ఉండదేమో. కానీ చేసేందుకేమీ లేకపోవడం వల్ల కూడా నచ్చలేదు మా సత్యకి, పిల్లలకి. అంతదూరం వెళ్లినా స్థానిక జాతుల వారినెవరినీ చూసే అవకాశం ఎక్కడా కలగనందుకు నిరాశ కలిగింది నాకు.

*(ఇంకా ఉంది)*

♦ ♦ ♦

# భాగం-9

ఆ మర్నాడు మేం తిరిగి వెనక్కి వెళ్లే ప్రయాణంలో భాగంగా తల్కీట్నా (Talkeetna) అనే ఊర్లో బస చేసి హెలికాప్టర్ ద్వారా గ్లేసియర్ల మీద దిగే అడ్వెంచర్ టూరు చెయ్యబోతున్నాం.

ఉదయం ఏడు గంటల ప్రాంతంలో దెనాలీ నేషనల్ పార్కు నుంచి సెలవు తీసుకుని రిసార్ట్ గుమ్మం దగ్గిరే తల్కీట్నా బస్సు ఎక్కేం. ఈ బస్సు నేషనల్ పార్కులోపల తిరిగే ఎర్రబస్సు కాకుండా మంచి డీలక్స్ బస్సు కావడంతో సంతోషించాం. అయితే అప్పటిదాకా రైలు ప్రయాణాలు వరసగా చేసినందువల్ల పిల్లలకి రైలు అలవాటు అయిపోయింది. తిరిగి రైలు ఎప్పుడెక్కుతాం అని అడగడం మొదలుపెట్టేరు. నిజానికి అమెరికాలో ఇప్పటివరకు ఇంత విరివిగా రైలు ప్రయాణాలు చేసింది లేదు మేం.

నాలుగు గంటల ప్రయాణం తర్వాత దాదాపు ఉదయం 11 గం.ల ప్రాంతంలో తల్కీట్నాలో రిసార్ట్ దగ్గిర దిగాం.

ఇక్కడి రిసార్ట్ చిన్న సైజు అడవి మధ్య, చుట్టూ కనుచూపుమేర గులాబీ రంగు, ఎరుపు రంగు పూలతో, ఎత్తైన గడ్డి, దట్టమైన మొక్కలతో భలే అందంగా ఉంది. రిసార్టు వెనక గుమ్మం లోంచి దూరంగా పారే నది, ఒడ్డున పరుచుకున్న ఇసుక కనిపిస్తూంది. లోపలికి అడుగుపెట్టగానే ప్రయాణపు బడలికంతా పోయి ఒక గొప్ప ఆనందం కమ్ముకొచ్చింది.

లాబీలో రెండు కాళ్ళమీద నిలబడ్డ దాదాపు 20 అడుగుల ఎత్తైన ఎలుగుబంటి బొమ్మని చూసి ఆశర్యపోయేం. ఎందుకంటే దాని తోలు నిజం ఎలుగుబంటిదే. ఇప్పటివరకు ఇంత భారీ ఎలుగుని ఎక్కడా చూళ్ళేదు.

ఇక ఒక తమాషా విషయం ఏవిటంటే ఆ ఎలుగుకి రెండు కాళ్ళకి ఎగువగా ఎత్తుగా ఉన్న రంధ్రాన్ని చూపించి మా సిరి పొట్ట మీదికి తన చొక్కా లాక్కుని తన బొడ్డు మాకు చూపించి అది ఎలుగుబంటి బొడ్డు అని చెప్పడం చూసి మాకు నవ్వాగలేదు.

ఇక మా బసలో చెకిన్ సమయం మధ్యాహ్నం మూడు గంటలకి మాత్రమే కావడం వల్ల మా లగేజీని రిసార్టు కౌంటరు వాళ్ళకి అప్పగించి అక్కడే ఉన్న రెస్టారెంటులో కానిచ్చి కాస్సేపు రిసార్టు చుట్టూ తిరుగుతూ ఫోటోలు తీసుకుంటూ తిరిగేం.

మరో గంటలో గ్లేసియర్ హెలికాప్టర్ టూరు పికప్ ఉంది మాకు. బస్సులో దారి పొడుగునా ఏవో స్నాక్స్ వంటివి తినడం వల్ల ఎవరికీ ఆకలిలేక భోజనాల్ని తిరిగి వచ్చే సమయానికి వాయిదా వేసేం. దాదాపు అరగంట వెయిటింగ్ తర్వాత గ్లేసియర్ టూరు పికప్ వాను ఎక్కేం.

రిసార్టు నుంచి పదిహేను నిమిషాల దూరంలో తల్కీట్నా చిన్న ఊరుని దాటుకుని మరో కొసలో ఉంది ఎయిర్ బేస్. ఇద్దరు నుంచి ఆరుగురు పట్టే దాదాపు పది పదిహేను చిన్న విమానాలతో, వచ్చి పోయే వాళ్లతో మంచి హడావిడిగా ఉంది. ఈ టూరు టిక్కెట్టు మనిషికి 200 డాలర్ల పైచిలుకే. ఇంత ఖరీదైనా వెనుకాడకుండా చాలా మంది వస్తున్నారు. అక్కడికి వచ్చి అప్పటికప్పుడు బుక్ చేసుకోవాలని అనుకున్నవారు కొందరు ఆ రోజుకి టిక్కెట్లు లేక నిరాశతో వెనుదిరగడం గమనించేం. టూరు మొత్తం ముందుగానే బుక్ చేసుకున్నందువల్ల మాకు ఎక్కడా సమస్యలు ఎదురుకాలేదు.

మా అందరికీ ఆ చిన్న విమానం ఎప్పుడెక్కుదామా గ్లేసియర్ మీదికి ఎప్పుడు కాలుమోపుదామా అని ఆతృతగా ఉంది. కౌంటరులో విమానంలోకి పట్టుకెళ్ళడానికి అతి చిన్న హేండ్ బ్యాగు తప్ప మిగతావన్నీ వదిలివెయ్యమని చెప్పారు. అంతేకాకుండా గ్లేసియర్ మీద దిగడానికి మంచు బూట్లు వేసుకోవడానికి ఇచ్చారు. కౌంటరు ఆఫీసుకి వెనక వైపు ఆరుబయట ఉన్న పెద్ద బాక్సుల్లో సైజుల వారీగా ఉన్న బూట్ల జతల్లో మాకు పట్టేవి తెచ్చుకుని వేసుకుని సిద్ధమయ్యేం.

నిజానికి బయట వెచ్చగానే ఉన్నా గ్లేసియర్ మీద చలిగా ఉంటుందని అందరికీ చలికోట్లు తొడిగేను నేను. దాదాపు ఒంటిగంట ప్రాంతంలో మా విమానం పైలట్ వచ్చి మమ్మల్ని పరిచయం చేసుకుని ముందుకు దారితీసేడు. ప్రయాణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించి శబ్దం బాగా ఎక్కువ వస్తుంది కాబట్టి విమానంలో పైలట్‌తో మాట్లాడాలన్నా, పైలట్ చెప్పేది వినాలన్నా మాకు ఇచ్చిన పెద్ద హెడ్ ఫోన్స్ తప్పనిసరిగా పెట్టుకోమని చెప్పేడు.

మా నలుగురితో బాటూ మరెవరో ఇద్దరు ఎక్కేరు మా విమానంలో. కిటికీ పక్కన ఒక్కొక్క సీటు మాత్రమే ఉండి సరిగ్గా ఆరు సీట్లు మాత్రమే ఉన్నాయి. సత్య కాక్ పిట్‌లో పైలట్ పక్క సీట్లో కూచున్నాడు. నేను, పిల్లలు ఎవరికి వారు వరసగా ఒక్కొక్కరం కూచున్నాం. సిరి ఒక్కతే కూచోడానికి భయపడి పేచీ పెడ్తుందేమో అని మేం తెగ భయపడ్డాం. కానీ మమ్మల్ని భయపడొద్దని తన హెడ్ ఫోన్స్ తనే పెట్టుకుని సొంతంగా బుద్ధిగా కూచుంది. అంతేకాకుండా సరిగ్గా రెండు నిముషాల్లోనే నిద్రలోకి జారుకుంది.

*(ఇంకా ఉంది)*

♦ ♦ ♦

# భాగం-10

మా అలాస్కా ప్రయాణంలో అతి ముఖ్యమైన ఘట్టం రానే వచ్చింది. భూమి మీద అత్యద్భుతాల్లో ఒకటైన హిమానీ నదమ్మీద స్వయంగా అడుగుపెట్టే విమాన ప్రయాణం మొదలయ్యింది. టేకాఫ్ సాఫీగానే జరిగినా ఊహించుకున్న దానికంటే భయంకరంగా శబ్దం చేస్తూ ఆరుగురు మాత్రమే పట్టే ఆ చిన్న ఫ్లైట్ గాల్లోకి లేచింది.

అతి చిన్న విమానమేమో గాలికి సముద్రంలో పడవలా ఊగసాగింది. దాదాపు అయిదు నిమిషాల పాటు గొప్ప భయం వేసింది. అయితే విమానం విహంగంలా రయ్యిన ఆకాశంలో వెళు తూ కనుచూపుమేర సుందర దృశ్యాలు ఆవిష్కరించేసరికి అప్పటివరకు కాస్తో కూస్తో ఉన్న బెరుకు పోయింది. తక్కువ ఎత్తులో ఎగురుతుండడం వల్ల కిందంతా అద్భుతంగా కనిపించసాగింది. తల్కీట్నా ఊరు సుశిత్నా (Susitna), చులిత్నా (Chulitna), తల్కీట్నా (Talkeetna) నదుల సంగమంలో ఉండడం వల్ల ఊరికి చుట్టూ ఎటు చూసినా నదుల ప్రవాహాలు పాయలుపాయలుగా అల్లుకుంటూ కనువిందు చేస్తూ ఉన్నాయి.

చిన్న లక్కపిడతలుగా మారిపోయిన ఇళ్లని దాటి, చిన్న తల్కీట్నా (Talkeetna) ఊరిని దాటి, ఏర్లు దాటి, కోనని దాటి ఊరికి ఉత్తరం దిక్కుగా ఉన్న మంచు కొండల వైపు ప్రయాణించసాగేము. పర్వతం దగ్గిరికి చేరేసరికి ఒక పక్క దూరంగా జరుగుతూ కనుమరుగవుతున్న ఊరికి, పర్వతానికి మధ్య బద్ధకంగా పరుచుకున్న పల్చటి అడవి, మధ్య బురద రంగులో ప్రవాహం ఘనీభవించినట్టున్న మెలికల పాములాంటి నది. చుట్టూ అంతా చిత్రపటంలా మారిపోయింది.

బయలుదేరిన సరిగ్గా పదినిమిషాల్లో మంచు పర్వతపు కోన మీంచి ఎగరసాగేము. అప్పుడర్థమైంది అది ఒక్క పర్వతం కాదు. పర్వత శ్రేణి. ఒళ్ళు గగుర్పొడిచే సూదంటు కొనలున్న పర్వత శ్రేణి. వేసవి కావడంతో తెల్లని మంచు అక్కడక్కడా కరిగి మధ్య మధ్య నల్లని రాళ్లు పైకి తలెత్తి చూస్తూన్నాయి. అంతలోనే లోపల్లోపల భయాన్ని తొలగిస్తూ అభయమిస్తున్నట్టు పర్వత శ్రేణుల మధ్య వెల్లువలా పరుచుకున్న అందమైన హిమానీ నదం ఆనందంగా ఆహ్వానించింది. అటూ ఇటూ మంచు పర్వతాలు ఘనీభవన ప్రవాహమై త్రోవ చూపిస్తూ మాతో వెనక్కి పరుగెడుతున్న హిమానీ నదం. ఒక్క క్షణం కూడా రెప్పవెయ్యనివ్వని అద్భుతమైన క్షణాలవి.

హెడ్ ఫోన్స్ పెట్టుకున్నా గట్టిగా రొద చేస్తూ ప్రయాణిస్తున్న విమానం, గాల్లో ఊగిసలాడుతూ

చెమటలు పట్టిస్తున్న ప్రయాణాన్ని అలవోకగా మరిచి, కిటికీ లోంచి బయటికే చూస్తూ అతుక్కుపోయిన నాకు కంటి ముందు కనిపిస్తున్న సుందర దృశ్యాలు తప్ప మరోలోకం గుర్తు రాలేదు.

మా విమానం దిగుతున్న సమయానికి అప్పటికే అక్కడ ఆగిఉన్న మరొక విమానం గాల్లోకి లేచింది.

ఇక విమానం హిమానీ నదపు నడిబొడ్డున దిగి ఒక్కొక్కరూ అడుగుపెడుతున్న క్షణాన నా కోసమే, ఆక్షణం కోసమే యుగాలుగా ఆ మంచుప్రవాహం అలా ఎదురుచూస్తూ ఉందనిపించింది. అప్పటివరకు గాల్లో ప్రయాణం చేసి రెండు కళ్ల సాక్షిగా చూసేం కాబట్టి గానీ నిజానికి దిగేక చుట్టూ మంచుతో కప్పబడిఉన్న ఏదో ప్రదేశానికి వచ్చినట్టే ఉంది కానీ అదొక హిమానీ నదమని తెలియరాకుంది. అటూ ఇటూ గంభీరంగా నిల్చున్న కొండల మధ్య విస్తృతంగా పరుచుకున్న అతి పెద్ద లోయలా మాత్రమే ఉంది అక్కడ.

ఆ ఉదయానో, ఆ ముందు రోజో మంచు కురిసినట్లు మెత్తటి మంచులో బూటు కాలు దిగబడుతూ ఉంది. ఎక్కడైనా మంచు పెళ్లలుగా విరిగి లోపలికి వెళ్లిపోతుందేమో అని లోపల్లోపల చిన్న భయం వేస్తూ. అదే అడిగాను. అలాంటి భయం అవసరం లేదని ఎన్నో వేల ఏళ్లుగా మంచు అలా పేరుకుని పేరుకుని గట్టిపడిన గ్లేసియర్స్ అవి అని, కానీ దాదాపు మైలు కిందెక్కడో అవి బద్ధకపు తాబేళ్లలా మేమక్కడ ఉన్న క్షణంలో కూడా కనిపెట్టలేనంత అతి మెల్లగా కదులుతూ ఉంటాయని వివరించేడు. అంతేకాకుండా అక్కడ విమానాలు దిగడానికి ముందే తగిన పరిశీలనలు జరుపుతారని చిరునవ్వుతో చెప్పేడు.

మా అందర్నీ సరిగ్గా అరగంటలో విమానం దగ్గిరికి తిరిగి వచ్చెయ్యమని, వంద మీటర్ల కంటే దూరం వెళ్లొద్దని మా పైలట్ హెచ్చరించేడు. అందుకు కారణాలు ఏవైనా మేమైతే కనీసం **50** మీటర్ల దూరం కూడా వెళ్లకుండా అక్కడక్కడే ఆడుకుంటూ, ఫోటోలు తీసుకుంటూ గడిపేం. దారంతా నిద్రపోయిన సిరి మంచు చూసేసరికి హుషారుగా ఆడడం మొదలుపెట్టింది. వరు, సత్య సరేసరి. ఇద్దరికీ సాహసాలంటే బాగా ఇష్టం. పైలట్ చెప్పిన మాట వినకుండా దూరానికి వెళ్ళిపోతారేమో అని అక్కడున్నంత సేపు వాళ్లని కనిపెట్టుకుని ఉన్నాను. నిజానికి అరగంట అయిదు నిమిషాల్లా అయిపోయింది.

మేమక్కడ ఉండగానే మాకు కనుచూపుమేర దూరంలో మరొక ఫ్లైట్ ఆగింది. అది దిగగానే మా ఫ్లైట్ బయలుదేరడానికి సిద్ధమైంది. ఇలా అరగంటకొకటి చొప్పున అదే నిర్దేశిత స్థలంలో

వెళ్తొస్తున్నాయని అర్థమైంది. విమానంలోకి తిరిగి అడుగుపెడ్తున్నపుడు అదో విధమైన బాధగా అనిపించినా ఎందుకో వెనక్కి వెళ్లిపోవడానికి సంతోషం వేసింది. బహుశా: హిమనీనదమంటే కదిలేదని ఏదో తెలీని భయం చుట్టముట్టడం వల్లనేమో.

తిరిగి పర్వత శ్రేణుల్ని దాటి, కోనల్ని దాటి, నదిని దాటి, ఊరు కనిపించగానే గొప్ప సంతోషం కలిగింది. చాలా తమాషాగా గాల్లో ఉన్నప్పుడంతా ఊగిసలాడిన విమానం నేలమీద దిగినప్పుడు అతి సాఫీగా దిగింది. అంత స్మూత్ లాండింగ్ చేసి మమ్మల్ని క్షేమంగా వెనక్కి తీసుకొచ్చిన పైలట్‌కి పదే పదే కృతజ్ఞతలు చెప్పేను. టిక్కెట్టు బాగా ఖరీదైనా జీవితంలో చేసి తీరదగ్గ అద్భుతమైన ప్రయాణాల్లో ఇది ఎన్నదగినది. నా వరకూ నాకు చాలా చాలా నచ్చిన ప్రయాణమది.

*(ఇంకా ఉంది)*

♦ ♦ ♦

# భాగం-11

# తల్కిట్నా ఊరు

హిమానీనదమ్మీద స్వయంగా అడుగుపెట్టిన విమాన ప్రయాణం పూర్తయ్యి బయటికి వచ్చేసరికి మమ్మల్ని తీసుకెళ్లేందుకు రిసార్టు వెహికిల్ సిద్ధంగా ఉంది. పేకేజీ టూరు తీసుకోవడం వల్ల ఇదొక చక్కని ఏర్పాటు. ఎక్కడికి వెళ్లినా పికప్, డ్రాప్ ఆఫ్ లకి తడుముకోనవసరం లేదు. ఇక వెనక్కి రిసార్టుకి చేరుకునేసరికి

దాదాపు రెండున్నర కావస్తున్నా అదృష్టం కొద్దీ రిసార్టులోనే ఉన్న లంచ్ రెస్టారెంట్ తెరిచే ఉంది. మెక్సికన్ టాకోస్, మొక్కజొన్న గింజలు ఆర్డర్ చేసి ఆకలితో ఆదరాబాదరా తిన్నాం.

భోజనం కాగానే తల్కిట్నా ఊరు చూసి వద్దామని అనుకున్నాం. పిల్లల్ని తీసుకువెళ్లాలని అనుకుంటే సిరి అడుగు తీసి అడుగు వెయ్యనని మారాం మొదలుపెట్టింది. వరు సరేసరి, గదిలో టీవీకి అతుక్కుపోయి కూచుంది. ఇక మేమిద్దరమే బయలుదేరేం.

రిసార్టు నుంచి ఊర్లోకి, ఊర్లో నుంచి రిసార్టుకి ప్రతి పది పదిహేను నిమిషాలకి వెహికిల్స్ వెళ్తూ ఉండడంతో మాకు ట్రాన్స్పోర్టు సమస్య కాలేదు.

తల్కిట్నా ఊరు చాలా చిన్నది. అయినా అందమైనది. ముఖ్యంగా ఊరునానుకుని ప్రవహించే కాలువలు, కాలువ ఒడ్డునే ఉన్న డౌన్ టౌన్.

రిసార్టు నుంచి బయలుదేరి సరిగ్గా పదినిమిషాల ప్రయాణం తర్వాత డౌన్ టౌన్‌లో దిగి నడక మొదలుపెట్టేం. పాతకాలపు ఇళ్లవంటివే చిన్న షాపులుగా మార్చినట్టున్నారు. ఒక్కొక్కటి చూసుకుంటూ ముందుకు వెళ్లసాగేం. అంతలోనే చిన్న చినుకులు మొదలయ్యేయి. అయినా ఇద్దరం లక్కీగా చలికి, వర్షానికి ఆగే జాకెట్లు వేసుకుని వచ్చినందువల్ల ధీమాగా ముందుకు నడిచేం.

చుట్టూ మట్టిరోడ్లతో ఆ ప్రాంతం మేం పుట్టి పెరిగిన ఊరులా అనిపించడంతో ఆనందించాం.

ఒక చిన్న నాలుగు రోడ్ల జంక్షనులో అటూ ఇటూ పదేసి నిముషాలు నడిచేసరికి ఊరు అయిపోయింది.

అందులో ఒక వైపుగా కాలువ ఒడ్డుకు నడిచే దార్లో అటూ ఇటూ టెంట్లు వేసి తాత్కాలికమైన దుకాణాలు తెరిచి గిఫ్ట్ ఐటమ్స్ అమ్ముతున్నారు.

అందులో అధికభాగం అలాస్కా చేనేత కళాకారులు తయారు చేసిన దుస్తులు, టోపీలు, బ్యాగులు వంటివి, స్థానిక ఆదివాసీ సంస్కృతిని ప్రతిబింబింపజేసే టోటెమ్‌ల దారు శిల్పాలు, పనిముట్లు వంటివి ఆకర్షణీయంగా ఉన్నా బాగా ఖరీదుగా ఉన్నాయి. నేను ఆ ఊరు గుర్తుగా జంక్షనులో తల్కీట్నా డౌన్ టౌన్ అని రాసి ఉన్న చిన్న బొమ్మ కొన్నాను. అప్పటికే సాయంత్రం కావస్తుండడంతో అంతా దుకాణాలు మూసేసి హడావిడిలో ఉన్నారు.

కాలువ ఒడ్డుని చూసి వద్దామని దుకాణాలు దాటి ముందుకు నడిచేం. దుకాణాలకు, కాలువ ముఖద్వారానికి మధ్య పార్కు కట్టి ఉంది. అది దాటి కాస్త ఎత్తు గడ్డి లోంచి నడవగానే కాలువ ఉధృతంగా ప్రవహిస్తూ తీరాన్ని ఒరుసుకుంటూ బురద రంగులో దర్శనమిచ్చింది.

కాలువ అంటే మరీ పిల్లకాలువ కాదు. చిన్న సైజు నదిలానే ఉంది. ఒడ్డున నిలబడి ఫోటోలు తీసుకుందుకు దగ్గరికంటా వెళ్ళేం. కాలువ ఒడ్డున మట్టి చెమ్మగా ఉండడంతో నేను కాస్త ఎత్తుగా ఉన్న ప్రదేశంలో నిలబడ్డాను. సత్య వద్దన్నా వినిపించుకోకుండా ఒడ్డున ఒరుసుకుని నిలబడ్డ చెట్టు మొదలు వంటిది ఎక్కి నిలబడడానికి వెళ్ళేడు. సరిగ్గా మొదలు మీద కాలువేసేడో లేదో అప్పటివరకు కదలకుండా మోడులా ఉందని భ్రమింపజేసే ఆ చెట్టు ఒక్కసారిగా బోల్తా పడింది. సత్య చప్పున ఒడ్డుకి ఒక్క గెంతు గెంతాడు. లేకపోతే కాలువలో ఆ మోడుతో బాటూ కొట్టుకుపోయేవాడే. గట్టు మీంచి ఫోటో తీస్తున్న నాకు ఒక్క నిమిషం భయంతో గొంతు తడారిపోయింది. అప్పటికే దుకాణాలు కట్టేసుకుని అంతా వెళ్లిపోవడం వల్ల కనీసం పిల్లవాడు కూడా దగ్గర్లో ఎవరు లేరు. పిల్లల్ని వదిలొచ్చి ఇంకెప్పుడూ అలాంటి సాహసాలు చెయ్యకూడదని అర్థమయ్యింది. నాకు ఇప్పటికీ తల్చుకుంటే ఒళ్ళు గగుర్పొడిచే సన్నివేశం అది. అదృష్టం కొద్దీ ఆరోజు అలా ప్రమాదం తప్పింది. ఇక నేను అక్కడ ఒక్క క్షణం ఉండొద్దని బయలుదేరదీసేను.

తిరిగి రిసార్టుకి వచ్చేసరికి వచ్చి భోజనం కానిచ్చి అర్థరాత్రయినా తగ్గని వెలుతురు వల్ల నిద్రపట్టక మళ్లీ కాస్సేపు రిసార్టు ఆవరణలో పచార్లు చేస్తూ కబుర్లు చెప్పుకున్నాం. అద్దాల్లోంచి దూరంగా కనబడుతున్న కాలువ వైపు మాత్రం చూడడానికి మనస్కరించలేదు నాకు. మర్నాడు మేం మొదట బస చేసిన ఎంకరేజ్ మీదుగానే ప్రయాణం చేసి ఎంకరేజ్కి దక్షిణంగా ఉన్న సీవార్డ్ అనే ఊరికి పొద్దున్నే ప్రయాణం చెయ్యాల్సి ఉంది.

*(ఇంకా ఉంది)*

◆ ◆ ◆

# భాగం-12

మర్నాడు బయటంతా చిన్న జల్లు పడుతూ ఉంది. ఉదయానే లేచి తయారయ్యి రిసార్ట్ ఆవరణలో ఉన్న చిన్న అందమైన గ్రీన్ హౌస్‌ని చుట్టి వచ్చాము.

కాస్సేపట్లోనే సీవార్డ్ లోని మా రిసార్టు నుంచి వీడ్కోలు తీసుకుని బస్సులోకి ఎక్కి మాకు నిర్దేశించిన సీట్లలో ఉదయం 8 గం.ల కల్లా కూచున్నాం.

మేం మొదట బస చేసిన ఎంకరేజ్ మీదుగానే ప్రయాణం చేసి ఎంకరేజ్‌కి దక్షిణంగా దాదాపు 125 మైళ్ళ దూరంలో ఉన్న సీవార్డ్ అనే ఊరికి మా ప్రయాణం మొదలయ్యింది. మొత్తం తల్కీట్నా నుంచి 250 మైళ్లు. దాదాపు అయిదు గంటల పైనే ప్రయాణం. మధ్యలో ఏంకరేజ్ లో ఒక గంట భోజనవిరామంతో కలిపి ఆరు గంటలు.

బస్సు ప్రయాణం రైలు ప్రయాణమంత ఆహ్లాదంగా లేకున్నా పిల్లలు మారుమాట్లాడకుండా కూచున్నారు పాపం. ఈ బస్సులో సీట్లు బాగా సౌకర్యవంతంగా ఉండడం వల్ల, పొద్దున్నే లేచి ప్రయాణం ప్రారంభించడం వల్ల దాదాపు రెండు గంటల పాటు అందరం నిద్రపోయేం.

ఆ ముందురోజు నుంచే నాకు పాదాల వేళ్ళు దురదలు పెట్టసాగేయి. ఏవో కుట్టేయని అనిపించసాగింది. అప్పటికొద్దీ ఏదో ఫస్ట్ ఎయిడ్ చేస్తే తగ్గినట్లే తగ్గి మళ్లీ ఆ ప్రయాణమంతా భలే ఇబ్బంది పెట్టింది.

ఏంకరేజ్ చేరేసరికి మధ్యాహ్నభోజన సమయమయ్యింది.

సామాన్లు బస్సులోనే వదిలి డౌన్ టౌన్‌లో నిర్దేశిత ప్రదేశంలో ప్రయాణికులందర్నీ దిగమన్నారు.

అక్కణ్ణించి ఎవరికి ఇష్టం వచ్చిన చోటికి వారు వెళ్లి భోజనాదులు కానిచ్చి మరో గంటలో తిరిగి అక్కడికే రావాలన్నది నిబంధన.

మేం దిగిన ఏరియా ఒక మ్యూజియం అని అర్థమైంది.

అయితే అక్కణ్ణించి ఎటు వెళ్తే ఏముంటాయో తెలియక ముందు అక్కడక్కడే తచ్చట్లాడేం.

పిల్లల్ని తీసుకుని వెతుక్కుంటూ తిరగడం కష్టం కాబట్టి, నేను, వరు ముందు వెళ్లి ఒక పీజా టేకవుట్ ప్రదేశం చూసి వచ్చాము.

తీరా పీజా టేకవుట్ తీసుకున్నాక ఎక్కడ కూచుని తినాలో అర్థం కాని ప్రదేశమది.

అదృష్టం కొద్దీ దానికి అనుకుని ఉన్న చిన్న రెస్టారెంటులో చిన్నపాటి ఆర్డర్ ఏదో కూడా చెప్పి వాళ్ళ ఆవరణలో ఉన్న కుర్చీల్లో కూచుని తిన్నాం. రెస్టారెంటు వాళ్లు మేం పీజా వేరే చోటి నుంచి తెచ్చుకుని తింటున్నా మా పిల్లల్ని చూసి ఏమీ అనకుండా ఊరుకున్నారు.

మాకిచ్చిన గంటలో తిని మళ్లీ వెనక్కి రావడానికి సమయం సరిగ్గా సరిపోయింది.

దారిపొడవునా భూభాగం లోపలికి చొచ్చుకొచ్చిన సముద్రపు నీటి ప్రవాహాలు, ఎత్తైన కొండలు, దూరంగా కనబడే మంచు శిఖరాలతో ఆ మధ్యాహ్న ప్రయాణం ఆహ్లాదంగా జరిగింది.

మరో రెండు గంటల్లో సీవార్డ్ చేరుకున్నాం.

ఎంకరేజ్ నుంచి పూర్తి దక్షిణదిక్కులో ఉన్న సీవార్డ్ సముద్రతీరపు అందమైన పట్టణం.

మా బస్సు తిన్నగా మమ్మల్ని తల్కిట్నాలోలా రిసార్ట్ గుమ్మం ముందు దించింది.

అయితే రిసార్టులో చెకిన్ అయ్యేక మమ్మల్ని మా గది దగ్గిర దించడానికి వ్యాను వచ్చింది.

అప్పుడు అర్థమైంది ఆ రిసార్ట్ ఒక పెద్ద అపార్టుమెంటు కాంప్లెక్సు వంటిదని.

ఒక చోటి నించి మరో చోటికి నడవడానికి సమయం పడుతుందని.

ముఖ్యంగా సామాన్లతో, పిల్లలతో నడవడం అయ్యేపని కాదు.

పూర్తిగా చెక్కతో నిర్మించబడిన పెద్ద కాబిన్ కాంప్లెక్సుల్లో మా బ్లాక్‌లో చివరి కాటేజీ మాది.

అలాస్కాలో అంతవరకు మేం బస చేసిన అన్ని రిసార్ట్‌ల కంటే పెద్ద పెద్ద దుంగలతో తయారుచేసిన ఫర్నిచర్‌తో భలే విభిన్నంగా ఉంది ఇది.

*(ఇంకా ఉంది)*

♦ ♦ ♦

# భాగం-13

సీవార్డ్ విశేషాలు చెప్పుకునే ముందు తల్కీట్నా నుంచి సీవార్డ్ వరకు ప్రయాణంలో మరిన్ని విశేషాలు చెప్పాల్సి ఉంది.

తల్కీట్నా నుంచి సీవార్డ్ వెళ్లేదారి మొత్తం సముద్రపు పాయలు భూభాగంలోకి చొచ్చుకు వచ్చిన తీర ప్రాంతం నుంచి ప్రయాణం చేస్తాం.

బస్సు ప్రయాణిస్తున్న రోడ్డుకి ఒక పక్కగా పట్టాలు, మరో పక్క నీళ్లు.

ఏంకరేజ్ నుంచి మేం అలాస్కా టూరులో మొదట చూసిన విట్టియర్ వైపుగానే కొంత దూరం ప్రయాణం చేసాం.

ఆ రోజు మా రైలు ప్రయాణం చేసిన ప్రపంచంలోనే పొడవైన టన్నెల్ (2.5 మైళ్లు) జ్ఞాపకం వచ్చింది.

అప్పుడు చూసిన సముద్ర తీరం మొత్తం నీటితో తళతళలాడినట్టు గుర్తు. కానీ ఇప్పుడు మొత్తం బురదమయంగా ఉంది.

దానికి సమాధానంగా అన్నట్టు బస్సులో డ్రైవర్ కం గైడు అలాస్కాలోని తీర ప్రాంతాల్లో సముద్ర మట్టం ఆటూ పోటుల్లో తేడా దాదాపు 35 అడుగులు ఉంటుందని చెప్పగా విని ఆశ్చర్యపోయేం.

అందుకే ఇక్కడ బెలూగాలు, సాలమన్లు అనే నీటి ప్రవాహానికి ఎదిరీదే చేపలు మాత్రమే నివాసం ఉంటాయట.

అలాగే మార్గమధ్యంలో కొన్ని చెట్లు కాలిపోయినట్లు, ఉప్పు పట్టినట్లు వింతగా కనిపించాయి.

1962లో అలాస్కాలో సంభవించిన అతిప్రమాదమైన 9.2 భూకంపం వల్ల సముద్ర మట్టం అమాంతం పెరిగి ఇక్కడి తీర ప్రాంతాన్ని రోజుల తరబడి కప్పివేసిందట.

అన్ని రోజుల పాటు ఉప్పునీటిలో నానిపోయిన చెట్లు చివికిపోయి ఇప్పటికీ అక్కడక్కడా సాక్షాత్కరిస్తూ ఉన్నాయట.

మార్గమధ్యంలో పర్వతాల కొనలమీద ఒక్కోచోట ఎక్కడా ఒక్క మొక్క కూడా లేకుండా

నున్నని రాతి పలకల్లా ఉండడం గమనించాం. శతాబ్దాల తరబడి మంచుతో కప్పబడి ఉన్న గ్లేసియర్లు కరిగిపోయేక బయట పడ్డ పర్వతాలట అవి.

అందుకే అక్కడ ఇప్పటికీ మొక్కలు మొలవడం లేదన్నమాట.

తల్కీట్నా నుంచి సీవార్డ్కి చేసిన అయిదారు గంటల ప్రయాణం ఆహ్లాదకరంగా జరిగినా బస్సు సీవార్డ్లో దిగే సరికి సిరికి జ్వరం వచ్చేసింది.

బస్సులో మావి చివరి సీట్లు కావడం, బాత్రూం పక్కనే సీట్లు ఉండడం మొదట చికాకు అనిపించినా సిరికి దారి పొడవునా అస్తమాటూ బాత్రూములోకి తీసుకు వెళ్లాల్సి రావడంతో మేం అక్కడ కూర్చుని ఉండడమే మంచిదనిపించింది.

సాయంత్రం సీవార్డ్ చేరేక సిరికి జ్వరం మందు వేసేసరికి అలిసిపోయి నిద్రపోయింది.

ఈ ప్రయాణంలో ఇంకో అపశృతి ఏవిటంటే సీవార్డ్ చేరేసరికి నాకు రెండు పాదాల వేళ్ళ మీద అక్కడక్కడా చిన్న నీటి పొక్కుల్లా వచ్చి విపరీతమైన దురద ప్రారంభమయ్యింది.

ఏదో ఎలర్జీ వచ్చి ఉంటుందని తర్వాత మూడు రోజులకి ఇంటికి వచ్చే వరకు ఫస్ట్ ఎయిడ్ ఏదో చేసి ఓపిక పట్టాను. అయితే తేలిన విషయం ఏవిటంటే అలాస్కాలో మాత్రమే ఉండే బెడ్ బగ్స్ వంటి కొన్ని పురుగులు కుడితే మాత్రమే వచ్చే అంటువ్యాధి అట అది.

ఇందుకు నాతో బాటూ ఇంట్లో అందరం తలా ఒక క్రీము కొనుక్కుని వారం పాటు కాళ్లకే కాదు, ఒళ్ళంతా పట్టించుకోవలసి వచ్చింది.

నాకు మరో వారం తర్వాత మొత్తం తగ్గేవరకూ ఆగి అందరం మరో రౌండు డాక్టర్లకి చూపించుకోవాల్సి వచ్చింది.

దెనాలి నేషనల్ పార్కులో మేం ఉన్న హిల్ రిసార్ట్లో ఒక విధమైన పాతకాలపు గడ్డి పరుపుల వంటివి ఉండడంతో బహుశా: అక్కడే ఏవో కుట్టి ఉంటాయని నేను అంచనా వేసుకున్నాను. లేదా ప్రయాణమంతా దాదాపుగా చెప్పులు వేసుకుని తిరిగినందువల్ల ఎక్కడైనా ఏవైనా కుట్టి ఉండవచ్చు. ఏదేమైనా అలాస్కాలో ఇటువంటి బగ్స్‌తో జాగ్రత్తగా ఉండాల్సిందే.

ఇక ఇంతకు ముందు భాగంలో చెప్పినట్టు సీవార్డ్ లోని హొటలు రిసార్ట్ ఒక పెద్ద అపార్టుమెంటు కాంప్లెక్సు వంటిది.

ఒక చోటి నించి మరో చోటికి నడవడానికి సమయం పడుతుంది. పూర్తిగా చెక్కతో

నిర్మించబడిన పెద్ద కాబిన్ కాంప్లెక్సుల్లో మా బ్లాక్‌లో చిట్టచివరి కాటేజీ మాది. అంతవరకు అలాస్కాలో మేం బస చేసిన అన్ని రిసార్ట్‌ల కంటే పెద్ద పెద్ద దుంగలతో తయారుచేసిన ఫర్నిచర్‌తో భలే విభిన్నంగా ఉన్న రిసార్ట్ ఇది.

వరు కూడా హొటలులో ఉండిపోతాననడంతో అలా తిరిగొద్దామని ఊర్లోకి మేమిద్దరం బయలుదేరేం.

రిసార్టు ఎంట్రెన్సు దగ్గర నుంచి డౌన్ టౌన్‌కి షటిల్ సర్వీసు ఉండడంతో అక్కడి వరకు నడిచి అక్కడి నుంచి డౌన్ టౌన్‌కి పది పదిహేను నిమిషాల్లో చేరుకున్నాం.

సీవార్డ్ లోని డౌన్ టౌన్ మొత్తం ఒక్కప్పుడు గ్లేసియర్ అట. ఎత్తున కొండ మీద నుంచి సముద్రంలో కలిసేవరకు ఉన్న సహజ సిద్ధమైన రహదారే ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యం. మేం నిలబడ్డ చోట కొన్ని వేల, లక్షల సంవత్సరాల కిందట గ్లేసియర్ ఉండేదని తల్చుకోవడానికే ఒళ్ళు గగుర్పొడిచింది.

*(ఇంకా ఉంది)*

♦ ♦ ♦

# భాగం-14

# సీవార్డ్ డౌన్ టౌన్

రిసార్టు ఎంట్రైన్సు దగ్గర నుంచి డౌన్ టౌన్‌కి షటిల్ సర్వీసు ఉండడంతో అక్కడి వరకు నడిచి అక్కడి నుంచి డౌన్ టౌన్‌కి పది పదిహేను నిమిషాల్లో చేరుకున్నాం.

డౌన్ టౌన్‌కి చేరుకున్న షటిల్ సర్వీసు సముద్రతీరంలో ఆగింది. అక్కణ్ణించి చూస్తే ఎత్తున కొండమీదికి అధిరోహిస్తున్నట్టు విశాలమైన రహదారి. ముందు చెప్పినట్టు సీవార్డ్ లోని ఈ డౌన్ టౌన్ మొత్తం ఒక్కప్పుడు గ్లేసియర్ అట. ఎత్తున కొండ మీద నుంచి సముద్రంలో కలిసేవరకు ఉన్న సహజ సిద్ధమైన ఈ రహదారే ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యం.

ఓ పక్క ఊరించే సముద్రతీరం మరోపక్క స్థానికతని ఉత్సుకతతో కళ్ళకి కడుతున్న ఊరు.

ఎప్పటిలాగే ముందు సముద్రతీరానికి పరుగుపెట్టడానికి వీల్లేకుండా సమయం కాళ్ళు కట్టిపడేసింది.

సాయంత్రం ఎనిమిది దాటితే దుకాణాలు మూసేస్తారు కాబట్టి అటు నడిచేం.

త్రోవ పొడవునా దుకాణాల్ని చూసుకుంటూ హుషారుగా కబుర్లు చెప్పుకుంటూ నడకసాగించేం.

ఎదురుగా అతిపెద్ద పర్వతాలు, వాటిమీద ముసుగుల్లా కప్పుకున్న మేఘాలు, పర్వత సానువులకు అప్పుడప్పుడే గోరింటాకు పెట్టినట్లు ముదురు ఆకు పచ్చని ఎత్తైన చెట్లు, పక్కనే లేతాకుపచ్చ గడ్డిభూములు, దడులనల్లుకున్న చిన్న గులాబీ రంగు పూలు స్వర్గలోకమంటే ఇలాగే ఉంటుందేమో అనిపించేటంత అందంగా ఉంది ఆ ఊరు.

సీవార్డ్ అందమైనదే కాకుండా చరితాక ప్రాధాన్యత కలిగినది. ఇక్కడ ఉన్న సహజసిద్ధమైన ప్రధాన ఓడరేవులో పెద్ద పెద్ద ఓడల నుండి చిన్న చేపల పడవల వరకు నిలిచి ఉంటాయి. ఇక్కడి తీరం సాలమన్ చేపలకు ప్రసిద్ధి. ఇక్కడినుండి చుట్టుపక్కల ఉన్న ప్రాంతాలకే కాక కెనడా, అమెరికాలోని పశ్చిమ తీర ప్రాంతాలకు ఓడ రవాణా సౌకర్యం ఉంది. అంతేకాకుండా అలాస్కా లోని చారిత్రక రైల్వే లైనుకి దక్షిణ కొన సీవార్డ్.

మేం మర్నాడు ఈ ఓడరేవు నించే రెండవ గ్లేసియర్ టూరుకి వెళ్లాల్సి ఉంది.

ఇక డౌన్ టౌన్‌లో ప్రసిద్ధి చెందిన బిగ్ ఫుట్ అనబడే అతిపెద్ద గాడ్జిలా వంటిది ఉన్న దుకాణానికి వెళ్లి ఫోటోలు తీసుకున్నాం. అమెరికాలో ఇటువంటి పెద్ద జంతువులు అక్కడక్కడా ఉంటాయని, వాటిని అక్కడా ఇక్కడా చూసాం అని కథలు ఇప్పటికీ ప్రచారంలో ఉంటూ ఉంటాయి. అక్కడ ఏమీ కొనకుండా కేవలం ఫోటోలు తీసుకోవడం బాగోదని పిల్లల కోసం బొమ్మలు కొన్నాం. దుకాణాదారే స్వయంగా ముందుకొచ్చి రెండు మూడు ఫోజుల్లో మాకు ఫోటోలు తీసేడు.

ఇంకాస్త ముందుకెళితే ఒక చోట దుకాణాలు ఉన్న పక్క గోడలన్నీ చక్కని పెద్ద పెద్ద వర్ణ చిత్రాలు గీసి ఉన్నాయి.

అది సీవార్డ్ ఆర్ట్ మ్యూజియం. అయితే అప్పటికే సమయం అయిపోవడం వల్ల మూసేసి ఉంది. కానీ చుట్టూ ఉన్న వర్ణ చిత్రాలు చూస్తూ, వాటిలో విశేషాలు గమనిస్తూ కాసేపు గడిపేము.

దార్లో మాకు ఆ అలాస్కా ప్రయాణంలో అక్కడక్కడా కనిపించిన మరో జంట ఎదురయ్యేరు. పరిచయంగా ఒకరినొకరు చూసుకుని నవ్వుకున్నాం. వాళ్ళేదో భోజనం చెయ్యడానికి ఆగిపోయేరు. మేం ముందుకు వెళ్లి పిల్లలకి మరిన్ని బొమ్మలతో పాటూ ముప్ఫయి డాలర్లు పెట్టి ఊలూ (ఖూఖ) కత్తి ఒకటి కొన్నాం. ఊలూ కత్తి అలాస్కాలో మాత్రమే వాడే అర్థచంద్రాకారపు కత్తి. పైన అరచేతితో పట్టుకునే పిడి ఉండి కిందన కొయ్యడానికి చెక్క పలకతో బాటూ ఉంటుంది. ఇది ప్రధానంగా చేపలు కోసే కత్తి. ఇక్కడి వాళ్ళు అతి లాఘవంగా చేపల తోలు వలవడానికి కూడా ఈ కత్తి వాడతారు. మేం అలాస్కాలో ప్రతి దుకాణంలోనూ ఈ కత్తిని చూస్తూ వస్తున్నాం కానీ ఇక ఎలాగూ రెండురోజుల్లో వెనక్కి తిరిగి వెళ్ళేది ఉంది కాబట్టి అని ఇక అక్కడ మొత్తానికి కొన్నాం. నేను ఊలూ కత్తి ఆకారంలో అలాస్కన్ జేడ్ లాకెట్టు, చెవులవి కూడా కొనుక్కున్నాను. అయితే ఈ కత్తి ఆ తరవాత ఎయిర్ పోర్టులో పెద్ద కథగా మారింది. కత్తి కొనేటప్పుడు మేం అలాస్కాకి విమానంలో వచ్చామన్న విషయం ఇద్దరం మర్చిపోయేము. తిరిగి వెళ్ళేటపుడు సరిగ్గా లైనులో ఎయిర్ పోర్టు చెకింగు లైనుకి వెళ్లే ముందు అక్కడ నిషేధిత వస్తువుల జాబితాలో ఊలూ కత్తి బొమ్మ చూసి నిశ్చేష్టులయ్యేం. అంటే చేత్తో పట్టుకెళ్ళే కేబిన్ బ్యాగేజీలో పట్టుకెళ్ళకూడదు. అసలు చిన్న నెయిల్ కట్టర్‌ని కూడా అనుమతించని వాళ్ళు ఇంత కత్తిని పెట్టుకెళ్ళనిస్తారా మా పిచ్చి కాకపోతే. అంత ఇష్టపడి కొనుక్కున్న వస్తువుని అక్కడ పడెయ్యడం ఇష్టం లేక మొత్తానికి ఒక సూట్‌కేసుని మరో ముప్ఫయి డాలర్లు పెట్టి చెకిన్ చేసేం. వెరసి దాని ఖరీదు అరవై డాలర్లు అయ్యింది. నిజానికి ఆన్ లైనులో కూడా అమ్ముతారు. లేదా అక్కడే కొనుక్కున్న చోట దుకాణంలో మరో పది డాలర్లు

కడితే ఇంటికి పార్సిల్ పంపుతారు. ఇలా చేత్తో కొనుక్కుని తెచ్చుకోవడం వంటివి మాత్రం అస్సలు చెయ్యకూడదని అర్థం అయ్యింది. మొత్తానికి ఈ ప్రయాణంలో ఈ కత్తి ఒక కథ అయిపోయింది.

సరిగ్గా గంట సేపు సీవార్డ్ డౌన్ టౌన్‌లో మమ్మల్ని వెనక్కి రిసార్ట్‌కి తీసుకెళ్లే బస్సు సమయం అవుతుండడంతో తిరిగి వెనక్కి సముద్రతీరానికి వచ్చాము. అక్కడే ఉన్న పార్కులో ట్రైల్ బ్లేజర్స్ అనే పేరుతో పెంపుడు కుక్కని చేత్తో పట్టుకుని, నడకదారిలో అలాస్కాలోని బంగారు గనులని వెతుక్కుంటూ బయలుదేరిన తొలితరం ప్రతినిధి విగ్రహం దగ్గర ఫోటోలు తీసుకున్నాం. **1910** ప్రాంతంలో తొలి తరం గోల్డ్ రష్ అమెరికన్లు సీవార్డ్ లో ఓడ దిగి అక్కడి నుండి ఇదితరోడ్ పుంత మార్గం (×సఋఖతీశీస ుతీఖఱశ్రీ) గుండా సీవార్డ్ నుండి **958** మైళ్ళు ఉత్తరానికి బంగారు గనుల అన్వేషణలో నడిచి వెళ్ళేవాళ్ళట. ఈ తీరం నుండి మిలియన్ల కొద్దీ బంగారం, వ్యాపారం జరుగుతూ ఉండేదట. ఇలా బంగారం అన్వేషణ కోసం వచ్చిన వారి జీవనావసరాల కోసం కావాల్సిన తిండి, సౌకర్యాల వ్యాపారం బంగారాన్ని మించిన మరింత పెద్ద వ్యాపారం. వీటన్నింటికి ఆ రోజుల్లో సీవార్డ్ అతిపెద్ద కేంద్రమట.

అక్కడి సముద్ర తీరం పెద్ద పెద్ద రాళ్లతో, చెక్క ఫెన్సుతో దిగడానికి వీలులేదు. కానీ అత్యంత అందమైన ఆ సముద్ర తీరాన్ని వదిలి రావాలనిపించలేదు. ఇక సరిగ్గా పది నిమిషాల్లో అక్కణ్ణించి బస్టాపుకి వచ్చే సరికి సరిగ్గా అనుకున్న సమయానికి బస్సు వచ్చి అక్కడ వేచి ఉంది.

*(ఇంకా ఉంది)*

♦ ♦ ♦

# భాగం-15

సీవార్డ్ డౌన్ టౌన్ సందర్శనం పూర్తి చేసుకుని వెనక్కి రిసార్టుకి చేరుకుని, పిల్లల్ని తీసుకుని రిసార్ట్ ఆఫీసు దగ్గర ఉన్న ఫైర్ ప్లేస్ దగ్గిర ఉన్న సిటింగ్ ఏరియాలో కూర్చుని ఉండగా అదే సమయానికి మాకు ఆ అలాస్కా ప్రయాణంలో కనిపిస్తూ వచ్చిన మరో జంట కూడా వచ్చేరు. వాళ్లు తెలుగు వాళ్ళని తెలిసి సంతోషించడమే కాకుండా పరిచయాలు చేసుకుని చాలా సేపు కబుర్లు చెప్పుకున్నాం. వాళ్లు ప్యాకేజీ టూరులో కాకుండా వాళ్ళంతట వాళ్ళు బుక్ చేసుకుని వచ్చారట. మేం చూసిన ఊళ్లన్నీ వాళ్ళు కూడా తిరిగేరు. కానీ తీరా ఏ ఊరు వెళ్లినా ఎక్కడా యాక్టివిటీస్‌కి వాళ్ళకి రిజర్వేషన్లు దొరకడం లేదని వాపోయారు. మొదటిరోజు గ్లేసియర్ క్రూజ్ టూరు బుక్ చేసుకున్నా షిప్పు ఎక్కడ బయలుదేరుతుందన్నది చివరి నిమిషం వరకు తెలుసుకోక అది కూడా మిస్ అయిపోయారట. నిజానికి ఆ టూరులో షిప్పు ఎంకరేజ్ నుంచి రెండున్నర గంటల రైలు ప్రయాణపు దూరంలో బయలుదేరుతుంది. ఆ కనెక్షను రైలు పట్టుకోలేకపోతే షిప్పు అందదు.

ప్యాకేజీ టూరుగా అలాస్కా ప్రయాణం చెయ్యడం ఎంత సౌఖ్యవంతమైందో అర్థమైంది మాకు. ఎక్కడికక్కడ కనెక్టింగ్ రైళ్లు, బస్సులు ఐటినరరీ లోనే ముందే బుక్ చేసి ఉంచడమే హొటళ్ల నించి రైలు, బస్సు స్టేషన్లకు ట్రాన్స్ పోర్ట్‌కి కూడా వెతుక్కోనవసరం లేదు. ఇక హొటళ్లు చెప్పనవసరం లేదు. బుక్ చేసుకున్న ప్యాకేజీ ప్రకారం సౌకర్యవంతంగా ఉంటాయి. ముఖ్యంగా పిల్లలతో ప్రయాణం చేసేటప్పుడు, పీక్ సీజన్‌లో ప్రయాణం చేసేటప్పుడు ప్యాకేజీ టూరు ఉత్తమం.

ఇక మా ప్రయాణంలో చివరి రోజు ఎట్రాక్షన్‌గా మేం ఆ మర్నాడు సీవార్డ్ తీరంలో గ్లేసియర్ క్రూజ్ ఎక్కబోతున్నాం.

ఈ అలాస్కా ప్రయాణంలో దాదాపుగా అన్నీ చూడాలన్న ఉత్సుకతతో రెండు గ్లేసియర్ క్రూజ్ లు, రెండు గ్లాస్ డూమ్ రైలు ప్రయాణాలు ప్యాకేజీలో భాగం చేసేం. కానీ ఒకొక్కటి చాలని చివరి రోజు మళ్లీ గ్లేసియర్ క్రూజ్ ఎక్కినపుడు అనిపించింది. పిల్లలు అప్పటికే అలిసిపోయి క్రూజ్‌లో చాలా భాగం నిద్రపోతూనే ఉన్నారు. ఇక సిరి పరిస్థితి చెప్పనవసరం లేదు. అస్సలు తినడం మానేసి డీలా పడిపోయింది.

ఎప్పుడెప్పుడు ఇంటికి వెళ్ళిపోతామా అన్నట్టు తయారయ్యింది మా పరిస్థితి.

ఇక సీవార్డ్ తీరంలో గ్లేసియర్ క్రూజ్ ఉదయానే బయలుదేరింది. రిసార్ట్ నించి షటిల్ బస్సు క్రూజ్ బయలుదేరే షిప్ యార్డ్‌కి సరైన సమయానికి చేర్చింది. మేమున్న రిసార్ట్ ఖాళీ చేసేసి సామాన్లు మాతో తెచ్చేసుకున్నాం. ప్యాకేజీలో భాగంగా మా సామాన్లని క్రూజ్ నిర్వాహకులు సాయంత్రం మేం తిరిగొచ్చే వరకు వాళ్ళ దగ్గిర భద్రపరుస్తారు. సాయంత్రం వెనక్కి వచ్చి మేం తిరిగి ఎంకరేజ్ వెళ్లే బస్సులో ప్రయాణించి, ఆ మర్నాడు ఎంకరేజ్ నుంచి ఫ్లైట్‌లో వెనక్కి మా ఇంటికి వచ్చేస్తామన్న మాట.

సీవార్డ్ తీరంలో గ్లేసియర్ క్రూజ్ రెండస్థుల పెద్ద సైజు పడవ వంటిది. క్రూజ్ బయలుదేరడానికి గంట ముందుగానే మేమక్కడికి చేరుకోవడంతో షిప్పుయార్డ్‌లో అటూ ఇటూ కట్టిన చిన్న పడవుల్ని చూస్తూ తిరిగేం.

సిరి ఎక్కడికీ రానని పేచీ పెడితే అలాస్కాలో ఆ తీరంలో ప్రత్యేకించి కనబడే "పఫిన్" పక్షి బొమ్మ డబ్బాలో పెట్టి తమాషాగా ఉంటే కొనిచ్చాము. అప్పటికి అది చూసి ఊరుకుంది. కానీ నీరసానికి ఒక చోట కూర్చుండిపోయింది పాపం.

ఇక నేను కూడా సిరితో నీడ చూసుకుని కూర్చున్నాను.

ఇక అనౌన్సు మెంటు వస్తూ ఉండగా వెళ్లి లైనులో నుంచున్నాం. అదే సమయానికి దాదాపు ఆరు షిప్పులు బయలుదేరుతున్నాయి. ఇక అయిదు నిమిషాల్లో క్రూజ్ బయలుదేరుతుండగా ఒకతను లిస్టు పట్టుకుని అన్ని లైన్ల దగ్గరకు వచ్చి మా బుకింగ్ నంబరు, పేరు గట్టిగా చదవసాగేడు. అప్పుడు మేం గమనించిందేవిటంటే మేం మా పడవ దగ్గిర కాక మరోచోట లైనులో నిలబడ్డాం. అసలక్కడ సరైన గైడ్ లైన్స్ లేవు. మొత్తానికి లాస్ట్ మినిట్‌లో పరుగున వెళ్లి మా అసలు క్రూజ్‌లో కూలబడ్డాం.

*(ఇంకా ఉంది)*

♦ ♦ ♦

# భాగం-16

# కెనాయ్ ఫియోర్డ్స్ నేషనల్ పార్క్ క్రూజ్

సీవార్డ్ తీరంలో మాకోసమే నిలిచి ఉన్న కెనాయ్ ఫియోర్డ్స్ నేషనల్ పార్క్ క్రూజ్ (Kenai Fjords National Park Cruise)ని చివరి నిమిషంలో ఎక్కగలిగేం.

నిజానికి అప్పటికే విట్టియార్ తీరం నుండి గ్లేసియర్లని ఒకసారి చూసేసినందువల్ల ఈ ట్రిప్పులో పెద్దగా చూసేవి ఏమీ ఉండవేమో అని భావించినా సీవార్డ్ తీరం ప్రధానంగా అలాస్కా తీర ప్రాంతపు పక్షుల అభయారణ్యం.

ఇక్కడ చూసే స్థానిక పక్షులు మరెక్కడా కనిపించవు. అలాస్కాలో ప్రత్యేకించి సీవార్డ్ తీరంలో కనబడే "పఫిన్" పక్షులు, త్రోవ పొడవునా చిన్న చిన్న ద్వీపాల్లో గూళ్లు కట్టుకుని నివసిస్తున్న అనేక రకాల ఇతర అందమైన పక్షుల్ని ఇక్కడ చూడొచ్చు.

కానీ పిల్లలు అప్పటికే వారం పాటు అలిసిపోయినందువల్ల క్రూజ్‌లో చాలా భాగం నిద్రపోతూనే ఉన్నారు. ఇక అస్సలు తినడం మానేసి పూర్తిగా డీలా పడిపోయిన సిరి పరిస్థితి చెప్పనవసరం లేదు.

ఇక ఫియోర్డ్ (Fjord) అంటే ఎత్తైన మంచు శిఖరాల మధ్య లోనికి చొచ్చుకొచ్చిన సముద్ర ప్రవాహపు అఖాతం.

కెనాయ్ ఫియోర్డ్స్ నేషనల్ పార్క్ దాదాపు 670 వేల ఎకరాల మేర విస్తరించి ఉంది. ఇందులో అమెరికాలోకెల్లా అతిపెద్దవైన గడ్డకట్టిన మంచు భూభాగాలు, ఎత్తైన శిఖరాల మధ్య విస్తరించి ఉన్న 38 హిమానీ నదాలు, అఖాత సముద్ర ప్రవాహాలు (ఫియోర్డ్స్) ఉన్నాయి. ఈ తీరమంతా కెనాయ్ ద్వీపకల్పంలో భాగంగా ఉంది.

అటువంటి అఖాత సముద్ర ప్రవాహంలో ప్రయాణించడమే ఒళ్ళు గగుర్పొడిచే విషయం.

దాదాపు పదకొండున్నర గంటల ప్రాంతంలో క్రూజ్ బయలుదేరింది. మా నిర్దేశిత టేబుళ్ల దగ్గర కూర్చోగానే మధ్యాహ్న భోజనం సిద్ధమై వచ్చింది.

తీరం అందేటట్టు సాగుతున్న పెద్ద పడవ ప్రయాణంలో పడవ అంచుల్ని ఒరుసుకుని ఎగిసి

పడుతున్న అలల మధ్య తూగుటుయ్యాలలా సాగింది మా ప్రయాణం.

త్రోవలో తీరం వెంబడి వరసగా సముద్రంలోంచి పొడుచుకొచ్చిన కత్తుల్లా చిన్న చిన్న ద్వీపాలు ఎన్నో ఉన్నాయి.

రాతి తోరణాలు ఉన్నాయి. ఆ చిన్న చిన్న ద్వీపాల మీద వందల పక్షులు గూళ్లు కట్టుకుని రొదరొదగా వాటి ప్రపంచంలోకి చొచ్చుకొచ్చిన వింత జీవులన్నట్టు మా వైపు చూడసాగేయి.

ఒక ద్వీపం నిండా సముద్రంలో అదేపనిగా ఈత కొట్టడం వల్ల అలసటతో భారీ శరీరాల్ని రాళ్ళ మీద ఒళ్ళు తెలియకుండా నిద్రపోతూ ఆరబెట్టుకుంటున్న సీల్ చేపలు.

మరో ద్వీపం నిండా కువకువలాడుతూ నీళ్ల కంటే ధగ ధగా మెరిసే నల్లటి మేనిఛాయతో, తెల్లటి పొట్టతో, నారింజరంగు ముక్కు, అదేరంగు బాతు కాళ్లతో ముద్దొచ్చే పఫిన్ పక్షులు.

చూడడానికి రెండు వైపులా రెండు కళ్ళూ చాలని మంచు శిఖరాల, హిమానీ నదాల పర్వత శ్రేణులు.

ఒక గొప్ప అద్భుతమైన, అందమైన ప్రయాణం అది.

ఇక అక్కడ అన్నిటికంటే పెద్దదైన బేర్ గ్లేసియర్ దగ్గరకి వెళ్లి పడవని ఆపగానే హృదయం ఆగి కొట్టుకునే గొప్ప నిశ్శబ్దం ఆవరిస్తుంది. తరతరాలుగా అంతరాంతరాల్లో కొద్దికొద్దిగా ప్రవహిస్తూ మనకోసమే సముద్రంలోకి వయ్యారంగా జాలువారుతున్న హిమానీ నదం అక్కడక్కడా లేత నీలిరంగు అద్దుకుని ఎదుట ప్రత్యక్షమయ్యినపుడు మనసు పరవశమై ఆనందతాండవం చేస్తుంది.

పడవ వెనక్కి తిప్పగానే ఈ ప్రయాణంలో చివరిసారి దగ్గరనించి చూస్తున్న గ్లేసియర్ అదేనని అర్థం కావడంతో మనసంతా బెంగ ఆవరించింది.

గ్లేసియర్ దగ్గిరికి వెళ్ళగానే సముద్రంలోకి పెళ్లలుగా విరిగిపడి నీళ్లలో వెన్నముద్దల్లా తేలుతున్న మంచుని తోడి తీసి అడిగినవారికి డ్రింకుల్లో వేసి ఇవ్వసాగేరు.

అక్కడక్కడా పళ్లేల్లో పెట్టి ప్రదర్శనకు కూడా ఉంచేరు.

ఒకవైపంతా నిద్రలో జోగిన పిల్లలు కూడా గ్లేసియర్ దగ్గిరికి వచ్చేసరికి హుషారుగా పై డెక్ మీదికి పరుగుతీసేరు.

అవును మరి, ఎన్నిసార్లు చూసినా తనివితీరని అద్భుతం హిమానీ నదం.

మరో రెండుగంటల్లో తిరిగి సీవార్డ్ తీరానికి చేరుకున్నా అందమైన ఆ దృశ్యం అలా మదిలో ప్రత్యక్షమవుతూనే ఉంది.

ఆ క్రూజ్‌లో ప్రయాణం చేసినందుకు గాను మాకు ఇరవై డాలర్ల విలువ చేసే కెనాయ్ ఫియోర్డ్స్ నేషనల్ పార్క్ వాటర్ గ్లోబు ఒకటి బహుమతిగా ఇచ్చారు.

అపురూపమైన ఆ బహుమతిని ఇంటివరకు తెచ్చుకోవడానికి వీలుపడదని అప్పుడు తెలియలేదు.

*(ఇంకా ఉంది)*

♦ ♦ ♦

# చివరి భాగం

కెనాయ్ ఫియోర్డ్స్ నేషనల్ పార్క్ క్రూజ్ (Kenai Fjords National Park Cruise) ప్రయాణాన్ని ముగించుకుని, ఎన్నో అందమైన ఆ దృశ్యాలు మనస్సుల్లో దాచుకుని సాయంత్రం ఐదుగంటల ప్రాంతంలో తిరిగి సీవార్డ్ తీరానికి చేరుకున్నాం.

క్రూజ్ దిగిన చోటి నుంచి మళ్ళీ మాకు నిర్దేశించిన షటిల్‌లో పదినిమిషాల వ్యవధిలో రైలు స్టేషనుకి చేరుకున్నాం.

అప్పటికే గోల్డ్ స్టార్ డూమ్ రైలు మా కోసం సిద్ధంగా ఉంది. పొద్దుట్నించి అలిసిపోయినా డూమ్ రైలు చూసేసరికి పిల్లలు హుషారు తెచ్చుకున్నారు. అందుక్కారణం చుట్టూ అద్దాలతో ఆహ్లాదంగా సాగే ప్రయాణం ఒక్కటేకాదు, రకరకాల జ్యూసులు, పానీయాలు, పుడ్డింగులు వంటివి టిక్కెట్లో భాగంగా అందజేస్తారు మరి!

మా చిన్నపాప సిరివెన్నెల చాలా ఓపికమంతురాలు. ఒంట్లో బాలేకపోయినా పేచీ పెట్టదు ఎప్పుడూ. ఈ ప్రయాణంలో తనకు రెండవ రోజు నుంచే భోజనం సహించక పోయినా ఇలా జ్యూసుల వంటివి తాగి తన మట్టుకు తను నిద్రపోతూ, మాతో ఎక్కడికంటే అక్కడికి నిశ్శబ్దంగా నడుస్తూ ఉంది పాపం.

మా అలాస్కా ప్రయాణంలోని చివరి రైలు ప్రయాణం ముగించుకుని మరొక రెండుగంటల్లో యాంకరేజ్ చేరుకున్నాం. కానీ రైలు స్టేషను నుంచి హొటలుకి వెళ్ళడానికి షటిల్ కోసం హొటలుకి ఫోను చేసి అదొచ్చే వరకు ఒక అరగంట స్టేషను బయట వేచి ఉండవలసి వచ్చింది. స్టేషనులో అదే చివరి బండి కావడం వల్ల లోపలా, బయట ఎవరూ లేరు. బయట కూర్చునేందుకు బల్లలు వంటివి ఏవీ లేవు. దర్జాగా డూమ్ రైలు ప్రయాణం చేసివచ్చినా అలిసిపోయినందువల్ల కాళ్లలో సత్తువలేక పిల్లలు లగేజీ పక్కనే అతిశుభ్రమైన నేలమీద బైఠాయించారు. మొత్తానికి మరోగంటలో తిరిగి మేం మొదటి రోజు బస చేసిన హొటలుకే చేరుకున్నాం.

వేసవి కాలం కావడంతో అలాస్కాలో అర్ధరాత్రి పన్నెండు వరకు వెలుతురు ఉండడంతో ఏది సాయంత్రమో, ఏది రాత్రో కూడా చెప్పలేం. ఇలా వెలుతురు ఉండడం వల్ల పిల్లలు సరిగా నిద్రపోక సగం నీరసం అయిపోయేరు.

అయినా మర్నాడు పొద్దున్న ఇంటికి వెళ్తున్నామంటే అందరికీ మళ్లీ హుషారు ముంచుకొచ్చింది.

ఎక్కడికెళ్లినా ఇలా తిరుగు ప్రయాణం రోజుకి పిల్లలు ఇంటికి వెళ్లడం అంటే భలే సంతోషపడతారు "హోమ్ స్వీట్ హోమ్" అనుకుంటూ. ఏమాటకామాటే చెప్పాలి! నాకు భలే ఆశర్యమూ, ముచ్చటా వేస్తుంది 'వీళ్ళకి ఇల్లంటే ఎంత ప్రేమో' అని.

ఇక మర్నాడు ఉదయం యథావిధిగా అలాస్కాకు వీడ్కోలు పలికి ఎయిర్ పోర్టుకి సమయానికి చేరుకున్నాం. అయితే చెకింగ్ లైనులో తీసుకురాకూడని వస్తువుల జాబితాలో ఉన్న "ఊలూ కత్తి"ని చూసి అప్పటికప్పుడు మేం ముచ్చటపడి సావనీరుగా కొనుక్కున్న ఊలూ కత్తి కోసం ముప్ఫై డాలర్లు ఫీజు కట్టి ఒక సూట్ కేసుని చెకిన్ బ్యాగేజీగా ఇచ్చేశాం. అయితే అప్పుడు కూడా మేం తెలుసుకోలేక పోయిన విషయం ఏవిటంటే ముందురోజు క్రూజ్‌లో ప్రయాణం చేసినందుకు గాను మాకు బహుమతిగా ఇచ్చిన ఇరవై డాలర్ల విలువ చేసే కెనాయ్ ఫియోర్డ్స్ నేషనల్ పార్క్ వాటర్ గ్లోబు కూడా చెకిన్‌లో తప్ప మా చేతుల్లో ఉన్న బ్యాగుల్లో పెట్టుకోవడానికి వీలు లేదట. అందులో ఉండవలిసిన లిమిట్ కంటే లిక్విడ్ ఎక్కువ ఉందట. చూస్తూ ఉండగానే నా బ్యాగులోని గ్లోబుని చెత్త బుట్టలోకి గిరాటేసేరు చెకింగ్ స్టాఫు. మనసు ఎంత ఉసూరుమందో చెప్పలేను. చెప్పలేని దుఃఖం వచ్చింది ఎందుకో. దాని ఖరీదు కంటే అందమైన వస్తువు అది. ఎయిర్పోర్టు లోపలికి వెళ్ళేదారిలో కనబడ్డ మొదటి కుర్చీలో కూచున్న నన్ను చుట్టుముట్టి మరీ ఓదార్చేరు సత్య, పిల్లలూ.

అపురూపమైన వస్తువుని పోగొట్టుకున్నా చెదరని జ్ఞాపకాన్ని భద్రంగా తీసుకొచ్చుకున్నాను.

ఇంటికి వచ్చిన రెండు వారాల వరకు నాకు కాళ్ళ మీద ఇన్ సెక్ట్ బైట్స్ తగ్గక చాలా బాధ పెట్టేయి. అయినప్పటికీ

మళ్ళీ అలాస్కా అంటే 'మేం రెడీ' అనేంత బాగా నచ్చింది ఈ ప్రయాణం మా అందరికీ!

♦ ♦ ♦

*(సమాప్తం)*

(మెక్సికో-కాన్ కూన్)

# భాగం-1

ఇంతకు ముందు కాలిఫోర్నియాని ఆనుకుని ఉన్న మెక్సికో సరిహద్దు నగరమైన బాహా కాలిఫోర్నియాకి నౌకా ప్రయాణం (క్రూయిజ్) వెళ్లొచ్చేం కదా! ఇప్పుడు మెక్సికోకి తూర్పు తీరంలో ఉన్న కానుకూన్ వెళ్లి రావాలని అనుకున్నాం. అమెరికా పశ్చిమ తీరంలో ఉన్న కాలిఫోర్నియా నుంచి మెక్సికో తూర్పు తీరానికి ప్రయాణం అంటే విమానాల్లో దాదాపు ఎనిమిది గంటల ప్రయాణం. అంతే కాదు, కాలమానంలో మూడు గంటలు ముందుకి వెళ్తాం.

ఈ ప్రయాణం దాదాపు రెండు మూడు సార్లు అనుకునీ వాయిదా వేసాం. ఇక మొన్న నవంబరులో థాంక్స్ గివింగ్ సెలవులకి పదిరోజుల ముందు ఉద్యోగాలతో బాగా అలిసిపోతున్న మాకు ఆటవిడుపుగా ఈ ప్రయాణానికి వెళ్లొద్దామని తలపు కలిగింది. అనుకున్నదే తడవుగా ముందులాగే కాస్ట్ కో వెకేషన్ పాకేజీ బుక్ చేసుకున్నాం. సముద్ర తీర ప్రాంతమైన కాన్ కూన్‌కి ఆగస్టు నుంచి నవంబరు వరకు వర్షాలు పడే కాలం కాబట్టి అన్ సీజన్ వల్ల ప్రయాణం కాస్త చవకలో అవుతుందనేది మరొక కారణం.

కాస్ట్ కో పాకేజీ టూరు బుక్ చేసుకునే ముందు విడిగా ఫ్లయిట్లు, హొటళ్ల ఖరీదులు వేరే సైట్లలో చూసి ఇదే అన్నిటికన్నా ఉత్తమమైనదని ఖరారు చేసుకున్నాం.

మా పాకేజీ విడిగా ఫ్లయిట్లు, హొటళ్ల కీ అయ్యే ఖరీదుతో ఇంచుమించు సమానమే అయినా కొన్ని అదనపు ఆకర్షణలు ఉన్నాయి.

అవేవిటంటేడైరక్టు ఫ్లయిట్లు ఉంటాయి. మల్టిపుల్ ఫ్లయిట్లు ఉన్నా, ఫ్లయిట్ల మధ్య మారే సమయం తక్కువగా ఉండి సమయం వృథా కాదు. (కానీ ఇలా తక్కువ సమయం ఉండడం వల్ల వచ్చిన చిక్కేవిటో తరువాత ఫ్లయిట్ మారినప్పుడు చెప్తాను!)

మనకు నచ్చిన రేటులో హొటలు పాకేజీ దొరుకుతుంది.

ఇక అన్నిటినీ మించి ఇది "ఆల్ ఇంక్లూజివ్" పాకేజీ. ఇది గొప్ప అదనపు ఆకర్షణ. ఆల్ ఇంక్లూజివ్ అంటే మూడు పూటలా భోజనం, రిసార్టు వసతులు ఇత్యాదులన్నీ ఇందులోనే భాగాలన్నమాట. దేనికీ విడిగా డబ్బులు కట్టనవసరం లేదు. పిల్లలతో ఇలా కొత్త ప్రదేశాలకు వెళ్ళినపుడు ప్రతీ పూటా భోజనానికి వెతుక్కోకుండా ఇలా బుక్ చేసుకోవడం చాలా మంచి ఆలోచన.

కాస్ట్ కోలో ఇతర పాకేజీల కంటే ఎక్కువైనా, మేం "పాలెస్ హొటల్స్ పాకేజీ "తీసుకున్నాం. పాలెస్ హొటల్స్ బీచ్ పాలెస్, సన్ పాలెస్, మూన్ పాలెస్ అని మూడున్నాయి. అందులో "బీచ్ పాలెస్" సముద్రతీరంలో ఉండడం వల్ల పిల్లలతో సర్దాగా ఉంటుందని అది ఎంపిక చేసుకున్నాం. కానీ తీరా వెళ్లేక అక్కడి నుంచి ఎక్కడికి వెళ్లాలన్నా దూరమే. అదొక్కటే కాస్త ఇబ్బంది అనిపించింది.

దూరాలను బట్టి చూస్తే సన్ పాలెస్ బెస్ట్. ఇక మూన్ పాలెస్ కేవలం కపుల్స్‌కి మాత్రమే కాబట్టి పిల్లలతో ఉన్న మాకు అవకాశం లేదు.

సరే, టూరు బుక్ చేసుకోవడం పూర్తయింది. ప్రయాణంతో కలిపి మొత్తం ఏడు రోజులు. కాన్ కూన్‌లో వారమంతా ఉంటాం.

కానీ అక్కడికి వెళ్లి ఏం చెయ్యాలో నిర్ణయించుకోవాలిగా. ఆన్ లైనులో కానుకూన్‌కి సంబధించిన అనేక వీడియోలు చూసేం.

కాన్ కూన్‌లో అభద్రత ఎక్కువగా ఉంటుందని, హొటల్స్ అన్నీ ఉన్న "హొటల్ జోన్" దాటి బయట తిరగడం క్షేమం కాదనీ తెల్సుకుని ఆలోచనలో పడ్డాం.

కానీ నాన్ రిఫండబుల్ టిక్కెట్లు కొనుక్కున్నాం కాబట్టి వెళ్ళి చూసొద్దామనే నిర్ణయించుకున్నాం.

ఇక దేశం దాటి వెళ్లడానికి వీసా నిబంధనల గురించి ఆన్ లైనులో చదివాం. అమెరికా వీసా ఉన్న వారు ఎవరైనా వెళ్ళి రావొచ్చని సారాంశం.

దాని ప్రకారం ధైర్యంగా దేశం దాటి వెళ్తున్నా, మళ్లీ వచేటప్పుడు ఏదైనా ఇబ్బంది వస్తే ఎందుకైనా మంచిదని తత్సంబధిత డాక్యుమెంట్లు అన్నీ పెట్టుకున్నాం. అదీగాక ఇంతకు ముందు మెక్సికో క్రూయిజ్ నుంచి తిరిగి వచ్చేటపుడు రెండు గంటలు వేచి ఉండాల్సి రావడం, ఆ కాస్సేపట్లో పడ్డ టెన్షనుకి సంబంధించిన చేదు అనుభవం మాకు బాగా గుర్తుంది.

పిల్లలకు వారమంతా సెలవులు ఉన్నాయి కానీ మాకు లేవు. అయినా "స్వేచ్ఛగా ఎగరాలనుకున్న విహంగాలకు సెలవులు తక్కువా" అనుకుని మేమిద్దరం ఆఫీసులకు సెలవు పెట్టేసేం.

ఇక ఎప్పటిలానే పెట్టేబేడా సర్దాల్సిన బాధ్యత నాది, మోసే బాధ్యత మిగతా అందరిదీ.

ఇప్పుడు వరు టెంత్‌కి వచ్చి పెద్దా పేరక్క అయింది కాబట్టి తన సర్దుళ్ళు నేను పట్టించుకోవాల్సిన అవసరం లేదు.

ఇక ఎటొచ్చీ సిరితోనే మా కాలమంతా పొద్దుపోయేది. తనవన్నీ అక్క లాగే స్వయంగా సర్దుకుంటానని తనూ పేచీ పెట్టింది. సరేనని వదిలేస్తే బట్టలన్నీ పక్కన పడేసి నచ్చిన బొమ్మలు సూట్ కేసు నిండా సర్దేసింది. తీసేస్తే ఏడుపు. మొత్తానికి సిరి నిద్రపోయే వరకు ఆగి అప్పుడు సర్దవలసి వచ్చింది. ఇక దారంతా తన సూట్కేసు తనే పట్టుకుంటానని పేచీ. సరే, నాలుగు చక్రాల మీద దొర్లించడమే కదా అని వదిలేస్తే, ఇక తల కిందికి వంచి పెట్టె ఎవరికీ తగిలేదీ చూసుకోకుండా రయ్యిన దూసుకెళ్లిపోతుంది. మేమెవరైనా పట్టుకుంటామంటే ఏడుపు. మాకు కాస్సేపు నవ్వు, కాస్సేపు కోపమూ వస్తుండేవి. కోపం వస్తే "మమ్మీ! డాడీ! మీరు కాస్త దీర్ఘంగా ఊపిరి తీసుకుని వదలండి, లేదా పది అంకెలు లెక్కపెట్టండి కోపం పోతుంది!'' అని చెప్తుంది. ఇక కోపం ఎక్కడిది?

ఇక మెక్సికో మరో దేశమైనా, అమెరికాకు దగ్గర్లో ఉంటుంది కాబట్టి ఫయిట్లులోకల్ ఫయిట్లే. ఇంటర్నేషల్ ఫయిట్లలా పెద్ద సూట్ కేసులు ఫ్రీగా పట్టుకెళ్లనివ్వరు కాబట్టి ఒక్కొక్కళ్ళం చిన్న కేబిన్ బ్యాగేజి, ఒక్కో లాప్ టాప్ బాగ్ తగిలించుకున్నాం.

సిరి ఇంట్లో ఉన్నంత సేపు వీపుకి బొమ్మల బ్యాగు తగిలించుకుని తిరిగి బయలుదేరే ముందు ఇంట్లో వదిలేసింది.

దార్లో బాగు కోసం ఏం పేచీ పెడ్తుందో అని భయపడ్డాం. కానీ ఐ -పాడ్ ఉండడం వల్ల బ్యాగు సంగతి మర్చిపోయింది.

ఇక కాన్ కూన్ అసలు నవంబరులో ఎందుకు వెళ్లాలనుకున్నామంటే యూఎస్ ఏలో ఇది చలి కాలం. కాబట్టి సెలవుల్లో చక్కగా వెచ్చగా ఉండే ఊరికి వెళ్తే బావుంటుందన్న ఆలోచన ఒక కారణం. ఇక రెండోది అక్కడికి దగ్గర్లోనే ఆధునిక ప్రపంచ వింతలు ఎనిమిదిట్లో ఒకటైన చిచెన్ ఇట్జా ఉంది. అది చూసి రావడం అసలు కారణం. ఇక పిల్లలకి హవాయి వెళ్లొచ్చినప్పటి నుంచీ వెచ్చని సముద్రంలో ఆడుకోవడం బాగా ఇష్టంగా మారింది. కాన్ కూన్ వైట్ సేండ్ బీచ్ లకు ప్రసిద్ధి. ఇంకేవిటి? తగినన్ని కారణాలున్నాయి అక్కడికి వెళ్లడానికి.

అక్కడికి వెళ్లాక తెలిసింది ఇంకా చాలా విశేషాలు చూడడానికి ఉన్నాయని.

♦ ♦ ♦

# భాగం-2

కాన్ కూన్ నగరం మెక్సికో దేశానికి ఆగ్నేయ దిక్కున ఉన్న “క్వింటానా రూ” రాష్ట్రం యూకతాన్ ద్వీపకల్పం లో ఉంది.

స్థానిక మాయా భాషలో కాన్ కూన్ అంటే “పాముల పుట్ట” అని అర్థమట.

ఈ చుట్టుపక్కలే ప్రపంచంలో అత్యంత పురాతన మైన గొప్ప సంస్కృతుల్లో ఒకటైన మాయా నాగరికత క్రీ.పూ. 2000 నుండి క్రీ.శ. 900 వరకు విలసిల్లింది.

ఇక్కడ ఇప్పటికీ సజీవంగా ఉన్న అనేక శిథిల కట్టడాలు అబ్బురమనిపిస్తాయి.

కాన్ కూన్ నగరం 18 వ శతాబ్దిలో స్పానిష్ వారి ఆక్రమణ ఫలితంగా వెలుగులోకి వచ్చింది.

ఇక 1970 వ సం.రం తరువాత ఇక్కడ రిసార్టుల నిర్మాణం ప్రారంభమయ్యేక యాత్రికుల రాకపోకలు ప్రారంభమయ్యేయి.

పై నుంచి చూస్తే సముద్రంలోకి వదులుగా వొదిలేసిన సన్నని తాడులాంటి భూభాగం మీద వరసగా స్టార్ హోటళ్లు, రిసార్టుల నిర్మాణాలు కనువిందు చేస్తూభూలోక స్వర్గాన్ని తలపింపజేస్తాయి. ఈ ప్రాంతం పేరే “జోనా హొటాలెరా” (హోటల్ జోన్”).

ఈ జోన్‌కి అటూ, ఇటూ కొసలు ప్రధాన నగరాన్ని కలిపి ఉండడం వల్ల ఇక్కడి నుంచి ఎటు ప్రయాణం చేసినా రెండు వైపులా నీళ్లతో అందమైన దృశ్యాలుకనిపిస్తూ ఉంటాయి.

ముఖ్యంగా హొటలు బాల్కనీ లోంచి అనంత సాగరపుటంచు మీదుగా ప్రతీ ఉదయానికీ ఆహ్వానం పలికే ప్రశాంత సూర్యోదయం, రాత్రి పూట కెరటాల మీదదోబూచులాడుతూ సరాసరి గుండెల్లోకి దూసుకొచ్చే అందమైన చంద్రోదయాలు చూడ్డానికైనా వెళ్లాల్సిందే అనిపించింది.

ఈ హొటల్ జోన్ తప్ప మిగతా ప్రాంతమంతా చిన్న సైజు టౌనులా ఉంది.

ఇక్కడ జనాభాలో 99 ఇక్కడి టూరిజమ్మీద ఆధారపడి బతుకుతున్నవాళ్లే. స్పానిషు ప్రధాన భాషైన మెక్సికో దేశంలో ఏ మాత్రం ఇంగ్లీషు మాట్లాడగలిగేవాళ్లకయినా టూరిజంలో అవకాశాలు ఈ ప్రాంతంలో మెండుగా ఉన్నాయి. అయినా మామూలు జనానీకం పేదరికంలోనే మగ్గుతున్నట్లు నగరంలోని ఇతరప్రాంతాల్ని చూస్తే అర్థం అవుతూంది.

గత కొన్నేళ్లుగా ఇక్కడ డ్రగ్స్‌కి సంబంధించిన నేరాలు, హత్యలు పెరగడం వల్ల అమెరికా వంటి సంపన్న దేశాల నుంచి వచ్చిన వారికి ప్రత్యేక భద్రతలు కూడాపెంపొందించినట్లు రోడ్లపై ఎక్కడికక్కడ మిలటరీ దళాలు ఉన్నాయి.

ఇందుకు భయపడే మేం అనేక సార్లు ఈ ప్రయాణాన్ని వాయిదా వేసాం. కానీ వెళ్లొచ్చాక అంతగా భయపడాల్సిన పని లేదని అనిపించింది.

నాకు పరిచయం అయిన కొందరిని అక్కడి భద్రతకు సంబంధించి అడిగినప్పుడు ప్రపంచంలో అన్ని ప్రాంతాలలోనూ నేరాలు జరుగుతున్నా ఇక్కడిసంఘటనలనే భూతద్దంలో చూపిస్తూ ఉంటారని వాపోయారు. ఒకతనైతే "అమెరికాలో ఎన్ని కాల్పులు జరగడం లేదు? అక్కడ మాత్రం భద్రత ఉందా?'' అనిఎదురు ప్రశ్న వేసాడు. నిజమే అనిపించింది నాకు.

మధ్యలో ఒక రోజు మేం టూరుకి వెళ్లిన బస్సు డ్రైవరు "మీరు వచ్చిన పనిని బట్టి మీ భద్రత ఆధారపడి ఉంటుంది. మీరు కేవలం సందర్శకులైతే మీ మీదఎవరు కాల్పులు జరుపుతారు? నాకు తెలిసినంతవరకు అనేక ఇతర ప్రాంతాలతోనూ, దేశాలతోనూ పోలిస్తే సామాన్యులకు ఇది చాలా భద్రత కలిగినదే. ఇకడ్రగ్స్ మాఫియా అంటారా? అది ఎక్కడ మాత్రం లేదు? అమెరికాలో కంటే పెద్ద నేరాలు మా మెక్సికో దేశంలో జరగవు.'' అన్నాడు నవ్వుతూ.

ఇక ఇలాంటి వివాదాస్పదమైన చోటికి ధైర్యంగా వెళ్లాల్సిందేనని నిర్ణయించుకుని వచ్చాం కాబట్టి వీటన్నిటి గురించి ఆలోచించకూడదని అనుకున్నాం.

చుట్టుపక్కల చూడాల్సిన ప్రదేశాల్లో ముఖ్యమైనవి లిస్టు చేసుకున్నాం. అందులో ముఖ్యమైనవి ఆధునిక ప్రపంచ ఎనిమిది వింతల్లో ఒకటైన చిచెన్ ఇట్జా పిరమిడ్ ఒకటి.

అంతే కాకుండా అక్కడ "సెనోట్లు'' అనబడే భూగర్భ జలాలు తప్పనిసరిగా చూడదగినవి.

ఇక కానుకున్‌ని ఆనుకుని ఉన్న "ఇస్లా మొహారీస్'' ద్వీపం ఒక రోజు కార్యక్రమంగా చేరింది.

స్థానిక ఉత్పత్తులకు, ప్రజల్ని, వారి సంస్కృతిని చూసేందుకు ప్రసిద్ధి చెందిన "మార్కెట్-**28**'' తప్పని సరి అని నేను పేచీ పెట్టేను.

సత్యకు, వరుకు ఇష్టమైన జిప్ లైన్ వంటి ఎడ్వెంచర్ టూర్లు వాళ్లు బుక్ చేసుకుందామన్నారు.

సముద్రమ్మీద సాయంత్రం పూట కనువిందు చేస్తూ తప్పనిసరిగా చూడాల్సినదని జనం మెచ్చిన టూరు "పైరేట్ షో''.

తులం, కోబా వంటి మాయా సంస్కృతిలోని శిధిల నగరాలు అన్నిటికంటే ముఖ్యమైనవి. వెరసి మొత్తం అయిదు రోజులకు సరిపడా టూర్లు సిద్ధమయ్యేయి మాకు.

ఇక మేం బయలుదేరే రోజు రానే వచ్చింది.

కాస్ట్ కో పాకేజీ టూరులో భాగంగా రెండు ఫ్లయిట్లు మారినా వెంట వెంటనే ఫ్లయిట్లు కావడం వల్ల మధ్యాహ్నం పన్నెండుకి బయలుదేరి, రాత్రికి చేరాల్సి ఉందిమేం.

కాలిఫోర్నియా నుంచి టెక్సాస్ లోని డల్లాస్‌కు మొదట మూడు గంటలు, డల్లాస్ నుంచి మరో రెండు గంటలు ప్రయాణం. కానీ కాన్ కూన్ సమయం మాకుమూడు గంటలు ముందు ఉండడం వల్ల మేం వెళ్లేసరికి రాత్రి తొమ్మిది అయ్యింది.

ఎయిర్ పోర్టు నుంచి బయటకు వచ్చేసరికి మరో అరగంట.

కాంకూన్ ఎయిపోర్టు చాలా చిన్నది. నిజానికి బయటకు రావడానికి అట్టే సమయం పట్టదు.

ఇంక రెండు నిమిషాల్లో అద్దాల తలుపులు దాటి బయటకు వస్తామనగా ఉన్న టూరిజం హెల్ప్ సెంటర్ల లాంటి చోట్ల ఉన్న బాడ్జు పెట్టుకున్న ఒకమ్మాయిమమ్మల్ని "సాయమేదైనా కావాలా" అని పలకరించింది.

కాస్ట్ కో పాకేజీలో భాగంగా మమ్మల్ని ఎయిర్పోర్ట్ నుంచి పికప్ చేసుకుని హెూటల్‌లో దించే ప్రైవేటు వ్యాను ఎక్కడ ఆగుతుందో అన్న సందేహంతో ఆమె దగ్గిర ఆగేం మేం.

అదెంత పెద్ద తప్పో మాకు తర్వాత తెలిసొచ్చింది.

*(ఇంకా ఉంది)*

♦ ♦ ♦

# భాగం-3

కాన్ కూన్ ఎయిర్పోర్టు అద్దాల తలుపులు సరిగ్గా రెండడుగుల్లో దాటుతామనంగా చక్కగా సూటు వేసుకుని, ఎయిర్పోర్టు హెల్పింగ్ బూత్‌లో పనిచేస్తున్నట్లున్న ఒకమ్మాయి మమ్మల్ని "సహాయం ఏమైనా కావాలా?" అని నవ్వుతూ పలకరించింది.

అప్పటికే మేం బయటికెళ్లే ముందు పక్కకి ఆగి మా పాకేజీలో భాగమైన పికప్ టాక్సీకి ఫోను చెయ్యడానికి నంబరు కోసం రిసీట్‌లో చూడాలని అనుకుంటూ నడుస్తున్నాం.

ఇంతలో ఈమె కనబడి పలకరించడంతో "మేం ఫోను చెయ్యకుండా ఈమెనే టాక్సీ స్టాండ్ వివరాలు అడిగితే సరిపోతుంది కదా!" అనుకుని "పోనీలే ఈమెవరో బానే అడిగిందని" దగ్గిరికెళ్లాం.

ముందుగా నేనామెని అడిగేను "కాస్ట్కో పాకేజీలో హొటల్ టాక్సీ పికప్‌కి ఎక్కడికి వెళ్లాలి?" అని.

ఆమె చెపుతాను ఇలా నా డెస్కు దగ్గిరికి రండి అంటూ తీసుకెళ్లి, "ఇదేనా మొదటిసారి రావడం?" అని స్పానిషు యాసలోని ఇంగ్లీషులో అడిగింది.

అవునని మేం తలూపగానే "వెల్ కమ్ టు కాన్కూ న్" అని కొన్ని సరదా కబుర్లు చెప్పి, "రేపు ఎక్కడికి వెళ్దామనుకుంటున్నారు?" అంది.

"మేం ఇంకా ఏమీ అనుకోలేదు" అన్నాం.

అయితే మీకు చాలా చవకగా మూడు టూర్లు కలిపి తక్కువ ప్రైస్‌లో ఇస్తాను వివరాలు చూడండి అంటూ చార్టు మా ముందు పెట్టి, స్కెచ్ పెన్నుతో గీతలు చుడుతూ ఏవో చూపించసాగింది.

అప్పటికప్పుడు తీసుకుంటేనే ఆఫర్ ఉంటుంది అంది పైగా. ఆన్ లైనులో మేం చూసిన కంటే బాగా తక్కువకి ఆమె ఆఫర్ చేస్తూ ఉంది, పైగా అప్పుడే కొనుక్కుంటే ఇక ఉదయం టూరుకి వెళ్లొచ్చనే ఉద్దేశ్యంతో తీసుకుందామనుకున్నాం. కానీ ఎందుకైనా మంచిదని ఒక టూరు చాలని చెప్పేం.

ఇక టూరు టిక్కెట్ల పేమెంటు కార్డు కాకుండా కాష్ గానీ, చెక్ గానీ ఇమ్మంది. నాకు కొంచెం అనుమానం వచ్చి, "మా దగ్గిర కాష్ ఎక్కువ లేదు" అని యాభై డాలర్లు ఇచ్చి, "మిగతాది

రేపు టూరు దగ్గిర పే చేస్తాం'' అని చెప్పేను గొప్ప తెలివిగా. ఆమె వెంటనే ఒప్పుకుంది.

"కానీ ఒక మాట, మీరు బాలెన్సు కట్టేకనే టూరు టిక్కెట్లు ఇస్తారు మీకు, ఇక పొద్దున్నే మిమ్మల్ని మా డ్రైవరు పికప్ చేసుకుని మా రిసార్టుకి తీసుకెళ్తాడు, అక్కడ మీరు ఫ్రీ బ్రేక్ఫాస్ట్ చెయ్యొచ్చు. అక్కడే బ్యాలన్సు కట్టి టిక్కెట్లు తీసుకోవచ్చు'' అంది.

"మీ రిసార్టు ఎక్కడుంది?'' అనడిగేం.

మాప్ తీసి, "ఇదిగో ఇది మీ హోటలు, ఇక్కడ మా రిసార్టు '' అని చిన్న గీత గీసింది.

చాలా చిన్న మేప్ కావడంతో అందులో చూస్తే పక్క వీధిలా కనిపించింది.

రిసీటు ఇస్తూ "అయితే చివరగా ఒక మాట, మీరు ఎక్కడికి వెళ్లేదీ ఎవరితో చెప్పకండి'' అంది.

దాంతో సత్యకి అనుమానం వచ్చి ఇదేమైనా "టైం షేరింగ్ విషయమా'' అన్నాడు.

ఆమె "అబ్బే, అలాంటిదేమీ లేదు'' అని తేలిగ్గా నవ్వి "మీకు టూరు వద్దనుకుంటే మీ డబ్బులు వాపసు రేపైనా కూడా తీసుకోవచ్చు'' అని,

"మీరిద్దరూ హనీమూన్ జంటలా ఉన్నారు కానీ, పిల్లలు ఉన్నట్లే లేరు'' అంటూ మాటమార్చి మమ్మల్ని అయిసు చేసేసింది.

ఇక కాస్ట్కో పికప్ బయటికి వెళ్లేక దగ్గర్లోనే ఉంటుందని చెప్పింది.

నేను "సరేలే ఆమె చెప్పేదేవిటో కూడా చూద్దాం. మరో రిసార్టు చూసినట్టూ ఉంటుంది. పైగా ఒక్కటే టూరు కొన్నాం, ఎక్కువ అడ్వాన్సు కూడా ఏవీ కట్టలేదు కదా!'' అని తేలిగ్గా తీసుకోమని సత్యకి సర్ది చెప్పేను.

ఇంతకీ బయటికి రాగానే అర్థమైన విషయం ఏవిటంటే అది చాలా చిన్న ఎయిర్ పోర్టని. మేం ఇంటర్నేషల్ ఎయిర్పోర్టుల లెవెల్లో ఊహించుకుని, బయట వెతుక్కోవడం కష్టమని అప్పటివరకు ఆయాసపడ్డాం.

తీరా చూస్తే చిన్న బస్టాండు బయటికి వచ్చినట్లు ఒక పొడవైన ప్లాట్ ఫారమ్మీద నడిచి ఎదురుగా "కాస్ట్కో'' అని రాసి ఉన్న యూనీఫారం మనుషులిద్దర్ని చూడగానే "అనవసరంగా ఆమె దగ్గిర ఆగి సమయం వృథా చేసుకున్నాం'' అని అనుకున్నాం. వాళ్లిద్దరూ తప్ప అక్కడ పిట్టమనిషి లేడు.

ఎయిర్పోర్టు బయటకి అడుగుపెట్టగానే వాతావరణం అచ్చం హైదరాబాదులో దిగినట్లు ఉంది వెచ్చగా.

కాలిఫోర్నియాలో చలి దుస్తులు తీసేసి, హాయిగా తిరగగలిగే వెచ్చదనాన్ని చూడగానే పిల్లలు కేరింతలు కొట్టేరు.

అచ్చు ఇండియాలో దిగినట్లు ఉందని మురిసిపోయాం. కాకపోతే జనమే లేరు, అంతే.

అక్కణ్ణించి హోటలుకి దాదాపు గంటన్నర పాటు ప్రయాణం చేసేం. బీచ్ రోడ్డులో ఉన్న హోటలు జోన్‌లో మా "బీచ్ పాలెస్" హోటల్లో రాత్రి పన్నెండుగంటల వేళ చెకిన్ అయ్యేం.

అప్పటికి అన్నీ మూసేసి ఉండడం వల్ల మాకు తినడానికి ఏమీ దొరకలేదు.

నిజానికి కాలిఫోర్నియా టైములో అది రాత్రి తొమ్మిది గంటల వేళ కావడంతో అందరికీ బాగా ఆకలేస్తూ ఉంది.

దార్లో డాలస్ ఎయిర్పోర్టులో కొన్న తినుబండారాలు, ఇంటి నుంచి తెచ్చిన బిస్కెట్లు అప్పుడు పనికొచ్చేయి.

ఇక మా గది "సూట్" కావడం వల్ల మంచాల పక్కనే గదిలో మూడో వంతు భాగంలో స్పా- టబ్ ఉంది. అద్దాల పార్టీషను, ఓపెన్ సింక్స్, బాల్కనీ తెరవగానే ఎనిమిదో అంతస్థులోంచి కింద ఎదురుగా వెన్నెల పరుచుకున్న అందమైన కెరటాల అనంత జలధి.

ఓహ్, అత్యద్భుతంగా ఉందక్కడ! అయితే ఉదయం ఎనిమిది కల్లా బయటికెళ్లాల్సి ఉండడంతో ఆస్వాదనని మర్నాటికి వాయిదా వేసి నిద్రకుపక్రమించాం.

♦ ♦ ♦

# భాగం-4

అనుకున్నట్టుగానే మర్నాడు ఉదయం ఏడున్నరకే మేం హెూటలు లాబీలోకి వచ్చి హడావిడిగా బ్రేక్ ఫాస్టు కానిచ్చేం.

ముందు రోజు ఆమె '' మీ హెూటలు బయట 8 గంటల కల్ల మా వ్యాను మీ కోసం వేచి ఉంటుంది, ఎవరు అడిగినా ఎక్కడికి వెళ్తున్నారో చెప్పకండి'' అని చెప్పింది.

“ఎందుకు?'' అని సత్య వెంటనే అడిగేడు.

ఆమె తేలిగ్గా నవ్వి, “ఇక్కడంతా కాంపిటీషను కదా'' అన్న విషయం జ్ఞాపకం వచ్చింది.

ఇక లాబీలో మమ్మల్ని చూస్తూనే అక్కడేలోకల్ టూరిజం బూత్‌లో ఉన్న వ్యక్తి మా దగ్గిరికి వచ్చి “ఎక్కడికి వెళ్తున్నారు?'' అన్నాడు.

అందులో దాచాల్సింది మాకేమీ కనబడలేదు. మా దగ్గిర ముందు రోజు ఆమె మా దగ్గిర యాభై డాలర్లు పుచ్చుకుని ఇచ్చిన రిసీటు చూపించేం.

అతను వెంటనే నాతో రండి, “మీకు ఇంత కంటే మంచి ఆఫరు నేను చూపిస్తాను'' అని పై అంతస్థులోకి తీసుకెళ్లేడు.

అరగంట కూచోబెట్టేక మరొకతను వచ్చి మొట్టమొదటగా “మీరు అమెరికాలో ఎందుకు ఉంటున్నారు? అనడిగేడు.

“ఉద్యోగరీత్యా'' అన్న మా సమాధానం విని ఇప్పుడే వస్తాను అంటూ వెళ్లిపోయి మొదటి అతన్ని పంపించేడు.

ఇదంతా మాకు విసుగ్గా అనిపించసాగింది.

ఇంతలో ఆమె మాకు ఫోన్ల మీద ఫోన్లు చెయ్యసాగింది.

మేం “మాకు మరి కాస్త సమయం పడుతుంది'' అని చెప్పసాగేం.

మొత్తానికి మొదటి వాడు వచ్చి మా రిసీటు చేతిలో పెట్టి, “సారీ, మీకు మేం ఏమీ ఆఫర్లు ఇవ్వలేం. మీరు ఆమె చెప్పిన చోటికే వెళ్లండి'' అని చెప్పేడు.

ఇక అప్పటికే సత్యకి విషయం అర్థమయ్యినట్లు, “పోతే పోయాయిలే యాభై డాలర్లు. మనం ఇక అటు కూడా వెళ్లొద్దు” అన్నాడు.

కానీ మేం అప్పటికి ఏమీ ప్లాను చేసుకోనందున ఆ రోజు ఏం చెయ్యాలో పాలుపోలేదు కాసేపు.

ఇక నేనే “అసలు డబ్బులు గురించి కాకపోయినా ఆమె టూర్లలో తగ్గింపు ఇస్తానని చెప్పింది కదా, పైగా నచ్చక పోతే మన యాభై మనకి వాపసు ఇస్తామని కూడా చెప్పింది, ఒక సారి వెళ్లొస్తే పోయేదేముంది” అని బయలుదేరదీసేను.

హొటలు డ్రైవ్ వే బయట రోడ్డుని ఆనుకుని ఉన్న బస్టాపుకి వచ్చి, ఆమెకి ఫోను చేసేం “మేం వచ్చాం, వెహికిల్ పంప”మని

“పది నిమిషాల్లో ఒకతను వచ్చి దారిన పోయే టాక్సీ ఆపి, “మమ్మల్ని ఎక్కించుకుని ఫలానా చోటికి తీసుకు వెళ్లమని, డబ్బులు మా దగ్గిర తీసుకోవద్దని” అతనితో స్పానిషులో చెప్పి మాతో అదే విషయం ఇంగ్లీషులో చెప్పేడు.

ఆమె ముందు రోజు మాకు చూపించిన మ్యాపులో ఈ రెండు ప్రదేశాల మధ్య దాదాపు పది నిమిషాల దూరం ఉన్నట్లు చూపించింది.

మేం ఉన్న హొటలు జోను లోనే ఆ రిసార్టు ఉన్నట్లు అనుకున్నాం.

తీరా టాక్సీ ఎక్కి గంటైనా మేం దిగాల్సిన ప్రదేశం రాదే.

“దేశం కాని దేశంలో ఎక్కడికెళ్తున్నామో” అర్థం కాని పరిస్థితిలో ప్రయాణం చేస్తుండగా చెప్పకపోవడవేం, నాకు కాస్త భయం కూడా వేసింది.

మొత్తానికి ఒక పెద్ద రిసార్టు మలుపు తిరిగింది కారు.

అప్పుడు కాస్త స్థిమితంగా అనిపించింది మాకు.

కారు రిసార్టు లోపల టాక్సీ స్టాండులో ఆగంగానే అక్కడున్న రెండు మూడు కౌంటర్లలో ఉన్న రిసెప్షను వారు “మరెవరితోనో ఫోనులో మాట్లాడి, మాకు వివరాలు చెప్పడానికి మరెవరో వస్తారు, వేచి ఉండండి” అని చెప్పేరు.

దాదాపు అరగంట తర్వాత ఒకతను వచ్చి రిసార్టంతా తిప్పే చిన్న ట్రాము బండి ఎక్కించేడు మమ్మల్ని.

అప్పటికే ఎండ ప్రతాపం చూపిస్తున్నందున కౌంటర్లో ఇచ్చిన వాటర్ బాటిల్సు అన్నీ తాగేసేం.

సిరి పేచీ మొదలుపెట్టేసింది. ట్రాము ఎక్కేక కాస్త ఊరుకుంది.

మాతో బాటూ వచ్చిన గైడు మమ్మల్ని ఒక చోట దించి "రండి ముందు బ్రేక్ ఫాస్టు చేద్దురు" అన్నాడు.

అప్పటికే పదయ్యింది. అందరికీ ఆకలేస్తూంది. అతని కూడా మారు మాట్లాడకుండా నడిచేం.

బ్రేక్ ఫాస్టు ఏరియా మేమున్న రిసార్టులాగే దాదాపు యాభై అరవై రకాల స్పెషల్ ఐటంస్‌తో టేస్టు బావున్నట్టనిపించింది. బహుశా: అప్పటికి సరిగ్గా అందరం ఆకలితో ఉన్నందువల్లనేమో.

ఇది కాగానే రిసార్టు అంతా తిప్పి చూపిస్తాను ముందుగా అన్నాడతను.

ఎండ తీవ్రంగా కాస్తూంది. పైగా సముద్రతీరం అది. ఒకపక్క సిరి అడుగు తీసి అడుగు వెయ్యటానికి పేచీ పెట్టేస్తూంది.

రిసార్టు అంతా తిరిగి చూడలేమనీ, ముఖ్యమైనవేవో చూపించమని చెప్పేం.

సరే కాటేజీలు చూపిస్తాను అని పక్క బిల్డింగులోకి దారితీసేడు.

కింది అంతస్థులోనే డబల్ బెడ్రూము, ట్రిపుల్ బెడ్రూము కాటేజీలు చూపించేడు. అవీ ఒక మోస్తరు గానే ఉన్నాయి.

దానికానుకుని ఎదురుగా ఉన్న స్విమ్మింగు పూల్ దాటి సముద్రం ఒడ్డుకి దారితీసేడు.

ఇక అక్కడ కనబడ్డ మొదటి కుర్చీలో ఎక్కి కూచుని సిరి కదలని భీష్మించడంతో చేసేదేం లేక వరుని కాపలా పెట్టి మేమిద్దరం అతని వెంట నడిచేం.

కొబ్బరి, పాం వృక్షాలతో తీరంలో పరిచిన బీచ్ కుర్చీలతో తీరం అందంగా ఉంది.

నీళ్లలోకి కట్టిన చిన్న బ్రిడ్జిలు, చివర కూర్చుని చూసేందుకు కట్టిన పందిర్లతో ఇంకా సుందరంగా ఉంది.

మా గైడు మమ్మల్ని ఒక బ్రిడ్జి మీదికి ఎక్కించి కింద నీట్లోకి చూడమన్నాడు.

అడుగు, రెండడుగుల లోతులో అత్యంత శుభ్రంగా, తేటగా ఉన్న నీళ్ల కింద గుండ్రని రాళ్లు, తెల్లని ఇసుకతో అందమైన తీరం అది. సహజసిద్ధంగానే అలలు లేని సముద్రతీరం కావడంతో పిల్లలు కూడా భయ పడకుండా ఆడుకోవడానికి అనువుగా ఉంది.

కానీ నెత్తిమాడే ఎండ వల్ల, పైగా సిరిని, వరుని వదిలి రావడం వల్ల ఎక్కడా నిమిషం నిలబడలేక వెనక్కి వచ్చేసేం.

మా పరిస్థితి చూసి పిల్లల దగ్గరే మమ్మల్నీ కూచోబెట్టి అతనెవర్నో పిలుచుకొస్తానని వెళ్లిపోయేడు.

ఇక అప్పటికి మాకు అర్థమైన విషయం ఏవిటంటే మేం బయటకు వెళ్లాలన్నా కూడా అతని సహాయం అవసరం అయినంత లోపలికెక్కడికో వచ్చేసామని.

సత్య బాధ చూడాలి. అనవసరంగా వచ్చి ఇరుక్కున్నామని, సమయం అంతా ఇక్కడే వృథా అవుతూ ఉందని ఎంతో బాధ పడసాగేడు.

ఇదంతా టైం షేరింగు వ్యవహారమని అప్పటికే అర్థమైంది మాకు.

కానీ చేసేదేమీ లేక నీడన కూచుని చల్లని నీళ్లు తాగుతూ అతను తిరిగొచ్చే వరకూ కాలక్షేపం చేసేం.

మొత్తానికి అతను కొన్ని తెల్ల కాగితాలు పెన్ను పట్టుకొచ్చి రిసార్టు మెంబర్ షిప్పు తీసుకుంటే ఏమేమి ఉచితమో చెప్పసాగేడు.

అందులో ఎంచుకున్న కాటేజీ సైజుని బట్టి మెంబర్ షిప్పు ఉంటుంది.

అరగంట మాట్లాడేక గానీ మధ్యలో ఎన్ని సార్లు అడిగినా మెంబరు షిప్పు ఎంతో చెప్పలేదు.

చిట్ట చివరికి అసలు చిన్న అంచనా అయినా చెప్పమని మేం పట్టుబట్టడంతో "నాతో రండి" అని కాస్త దూరంలో ఉన్న పెద్ద హాలులోకి తీసుకెళ్లేడు.

హాలు నిండా గుండ్రని బల్లలు, ప్రతి బల్లకు ఒక వైపు మాలాంటి యాత్రికులు మరో వైపు ఏజెంట్లతో రణగొణగా ఉందక్కడ.

ఒక పక్కగా ఉన్న పిల్లలు ఆడుకునే ప్లే ఏరియా, పుస్తకాల దగ్గిరికి వరు, సిరి వెళ్లడం కాస్త ఉపశమనంగా అనిపించినా మాకు బొత్తిగా ఇష్టం లేని ఈ వ్యవహారం చికాకుగానే ఉంది.

ఎవరేం చెప్పినా మేం మాత్రం అవసరం లేనివి కొనకూడదని ముందే నిర్ణయించుకోవడం వల్ల అతనికి తెగేసి చెప్పేసేం "రేటు ఎంతైనా మేం మెంబరు షిప్పుల వంటివి తీసుకోదల్చుకోలేదని" అయినా అతను మరొకతన్ని వెంట బెట్టుకొచ్చేడు.

అతను వస్తూనే మీకు ఉన్న ఆఫర్లు చెపుతాను బలవంతమేమీ లేదు అని మళ్లీ కాగితాల మీద బొమ్మలు గీస్తూ మొదలు పెట్టేడు.

మళ్లీ అరగంట గడిచేక రేటు వరకూ రావడం మళ్లీ ఇంకొకతను రావడం ఇలా భలే విసుగు పుట్టించసాగేరు.

మొత్తానికి తేల్చిన విషయమేమిటంటే ఇది నెలకు వి2000 డాలర్ల చొఎఎన ఒక సంత్సరం పాటు కడుతూ పోవాలి.

లేదా ఒక్కసారే మొత్తం ఇరవై నాలుగు వేలు కట్టొచ్చు. దానిద్వారా రిసార్టుని పదేళ్ల పాటు నిర్దేశిత దినాల పాటు వాడుకోవచ్చు.

ఇక లైఫ్ టైము షేరు అయితే తక్కువ, పది సంత్సరాలకైతే ఎక్కువ ఇలా ఏవేవో వివరాలు ఉన్నాయి.

ముందుగా కొంత కట్టి బుక్ చేసుకుంటే మిగతాది ఇన్ స్టాల్మెంట్లలో కట్టొచ్చు. ఇక అందుకుగాను లోన్లు వగైరాలు వాళ్లే చూసి పెట్టడం వంటివి సరేసరి. ఇలా మెంబరుషిప్పు కడుతున్నందుకు గాను కట్టిన వారే గాక, వాళ్ల కుటుంబ సభ్యుల్లో ఎవరైనా, ఎందరైనా రిసార్టులో సంవత్సరానికి వారం పది రోజులు ఉచితంగా ఉండడమే కాక రిసార్టు సౌకర్యాలన్నిటినీ వాడుకోవచ్చు. భోజనాదులు ఉచితం.

ఇలా చెప్పుకుపోతూంటే మొట్టమొదట వినడానికి చాలా బాగా అనిపిస్తుంది కానీ నెల నెలా కట్టాల్సింది తల్చుకుంటే గుండె గుభేల్ మంటుంది. అంతేకాక వాడినా వాడకపోయినా మెయింట్ నెన్సు ఛార్జీల వడ్డన.

ఇంతకీ ఈ రిసార్టు ఉన్నది అమెరికాలో కాదు, మెక్సికోలో. ఎప్పుడంటే అప్పుడు వెళ్లడానికి ఛార్జీలు, వీసాలు అంటూ పెద్ద కథ.

అసలిక్కడ కొనడం మా లాంటి వారికి కుదరని పని అని చెప్పినా వదలరేం.

ఒకరి తర్వాత మరొకరు వచ్చి మమ్మల్ని వేధించసాగేరు.

చివరగా ఆ హాలు దాటి మేం వచ్చేస్తూ "హమ్మయ్య" అనుకుని వెనక వరండా వంటి ప్రదేశానికి రాగానే మరో పెద్ద మనిషి వచ్చి మళ్లీ "దయచేసి ఒక్క అయిదు నిమిషాలు నేను చెప్పేది వినండి, మీకు నచ్చకపోయినా నేనేమీ అనుకోను" అని అతను ఇటీవలే ఇండియా చూసొచ్చాడని, అతనికి మన దేశ సంస్కృతి అంటే

చాలా ఇష్టమనీ ఏదేదో చెప్పి పరిచయం చేసుకున్నాడు.

తర్వాత "మీరు రేటు చూసి భయపడుతున్నట్లున్నారు కాబట్టి మీ కోసం ఇవేళ సగానికి సగం తగ్గించేస్తున్నా" అన్నాడు. అంటే నెలకి వెయ్యి డాలర్లలన్నమాట.

మేం అయినా "వద్దు ఈ దేశంలో మేం కొనలేం" అని చెప్పినా వినిపించుకోకుండా పోనీ మరో సగం, మరో సగం అంటూ కనీసం నెలకు రెండు వందల యాభై డాలర్లు కట్టండి మీ కోసం **90** తగ్గించేను అనే సరికి సత్యకి ఇక బాగా చికాకు వచ్చేసింది. "అసలు మీరు చెప్పేదేవైనా అర్థం ఉందా**?** మాకు మీరు ఉచితంగా ఇచ్చినా వద్దు " అంటూ చప్పున లేచి, "నడవండి" అని మమ్మల్ని తీసుకుని ముందుకు నడిచేడు.

ఇక వెనక్కి చూడకుండా అక్కడి నుంచి బయటకు వచ్చేస్తున్న మాకు వెనకే పరుగున ఒకతను వచ్చి లాబీకి తీసుకుని వచ్చేడు.

నేను "మేం నిన్న కట్టిన యాభై ఎక్కడ తీసుకోవాలి?" అని అడిగేను.

అతను లాబీ కౌంటరు చూపించి వెళ్లిపోయేడు.

అక్కడ లైనులో నిలబడి మరో అరగంటకి యాభై డాలర్లు తీసుకుని రిసార్టు నుంచి మా హొటలుకు దించే షటిల్ తీసుకుని మేం వెనక్కి వచ్చేసరికి మధ్యాహ్నం రెండయ్యింది.

అలా ఎయిర్పోర్టులో బయటకు వచ్చేటప్పుడు పలకరించిన అమ్మాయి దగ్గిర ఆగడం అనే చిన్న తప్పు వల్ల మాకు ఒక రోజంతా వృథా అయిపోయింది.

ఇలా ఇంకెప్పుడూ కొత్త ప్రదేశానికి వెళ్లినా టైం షేరింగు బారిన పడకుండాఉండాలంటే ఎవరితోనూ మాట్లాడకూడదని గట్టిగా నిర్ణయించుకున్నాం.

*(ఇంకా ఉంది)*

♦ ♦ ♦

# భాగం-5

## యాత్రాగీతం(మెక్సికో-కాన్ కూన్-చిచెన్ ఇట్జా-ఇక్కిల్ సెనోట్)-5

తిరిగి మా రిసార్టుకి వచ్చేసరికి మధ్యాహ్నం మూడు గంటలయ్యింది.

ఆవురావురంటూ భోజనానికి పరుగెత్తేం. రిసార్టులో ఎకామడేషన్‌తో పాటూ భోజనాదులన్నీ కలిపిన పాకేజీ కావడంతో డబ్బులేమీ కట్టకుండా బఫే సెక్షనులో జొరబడి చక్కగా నచ్చినవన్నీ తెచ్చుకుని కడుపారా తిన్నాం. అన్నిటికన్నా చాలా ఇష్టంగా పిల్లలు పుడ్డింగుల వంటి చిన్న కేకుల్ని తిన్నారు. నిజంగానే చాలా బావున్నాయవి. అందానికి అందంగానూ, రుచికి బ్రహ్మాండంగానూ.

మొత్తానికి ఒక పూటంతా మాకు వృధా అయినా టైం షేరింగు స్కీములో చిక్కుకోకుండా బయట పడినందుకు మమ్మల్ని మేం అభినందించుకున్నాం.

ఇక అక్కడుండే మిగతా వారం రోజులూ చూడాల్సిన వాటికి రిజర్వేషన్లు తర్వాతి పని. మా హోటల్ లాబీలో ఉండే టూర్ల సెక్షను వాళ్లే రిజర్వేషన్లు చేస్తుండడం, ముందు రోజు ఎయిర్పోర్టులో అమ్మాయి చెప్పిన డిస్కౌంట్ రేటుకే ఇస్తుండడం వల్ల అక్కడే అన్ని రోజులకీ టూర్ల రిజర్వేషన్లు తీసుకున్నాం.

ముందుగా అదే రోజు సాయంత్రం తప్పక చూడదగ్గ లిస్టులో ఉన్న డిన్నర్ క్రూజ్‌కి బుక్ చేసుకున్నాం.

అదొక పైరెట్ షిప్పు థీం టూరు. దగ్గర్లోని స్మాల్ పోర్టుకి మా అంతట మేమే వెళ్లి ఎక్కాలి.

అదేమంత పెద్ద కష్టమైన పని కాదు అని అప్పటికే అర్థమయ్యింది మాకు. హోటల్ బయటికి ఎడమకి, కుడికి మాత్రమే వెళ్లగలిగే ద్వీపకల్పం వంటిది మేమున్న హోటల్ జోన్. ప్రతి నిమిషానికో బస్సు, టాక్సీ తిరుగుతూనే ఉంటాయి.

మేం ఈ టూరుతో బాటూ మర్నాటికి ప్రపంచ ఆధునిక వింతల్లో ఒకటైన చిచెన్ ఇట్జా, ఆ మర్నాడు చారిత్రాత్మక ప్రదేశాలైన తులుం కట్టడాలు, ఆ మర్నాడు మరోటూరు అంటూ వరసపెట్టి అన్ని రోజులకూ బుక్ చేసేసాం.

మధ్యలో ఒక రోజు మాత్రం అందరం వెళ్లలేని అడ్వెంచర్ టూరుకు మాత్రం కేవలం వరు, సత్యలకు బుక్ చేసి నేను సిరి రిసార్టులో ఉండిపోయాం.

హొటలే సముద్రతీరంలో ఉండడం, వాతావరణం నును వెచ్చగా చక్కగా ఉండడం వల్ల నిజ్జానికి రిసార్టు లోనే బోల్డు కాలక్షేపం.

సరే ఇక సాయంత్రం టూరుకు గబగబా తయారయ్యి బయలుదేరేం.

పొద్దుటంతా ఎండలో తిరిగినా సముద్రతీరంలో తేమ లేనందువల్ల సాయంత్రం ఈ టూరులో ఆహ్లాదంగానే అనిపించింది.

ఆరు గంటలకు టూరు కావడం, మా హొటలు నించి షిప్ యార్డు పది నిమిషాల వ్యవధిలోనే ఉండడం వల్ల అయిదుంబావు సమయంలో మా హొటలు బయట టాక్సీ పది డాలర్లకు మాట్లాడుకున్నాం.

ఇక్కడ "పేసో"లులోకల్ కరెన్సీ అయినప్పటికీ డాలర్లు అన్ని చోట్లా తీసుకుంటారు.

టాక్సీలు అమెరికాలో ఉన్నంత సౌకర్యవంతంగా లేకపోయిన్నపటికీ, ఫర్వాలేదనిపించాయి.

అనుకున్న సమయానికి పోర్టు చేరుకున్న మాకు టాక్సీ స్టాండు నించే పైరేట్ల వేషధారణలో ఉన్న సిబ్బంది స్వాగతం పలికారు.

ఒకతను వచ్చిన వాళ్లకల్లా గొంతు మీద పెద్ద కత్తి పెట్టి మరీ స్వాగతిస్తున్నాడు.

అతనితో పాటూ, నేనూ కాసేపు నటించి నవ్వుతూ ఫోటోలకు ఫోజులిచ్చేను.

ఈ నౌక పెద్ద షిప్పూ, చిన్న బోటూ కాకుండా మధ్యస్థంగా ఉంది. మొత్తం పైరేట్ షిప్పు థీం కావడం వల్ల నల్ల రంగు, అస్తి పంజరాలు, ఒక కన్నుకి గంతలు కట్టుకున్న సముద్రపు దోపిడీ దొంగలు, తుపాకులు మొ.న అలంకరణతో నిజంగా పైరేట్ షిప్పు ఇలాగే ఉండేదని అనిపింపజేస్తూ ఉంది.

షిప్పు ఎక్కే ముందే లైనులో నిలబెట్టి షిప్పులో జరగనున్న కథకు పూర్వ ఘట్టాన్ని ప్రదర్శించేరు.

నిజమైన ఫీట్లు, తుపాకీ మోతలు, షిప్పు కేప్టెను అధికారిక ఆహ్వానంతో సందర్శకుల్ని గాథలోకి సహజంగా తీసుకెళ్లడం చాలా చక్కగా చేసేరు.

ఏడు గంటల ప్రాంతంలో చీకట్లు కమ్ముకునే సమయంలో నావ కదిలింది.

ఓపెన్ డెక్‌లో అటు పది, ఇటు పది వరసల్లో దాదాపు వంద మంది పట్టగలిగే బెంచీలు వేసున్నాయి. అన్నీ నిండిపోవడం విశేషం. ప్రతీ రెండు వరసలకు ఒక మనిషి చొప్పున సందర్శకులకు ఏం కావాలన్నా చూసుకోవడానికి షిప్పు సిబ్బంది ఉన్నారు. టిక్కెట్టులోనే భోజనం, కూల్ డ్రింకులు భాగం. ఆల్కహాలు కావాలంటే మాత్రం విడిగా పే చేయాలి.

కూల్ డ్రింకులు వాళ్లే సీట్ల వద్దకు తెచ్చి ఇస్తారు.

నౌక బయలుదేరగానే ప్రదర్శన ప్రారంభం అయ్యింది.

అన్ని పైరేట్ల కథల్లాగే ఎక్కడో గుప్త నిధులకోసం బయలుదేరిన నౌక, సిబ్బంది, సగం చినిగిన మేప్, విలన్ల ప్రవేశం, నౌకని ముట్టడించడం, కొందరు సముద్రం పాలు కావడం, మంటలు, హాహాకారాలు, తుపాకుల మోతలుఒకటేమిటి అన్నీ అత్యద్భుతంగా ప్రదర్శించేరు.

అందులో భాగంగా ఒకరిద్దరు నిజంగా అంతెత్తు నౌకలో నుంచి సముద్రంలోకి దూకడం మాత్రం ఒళ్లు గగుర్పొడిచేలా చేసింది.

ఒక గంట పాటు కథా ప్రదర్శన, మధ్యలో భోజనానికి ఒక గంట బ్రేకు, చివరి గంట గానాబజానాతో సమయం తెలీకుండా గడిచిపోయింది.

మంచి వెన్నెల కాస్తున్న రోజులు కావడం వల్ల మధ్యలో నిశ్శబ్దం ఆవరించిన సమయంలో చల్లని వెన్నెల్లో సముద్ర ప్రయాణం ఎంత ఆహ్లాదంగా అనిపించిందో చెప్పలేను. అతి స్పష్టంగా కనిపిస్తున్న చుక్కలతో ఆడుకుంటున్న చందమామ చల్లని చిరునవ్వులు మా మధ్యా ప్రసరించాయి.

భోజనాలకు నౌకలోని లోపలి భాగానికి దిగి వెళ్లాలి. అక్కడ నిర్దేశించిన ప్రదేశాలలో టేబుల్ దగ్గిర కూచోబెట్టి డిన్నర్ తీసుకొచ్చి ఇచ్చేరు. ఏవో బర్గర్ల వంటివైనా బానే అనిపించేయి.

భోజనం కాగానే డెక మీదికి వెళ్లగానే ప్రతీ ఒక్కరినీ ఏ దేశం నించి వచ్చారో అడిగి వారి పాటల్ని వినిపించడం, అందుకు అనుగుణంగా నాట్య ప్రదర్శనలు చెయ్యడం బాగా అనిపించింది.

నౌక మొత్తంలో ఇండియా నుంచి వచ్చినవాళ్లం మేం మాత్రమే ఉన్నాం.

ఇండియా పేరు వినగానే హిందీ పాటొకటి వేసి చక్కగా బాలీవుడ్ డాన్సు చేసి నమస్కారాలు చేసేరు చివర.

అందులో భాగంగా డాన్సుకోసం స్టేజీ మీదకు పిలవగానే పిల్లలూ, సత్య నన్ను ముందుకు తోసేరు.

అలా స్టేజీ మీదికి వెళ్లిన నేను చివర్లో గ్రూపు డాన్సుల వరకు అక్కడే ఉండిపోవలసి వచ్చింది.

మొత్తానికి ఆ సాయంత్రం ఎంతో ఉత్సాహపూరితంగా బాగా గడిపేం.

కాన్ కూన్ వెళ్లినవారికి ఈ టూరు ఒక కొత్త ఉత్సాహాన్ని ఇస్తుందనడంలో సందేహం లేదు.

తిరిగి వచ్చేటపుడు సమయం పదవడంతో టాక్సీకి ఇరవై డాలర్లు ఇవ్వవలిసి వచ్చింది.

ఇలా సమయాన్ని బట్టి ధర మార్చేయడం అంతటా ఉన్నా, సగానికి సగం పెంచేయడంలో ఇండియాకి ఏ మాత్రం తీసిపోలేదు ఇక్కడి వాళ్లు.

*(ఇంకా ఉంది)*

♦ ♦ ♦

# భాగం-6

# యాత్రాగీతం(మెక్సికో-కాన్ కూన్-ఐలా మొహారీస్)-6

కాన్ కూన్‌లో మొదటి రోజు టైం షేరింగు స్కీము వాళ్ల బారిన పడి సగం రోజు వృథా అయినా సాయంత్రం వెళ్లిన పైరేట్ షిప్పుటూరుతో ఆహ్లాదంగా గడిచింది. రెండవ రోజు మేం ఆధునిక ప్రపంచ వింతల్లో ఒకటైన "చిచెన్ ఇట్జా" టూరుకు బుక్ చేసుకున్నందున ఉదయానే లేచి తయారయ్యి హొటలు లాబీలో చక్కని రెస్టారెంటులో బ్రేక్ ఫాస్టు చేసి టూరు బస్సు కోసం సిద్ధమయ్యేం. మా హొటలు నుంచి మరో రిసార్టు వరకు చిన్న వ్యానులో వెళ్లి అక్కడి నుండి పెద్ద బస్సులో ఎక్కేం. దాదాపు మూడు గంటల పాటు పశ్చిమ దిక్కుగా ప్రయాణం చేసేం.

దారి పొడవునా భూమి నుంచి దాదాపు పదడుగుల వరకు పెరిగిన దట్టమైన మొక్కల వంటి పొదలే తప్ప ఎత్తైన వృక్షాలు లేవు.

ఇక పల్లెటూళ్లయితే అచ్చు ఇండియాలోలాగే ఉన్నాయి. ఎటొచ్చీ అంత జనాభా లేరు, అంతే తేడా.

దాదాపు 11 గంటల వేళ చిచెన్ ఇట్జాకు చేరుకున్నాం. చిచెన్ ఇట్జా మాయా సంస్కృతికి చెందిన ఎత్తైన ప్రాచీన కట్టడం.

దాదాపు పావు మైలు దూరంలో బస్సులు నిలిపే స్థలం నుంచి లోపలికి నడవాలి.

అక్కడ ఎంట్రన్సు టిక్కెట్లు కొనుక్కున్న ప్రదేశం నుంచి మొదలుకొని చిచెన్ ఇట్జా కట్టడం వరకు దారి పొడవునా బట్టలు, పూసలు, రాళ్లు మొ.వి అమ్మే దుకాణాల వరుసలు మళ్లీ ఇండియాని తలపింపజేసేయి.

చివరి దుకాణం దాటుతూనే ఎదురుగా కనబడ్డ చిచెన్ ఇట్జా కట్టడం వైపు చూసేసరికి నోటమాట రాలేదు. ఆ కట్టడం చిన్నదీ, చితకదీ కాదు. భూమి మీద నుంచి ఆకాశమ్మీదికి పోటీ పడుతూ నిత్యగంభీరంగా శతాబ్దాల తరబడి మా కోసమే వీక్షిస్తున్న అత్యద్భుత మేరు పర్వతంలా ఉందది. అమెరికా ఖండంలో మేం చూసిన మొట్టమొదటి అత్యంత ప్రాచీన కట్టడమది.

ఎక్కడికక్కడ పెళ్లలు ఊడి రాలుతున్న కట్టడం చుట్టూ తాళ్లు కట్టి ఎవర్నీ దాటి పైకి

ఎక్కడానికి అనుమతించడంలేదు. కట్టడాన్ని పరిరక్షించడం కోసం, పునర్నిర్మించడం కోసం అలా చేస్తున్నా పైకి ఎక్కాలనుకున్న వారికి ఆశాభంగమే.

ఇక నేను గైడు చెప్పే మాటలు వినడం పక్కనబెట్టి, అలా నిలబడి కట్టడం వైపే కన్నార్పకుండా చూస్తూ ఉండిపోయాను.

ప్రధాన కట్టడానికి నాలుగు వైపులా ఇతర కట్టడాల వంటివి ఉన్నాయి. అవి కూడా ఎత్తుగానే ఉన్నాయి.

ఆ రోజు బాగా వేడిగా ఉండడంతో ఎండ చుర్రుమంటూంది.

అంతలో సిరి అస్సలు నడవనని పేచీ మొదలు పెట్టింది.

ఇక మాది గైడెడ్ టూరు కావడంతో గైడు, తోటి సందర్శకులతో బాటూ సత్యని, వరుని వెళ్లమని నేను సిరితో బాటూ మొదటి చెట్టు కిందే ఉన్న బెంచీమీద కూచున్నాను. అయితేనేం ఎదురుగా చిచెన్ ఇట్జా నాతో తన ఊసులన్నీ కలబోసుకుంటూనే ఉంది.

ఒకప్పటి మాయా సంస్కృతిలో భాగమైన ఈ అతి పెద్ద కట్టడం ప్రపంచంలో ఎనిమిది ఆధునిక వింతల్లో చోటు చేసుకుందంటే ఆశ్చర్యం లేదు.

అక్కడ ఉన్న స్థానికులంతా మాయా సంతతికి చెందిన వాళ్లే. వాళ్లని చూడడం, మాట్లాడడం అత్యంత ఆనందాన్ని కలిగించేయి నాకు.

మాయా సంతతికి చెందిన వాళ్లంతా పొట్టిగా, లావుగా ఉన్న మనుషులు. వారి పూర్వీకులు ఇలాంటి ఆకాశ హర్మ్యాన్ని నిర్మించగలిగేరంటే చాలా గొప్ప విషయం.

క్రీ.శ 750 నుండి 900 వరకూ ఈ కట్టడాన్ని నిర్మించినట్లు ఆధారాలున్నాయి.

మెక్సికో లోని యూకతాన్ ద్వీపకల్పానికి చిచెన్ ఇట్జా ఒకప్పుడు ప్రధాన నగరం. ఈ చుట్టుపక్కలంతా "సెనోట్"లనబడే భూగర్భ జలాంతర్వాహినులుంటాయి. ఇవి అతి పెద్ద మంచి నీటి నిల్వలు. ఇక్కడ సహజ సిద్ధంగా కొన్ని చోట్ల అత్యంత పెద్దవైన బావులేర్పడ్డాయి. కొన్ని జలాంతర్వాహినులు గుహాంతరాళాల్లో ప్రవహిస్తూ ఉంటాయి.

స్థానిక భాషలో "చిచెన్ ఇట్జా" అంటే ఇట్జా జాతికి చెందిన భూగర్భ జలాంతర్వాహిని ముఖ ద్వారమని అర్థమట.

చిచెన్ ఇట్జా లోని ఎత్తైన ప్రధాన కట్టడాన్ని స్పానిషు భాషలో "ఎల్ కాస్తిలో" (The Castle)

అని అంటారు. దీనినే స్థానికులు "కుకుల్కాన్ గుడి" (Temple of Kukulcan) అని అంటారు. ఇది పిరమిడ్ ఆకారంలో కట్టబడింది.

దాదాపు 5 చదరపు కిలోమీటర్లలో విస్తరించి ఉన్న చిచెన్ ఇట్జా ఒక్క కట్టడం కాదు. కట్టడాల సముదాయం.

ఆర్కియాలజిస్టులు ఈ ప్రదేశాన్ని కాస్తిలో పిరమిడ్ (Castillo pyramid), లాస్మోహాస్ (రాఖుం వీశీఅయిఖుం), ఒసారియో (రాయిఖతీఆశీ), ప్రధాన నైరుతిమూల కట్టడాలు అనే నాలుగు విభాగాలుగా విభజించారు.

ఇవన్నీ ఒక రకమైన సున్నపురాతితో నిర్మించిన కట్టడాలు. ఒకప్పుడు స్థానికంగా చెట్ల నుండి, రాళ్ల నుండి లభ్యమయ్యే ఎరుపు, పచ్చ, నీలం, ఊదా రంగులతో అలంకరించబడి ఉన్నవి కూడా.

ఇక ఇక్కడ చూడదగ్గ ప్రధానమైన ప్రదేశాలు ఏవిటంటే ఉత్తరాన కుకుల్కాన్ గుడి [El Castillo (Temple of Kukulcan)ి, వీరుల ఆటస్థలం (Temple of Warriors and the Great Ball Court), ఒసారియో విభాగంలో తోలిక్ గుడి (Temple of Xtoloc) మధ్యస్థాన కారాకోల్ (the Caracol),లాస్మోహాస్ (Las Monjas), అకాబ్ దీబ్ (Akab Dzib) కట్టడాలు, దక్షిణాన పాత చిచెన్ లేదా చిచెన్ ఓహెూ(Chichén Viejo- Old Chichén).

*(ఇంకా ఉంది)*

♦ ♦ ♦

# భాగం-7

## యాత్రాగీతం(కాన్ కూన్ -తులుమ్- కోబా-సెనోట్- మాయా విలేజ్)-7

కాన్ కూన్‌లో మొదటి టూరు ప్రపంచంలో ఎనిమిది ఆధునిక వింతల్లో ఒకటైన "చిచెన్ ఇట్జా''లో విచిత్రమైన విషయాలు ఎన్నో ఉన్నాయి.

ప్రధాన కట్టడమైన కుకుల్కాన్ గుడి [El Castillo (Temple of Kukulcan)ి దాదాపు 98 అడుగుల ఎత్తున తొమ్మిదంతస్తుల్లోఉంటుంది. కింది అంతస్తుకంటే పైది కొంచెం చిన్నదిగా కట్టుకుంటూ వెళ్లి, ఒకదాని మీదొకటి పేర్చినట్లు చతురస్రాకారంలో ఉంటాయి. చిట్టచివరి అంతస్తు 20 అడుగుల పొడవు, వెడల్పు కలిగి ఉందంటే అన్నిటి కంటే కింది అంతస్తు ఎంత పెద్దదో ఊహించుకోవచ్చు.

ప్రధాన కట్టడపు పాద భాగంలో మెట్లకిరుప్రక్కలా రెండు సర్పాల తలలు భీకరంగా నోళ్లు తెరుచుకుని ఉంటాయి. అంతేకాదు ఏటా వసంత, శిశిరకాలాల ప్రారంభంలోఏర్పడే విషువత్తులలో మధ్యాహ్నపుటెండ మెట్ల నుంచి ప్రసరిస్తూ నీడల్ని ఏర్పరిచే తీరు సర్పం పాకుతున్న భ్రాంతిని కలగజేస్తుందట. దీనిని బట్టే ఋతువుల మార్పుల్ని అప్పటి ప్రజలు గమనించేవారని తెలుసుకుని అబ్బురపడ్డాం.

ముఖ్యంగా ఒక మూలగా ఉన్న వీరుల ఆటస్థలం (Temple of Warriors and the Great Ball Court)లో బంతి వెళ్లడానికన్నట్లు కట్టడానికి మధ్య అంచున పెద్ద రాతి రింగు ఉంటుంది. పైపెచ్చు 30 అడుగుల ఎత్తులో ఉంటుంది. అంత ఎత్తులోఉన్న రింగులోకి రాతిబంతిని ఎలా విసిరేవారో, ఎలా ఆడేవారో అని ఆశ్చర్యం కలగకమానదు.

ఇక మరో కట్టడం చుట్టూ పుర్రెల బొమ్మలు, మరోచోట క్రూరమృగాలు, దాదాపు అన్ని చోట్లా పాములు.

"చిచెన్ ఇట్జా''లో కట్టడం నుంచి కట్టడానికి నడుస్తూ ఉంటే శతాబ్దాల వెనక్కి అప్పటికప్పుడు ప్రయాణించిన అనుభూతి కలిగింది.

పొడయ్యి రాలిపడ్తున్న సున్నపు రాళ్ళ చుట్టూ అల్లుకుని ఉన్న మాయా జాతి జనుల పురాస్మృతులేవో గాల్లో అంతటా వ్యాపించి చుట్టుముట్టినట్లు వింత భ్రాంతి కలిగింది.

ప్రధాన కట్టడం చుట్టూ ఉన్న చిన్న చిన్న బల్లలమీద రాతి బొమ్మల దుకాణాల దగ్గిర ఆగి గాలి ఊదితే వింత శబ్దం చేసే రాక్షసుని తల వంటి బొమ్మ అక్కడి గుర్తుగా కొన్నాను. అక్కడ స్థానికంగా దొరికే నల్లరాయి బిళ్లలు గ్రహణం వచ్చినపుడు సూర్యుణ్ణి చూడడానికి వాడతారని అమ్ముతుండగా ఒకటి కొనమని వరు అడగసాగింది.

మమ్మల్ని చూడగానే దూరదేశం నుంచి వచ్చినవారమని తెలియడంతో అరచేతిలో ఇమిడే చిన్న బిళ్ల రాయి ఒక్కటి 20 డాలర్లు చెప్పసాగేరు.

మొత్తానికి నేనేదో బేరమాడి పది డాలర్లకు కొన్నాను. నిజానికి అది డాలరు కూడా చెయ్యదన్న విషయం నాకూ తెలుసు.

కానీ అన్ని మూడో ప్రపంచదేశాల్లాగే పేదరికంతో సతమవుతున్న మెక్సికో దేశమన్నా, అక్కడి ప్రజలన్నా ఏదో తెలియని ప్రేమ కలిగింది మాకు.

అందుకే ప్రతీ చోటా ఒక్కొక్కరికీ 20 డాలర్లకు తక్కువ కాకుండా టిప్పులు ఇచ్చేవాళ్ళం.

అంటే అక్కడి స్థానిక పేసోల్లో దాదాపు 400 పేసోలన్నమాట!

ఆ ప్రయాణంలో అయిన ఖర్చు ఇంటికొచ్చాక లెక్కచూసుకుంటే ఇంత వరకు మేం చేసిన అన్ని ప్రయాణాల కంటే

అత్యంత ఖరీదైనదని తేలి ముక్కున వేలేసుకున్నాం! ఆ సంగతలా ఉంచితే దాదాపు గంటన్నర, రెండు గంటల్లో

"చిచెన్ ఇట్జా" టూరు పూర్తి చేసి మళ్లీ బస్సెక్కేము.

మరో అరగంటలో టూరిజమ్ హొటలు దగ్గిర బఫే భోజనానికి ఆపేరు.

గడ్డితో నేసిన పై కప్పుతో చల్లని ఆవరణలో అప్పటికప్పుడు వేడివేడిగా తయారుచేసిన నోరూరించే పదార్థాలు.

మెక్సికను వంటల్లో ఎండుమిరపకాయలు, మన బెంగుళూరు మిరపకాయల వంటి రంగురంగుల మిరపకాయలు ఉల్లిపాయలు వెయ్యడం వల్ల తినడానికి బానే ఉంటాయి. అయితే దాదాపు అన్ని వంటకాలు మొక్కజొన్న పిండితో చెయ్యడం వల్ల వాసన గిట్టడానికి కొంచెంసమయం పడుతుంది.

మెక్సికను రైసు చవక రకం దుడ్డుబియ్యంలా అనిపిస్తాయి. దానితో బాటూ రాజ్ మాని

పోలిన పొడవైన బీన్స్ ఉప్పులేక తినలేకపోయినా, మన మసాలా వడల్ని పోలిన మొక్కజొన్న, ఏదో ఆకుకూర కలిపి చేసిన వడలు, నంజుకోవటానికి పెట్టిన పచ్చిమిరపకాయల సాస్, పరపరా నమలగలిగే చికెన్ రోల్స్ మాత్రం బ్రహ్మాండంగా ఉన్నాయి. వాటితో బాటూ కేరట్ల వంటి పచ్చికాయగూరలు, పుచ్చకాయలు సరేసరి. ఇక మన పరమాన్నాన్ని పోలిన పాల పరమాన్నం చూడడానికి బానే ఉన్నా నెయ్యి, బెల్లం, యాలకపొడి లేని కారణంగా ఎవరికీ నచ్చలేదు.

ఇక చికెన్ అంటే పరుగెత్తుకొచ్చే మా సిరి ఇక్కడి వంటకాల వాసనకి ఆమడదూరం పరుగెత్తింది. ఏదో కష్టమ్మీద అటూ ఇటూ కలిపి వదిలేసింది.

భోజనాలయ్యేక మరోఅరగంటలో ప్రసిద్ధ ఇక్కిల్ సెనోట్ (Ik Kil cenote) దగ్గిర ఆపేరు.

దారిపొడవునా ఊళ్లలో ఇళ్లన్నీ అచ్చు ఇండియాలో ఉన్నట్టే ఉన్నాయి. కాకపోతే అంత జనాభాయే లేరు. అంతే తేడా.

సెనోట్‌కి బస్సు పార్కింగ్ నుంచి ఆవరణ చుట్టూ దుకాణాలు ఉన్నాయి. అదేదో పాత నగరానికొచ్చిన అనుభూతి కలిగింది.

సెనోట్ అంటే భూఅంతర్భాగంలోని సున్నపురాయి లోపలికి చొచ్చుకుపోయి అంతర్భాగంలోఎక్కడో ఉన్న జలాల్ని పైకి తీసుకొచ్చిన "సహజసిద్ధ జలాశయం" అని చెప్పుకోవచ్చు.

అప్పటివరకూ గైడు చెప్పిన వివరం ప్రకారం ఏదో చిన్న జలాంతర్వాహినిని మెట్లు దిగి చూడాలని

అర్థం చేసుకున్న మేం తీరా వెళ్లి చూసేసరికి అదొక అతి పెద్ద దిగుడు బావిలా, ఊడలతో దాదాపు 85 అడుగుల వెడల్పుతో అతి భయంకరంగా ఉంది. అసలింత వరకు అంత పెద్ద బావి లాంటి ప్రదేశాన్ని మేం ఎప్పుడూ చూడలేదు. అసలు పైనుంచి చూడడానికే కళ్లు తిరగసాగేయి. సిరి భయపడి దగ్గిరికే రానని మొరాయించింది.

ఇక సత్య, వరు అందులో ఈత కొట్టడానికి లైఫ్ జాకెట్లు వేసుకుని, గోప్రో కెమెరా తగిలించుకుని తయారయ్యేరు. ఆ సెనోట్ అసలే నూట ముప్ఫయి (130) అడుగుల లోతైనది.

నేను వద్దని గోలపెట్టినా వినిపించుకోలేదు. అరగంటైనా వీళ్లు రాకపోవడంతో మా పక్కన చాలా సేపట్నుంచి

కూచున్న చైనీస్ ఆడ వాళ్లిద్దరికి సిరిని అప్పగించి నేను బావి వైపు దారి తీసేను. బావిలోపలికి దిగే మెట్లు పదిమంది ఒక్కసారిగా దిగగలిగినంత పెద్దవి.

కాస్త దిగగానే మెట్ల రెయిలింగ్ మీంచి చూస్తే దాదాపు వంద మంది వరకూ నీళ్లలో లైఫ్ జాకెట్లు వేసుకుని ఈతకొడుతూ కనిపించేరు. అంత మందిని చూసి కాస్త ధైర్యం వచ్చింది నాకు.

ఇక కొంత మంది దాదాపు ఇరవై ముప్ఫై అడుగుల ఎత్తు నుంచి నీళ్ళలోకి దుమకసాగేరు.

సరిగ్గా నేను వెళ్లిన సమయానికి వరు, సత్య ఆ లైనులో కనిపించేరు.

వరుకి ఈత వచ్చు. తను ఇలాంటి జంపులు బానే చేసేస్తుంది కూడా.

కానీ సత్య ఇలాంటి జంపులు ఎప్పుడూ చెయ్యగా చూడలేదు.

నేను పై నుంచి వద్దని అరిచినా మెట్ల మీద చాలా మంది ఉండి గందరగోళంగా ఉండడంతో వాళ్లకు వినబడలేదు.

చేసేదేంలేక భయంగా చూడసాగేను. సత్య దుమికి వెంటనే పైకి వచ్చినా పక్కన తాడు కట్టిన నిషిద్ధ ప్రాంతానికి వెళ్లిపోతుండడం చూసి మళ్లీ అరిచేను. నా అరుపు వినబడకపోయినా వరు వెంటనే చూసి వెళ్లి చెయ్యందించి, వెనక్కి లాక్కొచ్చింది. అంతేకాకుండా ఒడ్డున ఒకరిద్దరు సిబ్బంది కూడా ఉన్నారు.ఇక అది చూసేక నాకు పూర్తిగా ధైర్యం వచ్చింది.

మధ్యలో నన్ను చూసి చేతులూపి సంతోషంగా ఈతకొడ్తున్న వాళ్ల సరదా చూసి, పోనీలే బానే ఉంది కదా! అనుకుని ఇక వచ్చెయ్యమనడం మానేసి వెనక్కి సిరి కోసం వచ్చేసేను.

వెనక్కి వచ్చేసరికి సిరియే వాళ్లను ఆడించడం మొదలు పెట్టింది. ఆ ఆడవాళ్ళిద్దరూ సిరి చెప్పినట్లు అటూ ఇటూ పరుగులెడుతూ కనిపించేరు. అంతే కాకుండా వీళ్లకి అటూ ఇటూ వాళ్ల కుటుంబసభ్యులు నిలబడి చప్పట్లు కొట్టసాగేరు.

నేను వాళ్ళకి థాంక్స్ చెపుతుంటే "లేదు, మేమే మీకు థాంక్స్ చెప్పాలి. మీ అమ్మాయి భలే మంచి కంపెనీ ఇచ్చింది మాకు'' అన్నారు వాళ్లు.

మేం వచ్చేస్తుంటే సిరిని వాళ్లు వదల్లేక వదల్లేక వెళ్లేరు.

*(ఇంకా ఉంది)*

♦ ♦ ♦

# భాగం-8

# (కాన్ కూన్ -తులుమ్- కోబా-సెనోట్- మాయా విలేజ్-2)-8

కాన్ కూన్‌లో మొదటిరోజు చిచెన్ ఇట్జా సందర్శనం, ఆ తర్వాత ఒళ్లు గగుర్పొడిచే సెనోట్ అనుభవం తర్వాత తిరిగి రిసార్టుకి వచ్చే దారిలో "వేలొదొలీద్" (Valladolid) అనే పట్టణ సందర్శనానికి ఆపేరు మా బస్సు.

స్పెయిన్‌లో అదే పేరుతో ఉన్న గొప్ప నగరం పేరే ఈ "వేలొదొలీద్". దక్షిణ అమెరికా భూభాగంలోని స్పానిషు ఆక్రమణదారుల గుత్తాధిపత్యానికి గుర్తుగా అప్పటి క్రైస్తవ చర్చిలు, ఆవాసాలు పెద్ద పెద్ద కట్టడాలుగా ఇక్కడ గోచరమిస్తాయి. ప్రసిద్ధి గాంచిన సేన్ బెర్నార్డినో చర్చికి కూతవేటు దూరంలో బస్సు ఆపి గంటలో మళ్లీ అక్కడే కలవమని చెప్పేడు మా గైడు.

ఆ రోజు చర్చిని మూసి ఉండడం వల్ల బయటి నుంచే చూసి, మార్కెట్‌లో ఇతర విశేషాలు చూడడానికి మిగతా సమయాన్ని వినియోగించుకున్నాం. ముఖ్యంగా మాయా సంతతికి చెందిన వారు, స్థానికులు ఇక్కడ కనిపిస్తూండడంతో అటూ, ఇటూ నడిచి వారి వద్ద నుంచి స్థానికంగా తయారు చేసిన వస్తువులు బేరమాడకుండా కొన్నాం.

ప్రతీ చోటా లక్ష బేరాలాడే నేను ఇలా నిశ్శబ్దంగా కొంటూంటే వరు, సత్య ఆశ్చర్యంగా చూసేరు. "పాపం రోజల్లా కూచున్నా వీళ్లకు ఏం వస్తాయిలే" అని ముందుకు నడిచేను.

దారి పొడవునా ఇళ్ళూ, వీధులూ, బళ్ళూ, కార్లూ అన్నీ ఇండియాలో ఉన్నట్టే ఉండడాన్ని ఆశ్చర్యంగా చూసేం. అంతే కాదు, ఇక్కడి సంస్కృతి, నమ్మకాలు కూడా భారతదేశాన్ని పోలి ఉండడం విశేషం.

సాయంత్రానికి తిరిగి రిసార్టుకి చేరుకున్నాం. రిసార్టులో రాత్రిపూట డిన్నర్లకు ప్రత్యేకమైన రెస్టారెంట్లు ఉన్నాయి. అందులో ముందుగా జాపనీస్ క్విసీన్‌కు వెళ్లాం. రిస్సార్టుల్కో ఏ రెస్టారెంటుకెళ్లినా బిల్లు ఉండదు. కాకపోతే రద్దీ ఎక్కువగా ఉండడం వల్ల, సీట్లు పరిమితిగా ఉండడం వల్ల ఎక్కువ సేపు వేచి ఉండాల్సి వస్తుంది. తాగడానికి జ్యూసుల సెక్షన్‌లో ఉన్న వేవో ఆర్డర్ చేసేం. తీరా తెచ్చేక గ్లాసుల వాలకం చూసి అనుమానం వచ్చి అడిగితే ఆల్కహాల్ కలిపిన జ్యూసు ఆర్డరు చేసేమని తేలింది. అక్కడ నాన్ ఆల్కహాలిక్ జ్యూసు కావాలని ప్రత్యేకంగా చెప్పాలని అప్పుడు అర్థమయ్యింది.

ఇక ఏ రెస్టారెంటులో నైనా ఫుడ్ చాలా రుచికరంగా ఉంది. ప్లేట్లలో తక్కువ పోర్షన్లు ఉన్నా పగటి పూట బఫేలాగా వేస్ట్ చెయ్యకుండా ఈ పద్ధతి బానే ఉందనిపించింది.

మెక్సికోలో ఉన్నంతసేపూ నా మనసంతా ఒక రకమైన బాధ నిండింది. ఒక వైపు అత్యంత పేదరికంలో ప్రజలు మగ్గుతూ ఉంటే ఈ రిసార్టుల వంటివి వనరుల్ని విపరీతంగా వృథా చేస్తూ ఉన్నాయి. మా వంటి వారి వద్ద డబ్బు గుంజినా వనరుల్ని వృథా చెయ్యకుండా పేదలకు పంచితే బావుణ్ణని అనిపించింది.

ఇక రాత్రి భోజనం కాగానే సముద్రం వైపు ఆరుబయట స్విమ్మింగు పూల్స్ ఉన్న ఏరియాలో మధ్య ఉన్న స్టేజీ మీద డాన్స్ కార్యక్రమంలో కాస్సేపు సేద తీరేం.

ఇండియన్ డాన్సుకు పిలవగానే స్టేజీ మీద నాలుగు స్టెప్పులేసి రమ్మని సత్య నన్ను ముందుకు తోసేడు.

నేను వెళ్లి ఊరిల్కే సర్దాకి పాదం కలిపి వచ్చేను.

రాత్రి పూట ఆరుబయట హాయిగా గోరు వెచ్చగా, హాయిగా ఉంది. సముద్ర తీరాన నడవాలని అనిపించింది. కానీ అందరం అలిసిపోయి ఉండడం వల్ల ఆ కోరికను ఉదయం సమయానికి వాయిదా వేసేం.

మా గది ఉన్న పదో అంతస్తు నించి చూస్తే దిగంతాలకి పరుచుకున్న నల్లని సముద్రం మీద తళత్తళల కాంతిని నిలువుగా ప్రసరింజేస్తూ చందమామ అత్యద్భుతంగా గోచరించింది.

ఆ రోజు అక్కడ కెమేరాలో బంధించిన ఆ క్షణం ఎంత అపురూపమైనదంటే నా నవల "వెనుతిరగని వెన్నెల" ఆడియోకి ముఖ చిత్రంగా మారిందది.

బాల్కనీలో నుంచి లోపలికి వచ్చేసరికి సిరి రూములోనే ఉన్న జకూజీ టబ్బులో స్నానమని ఆట మొదలు పెట్టి ఒక పట్టాన రాదే!

మళ్లీ పొద్దున్నే మరో టూరుకి వెళ్లాల్సి రావడంతో ఆ పిల్లని బయటికి లాగి పడుకోబెట్టేసరికి తల ప్రాణం తోకకొచ్చింది.

మర్నాడు ఐలా మొహరీస్ (Isla maharis) ఐలాండ్ టూరుకు బుక్ చేసుకున్నాం.

మా రిసార్టు నుంచి మొదటి రోజు సాయంత్రం పైరేట్ షిప్పు విహారానికి వెళ్లిన వైపే వెళ్లేం కానీ చిన్న హార్బర్‌ని దాటి పెద్ద హార్బర్ అనే చోట నీళ్ల లోపలి వరకు సాగి ఉన్న డెక్ మీద లోపలికి

నడిచి, టిక్కెట్లు తీసుకుని మధ్యస్థంగా ఉన్న షిప్పు ఎక్కి దాదాపు గంట సేపు ప్రయాణం చేసి ఐలాండ్ చేరుకున్నాం.

సత్య, వరు డాల్ఫిన్స్‌తో ఈత కోసం ప్రత్యేకించిన టూరుకి బుక్ చేసుకోవడంతో ద్వీపానికి అటు వైపు ఉన్న ఒడ్డునే ఆగింది మా షిప్పు.

సముద్ర తీరంలోనే నీళ్లలో పెద్ద పెద్ద మళ్లు చేసి అందులో డాల్ఫిన్స్‌ని స్వేచ్ఛగా వదిలేరు. ఈత టూరు బుక్ చేసుకున్న వాళ్లకి ఇన్ స్ట్రక్టర్లు క్రమపద్ధతిలో ఒక తర్వాత ఒకరిని నీళ్లలోకి డాల్ఫిన్స్‌తో బాటూ వదులుతున్నారు. ఇలా ప్రాణుల్ని స్వేచ్ఛగా వదిలడం హర్షణీయం అయినా మనుషుల్ని అందువల్ల మనుషుల్ని గంటల తరబడి నీళ్లలో నానబెట్టడం ఏమీ బాలేదనిపించింది.

పైగా ఈ మళ్లలో లోతేమీ తక్కువ లేదు. దాదాపు రెండు మూడు గంటలపాటు లైఫ్జాకెట్లతో వెళ్లిన వాళ్లు అలా నీళ్లలో తేలుతూ ఒక పక్కగా ఉండవలిసిందే. అన్నిటి కంటే చాలా ముఖ్యంగా డాల్ఫిన్ మూపురం మీదున్న రెక్కని పట్టుకుని దానితో బాటూ ఈత కొట్టడం చూడడానికి బానే ఉన్నా దాని కోసం నీళ్లలో వరసలో వేచి ఉండి నానుతూ వారికి ఏమంత సరదా కాదనీ ర్థమయ్యింది వాళ్ల మొహాలు చూస్తే.

సత్య, వరు అడ్వంచరస్ మనుషులు. నేను, సిరి సున్నితమైన వాళ్లం, భయస్థులమూ. సత్య పిరికిపందలమని అంటాడనుకోండి, అది వేరే సంగతి.

ఇక వీళ్లిద్దరూ మాకు బాగా దూరపు మడిలో ఉండడం వల్ల, మాలా కూడా వచ్చిన సందర్శకులని నిర్వాకహులు దగ్గరకు రానివ్వకపోవడం వల్లా దూరం నుంచే చూడడం తప్పలేదు. కానీ దగ్గర మళ్లలో ఉన్న డాల్ఫిన్స్ ని, వాటి విన్యాసాల్ని చూడగలిగేం.

ఇక నీళ్లంటే అత్యంత భయమైన సిరి నాతో ఉండడం వల్ల కాస్సేపటిలోనే నీళ్ల వైపు నుంచి థీం పార్కు లోపలికి నడిచేం. ఒడ్డునే వరసగా ఉన్న పెద్ద పెద్ద హట్స్‌ని ఆనుకుని ఉన్న గిఫ్ట్ షాపు దాటి లోపలికి వెళ్తే స్విమ్మింగు సంబంధిత దుస్తులు అద్దెకు ఇచ్చే దుకాణం, రెస్ట్ రూములు, దాటీ మరో పక్కగా వెళ్తే ఆరుబయటే చిన్న చిన్న గొడుగుల కింద ఇసుక నిండి ఉన్న చోట స్విమ్మిగు పూల్ చెయిర్లు, చిన్న స్విమ్మింగు పూల్ ఉన్నాయి.

బయట ఎండ తీవ్రంగా ఉన్నా గొడుగులు గడ్డితో నేసినవి కావడం వల్ల చల్లగా ఉంది. అందులో ఒక మాంచి చోటు చూసుకుని సిరి, నేను చతికిల బడ్డాం. అయిదే అయిదు నిమిషాల్లో కుర్చీ మీంచి కిందికి చేపపిల్ల నీటిలోకి దుమికినట్టు ఇసుకలోకి దూకి ఆట మొదలు పెట్టింది సిరి.

మా పక్కనే కూచున్న ఇద్దరు ఆడవాళ్లలో ఒకామె నీటిలోకి వెళ్లింది. మరో ఫామిలీలో తాత, అమ్మమ్మ దగ్గిర మనవరాళ్లని వదిలి భార్యా, భర్తా ఈతకు వెళ్లేరు.

వాళ్లంతా కెనడా నించి వచ్చిన వారు కావడంతో అంతా కబుర్లలో పడ్డారు.

ఇక సిరి వెళ్లి అందులో చిన్న అమ్మాయితో ఆడడం మొదలు పెట్టడమే కాకుండా వాళ్ల కుర్చీల దగ్గిర తనూ మకాం వేసేసింది. సిరికి తన్మ ఈడు వాళ్లకన్నా, తన కంటే పెద్దవాళ్లకన్నా చిన్న పిల్లంటే బాగా ఇష్టం. "బేబీ, బేబీ" అని వాళ్ల వెనకాల పడుతుంది.

వాళ్లు అలా పరిచయమయ్యి నాతోనూ మాట్లాడం మొదలు పెట్టేరు.

ఇంతకీ ఇద్దర్మాయిలూ లెస్బియన్లు. ఈ మధ్యనే పెళ్లి చేసుకుని హనీమూన్‌కి వచ్చేరట.

ఇక తాత, అమ్మమ్మలని నేను పొరబడ్డ వాళ్లు ఫామిలీ ఫ్రెండ్స్ అట.

అదీ సంగతి.

ఇక వాళ్లకి సిరిని అప్పగించి నేను కాస్సేపు దూరం నించే సత్య, వరులకు ఫోటోలు తియ్యడానికి పదినిమిషాల పాటూ వెళ్లేను.

కాస్సేపట్లో వాళ్లంతా వెళ్తుంటే సిరి కూడా వాళ్లతో వెళ్లిపోదామని పేచీ మొదలు పెట్టింది.

ఇక తన దృష్టి మరల్చడానికి సెల్ ఫోను ఇచ్చి గేమ్సు ఆడుకోమని కూచోబెట్టేను.

నిజానికి సిరి ఐపాడు లేకుండా ఎక్కడికీ కదలదు. కానీ ఎక్కడ పడితే అక్కడ మర్చిపోతుంది. ఈ ఉదయం ప్రయాణంలో బయటెక్కడా మర్చిపోకూడదని అసలు తేవడమే మానేసాం.

ఏమైతేనేం మధ్యాన భోజన సమయానికి సత్య, వరు వచ్చేరు.

అప్పటికే భోజనాలు ప్రారంభయ్యి చాలసేపే అయ్యింది. అన్నీ బఫే సిస్టంలో అనేక రకాలున్నా ఏవీ తినబుద్ధి కాలేదు ఎందుకో.

ఐలాండు స్టయిల్ కుకింగ్ ఒక కారణం కాగా తింటుంటే ముసురుతున్న పెద్ద ఈగలు మరో కారణం. ఏదో తిన్నామనిపించి బయట పడ్డాం.

అక్కణ్ణించి పదిహేను నిమిషల వ్యవధిలో మరో తీరాన ఉన్న అసలైన ఐలాండుకు బోట్ బయలుదేరుతున్న సమయాన జ్ఞాపకం వచ్చింది సత్య, వరు లకు నిర్వాహకులే తీసిన ఫోటోలకు డబ్బులు కట్టేము కానీ ఫోటోలు తీసుకోలేదని.

మళ్లీ వెళ్లేందుకు సమయం 10 నిమిషాలే ఉన్నా నేను పరుగెత్తుకెళ్లి తీసుకొచ్చేను.

అలాంటి సాహసాలు చెయ్యొద్దని సత్య ఎప్పుడూ మొత్తుకుంటూ ఉంటాడు.

నేను ఈ బోట్ తప్పిపోతే తర్వాత బోట్‌లో వాళ్లని కలుస్తానన్న ధీమాతో వెళ్లేని గానీ ఆరోజుకి ఐలాండులోపలికి అదే ఆఖరు బోటన్న విషయం నాకు తెలియదు.

అప్పుడు నేను బోటును సమ్యానికి ఎక్కలేకపోయి ఉంటే, సత్య తప్పక కిదికి దిగిపోతాడు. మేం ఇక తిన్నగా రిస్సర్టు ఉన్న ఆవలి ఒడ్డుకి థీం పార్క్ స్టాఫ్‌తో బాటు తిరిగి వెళ్లాల్సి ఉండేది.

మొత్తానికి నేను చివరి నిమిషంలో రావడంతో కథ సుఖాంతమయ్యిందన్నమాట.

ఇక అసలు ఐలాండు దగ్గిర షిప్పు దిగి లోపలికి నడిస్తే అదొక చిన్న సైజు పట్టణమే అనిపించింది.

కానీ ఐలాండు మొత్తం చుట్టి రావాలంటే స్వంతంగా నడుపుకునే గోల్ఫ్ కార్టు వంటిది అద్దెకు తీసుకుని తిరగాలి. దానికి కనీసం రెండు గంటల సమయం కావాలి.

మాకున్న సమయం దాదాపు గంటన్నర మాత్రమే.

అందుకే ఊరికే ఒక గంట అలా వీధులు తిరిగొద్దాం అని బయలుదేరేం.

కానీ అప్పటికే నడిచే ఓపికలు ఎవరికీ లేకపోవడం వల్ల సముద్రతీరాన ఉన్న మొదటి వీధి మాత్రమే చుట్టి రాగలిగేం.

ద్వీపంలో అత్యధికంగా లభించే కొబ్బరి బొండాలు తాగడం వంటి వాటితో బాటూ రోడ్డు పక్కన పల్లీలమ్ముతున్నట్లు చిన్న స్టాండ్ల మీద అమ్ముతున్న బజ్జీల వంటివి కొనుక్కు తిన్నాం.

ఐస్క్రీములు తిని, చిన్న చిన్న కీ చెయిన్ల వంటి బహుమతులేవో కొన్నాం.

ఒక చోట రోడ్డు పక్కన ఏదో టాప్ లీక్ అయ్యి నీళ్లు వీధికి ధార కట్టడంతో బురద మయమైన వీధిని, పట్టించుకోని స్థానిక పాలక వ్యవస్థని చూసి ఇదీ ఇండియాలా ఉందని నవ్వుకున్నాం.

షిప్పు ఎక్కడానికి వెనక్కి వచ్చి లైనులో నిలబడ్డ చోట మన వేరుశనపప్పు అచ్చుల వంటి వేవో అమ్ముతూంటే కొని, ఆమెతో కాస్సేపు మాట్లాడేను.

ప్రధానంగా ఈ ద్వీపవాసులకి ఏం కావాలన్నా దగ్గర్లోని కాన్ కూన్‌కి వెళ్లవలిసిందే. ఆమెకూడా రోజూ అక్కణ్ణించే వాచి వెళ్తుండట.

ఇక మన బెల్లాన్ని పోలిన పొడి వంటి బ్రౌన్ సుగర్ ఆ తీపి అచ్చుల్లో వాడడం విశేషం.

తిరిగి షిప్పు పట్టుకుని కాన్ కూన్ వచ్చి రిసార్టుకిఒ టాక్సిలో చేరుకునే సరికి సాయంత్రం ఆరుగంటలయ్యింది.

ఇంతకీ ఐలా మొహారీస్ అంటే జలకన్య ద్వీపం అని అర్థం.

జల కన్య ఆకారంలో ఆ ద్వీపం ఉండడం వల్ల ఆ పేరు వచ్చింది.

ఇక్కడే అండర్ వాటర్ మ్యూజియం కూడా ఉంది. కానీ దానికి పూర్తిగా అండర్ వాటర్ డైవింగులో శిక్షణ తీసుకుని ఉండాలి. పైగా అదొక రోజు కార్యక్రమం కూడా.

కాన్ కూన్ వెళ్లిన వాళ్లు ఒక సారైనా చూసి రాదగిన ప్రదేశం ఈ ఐలా మొహారీస్.

*(ఇంకా ఉంది)*

♦ ♦ ♦

# భాగం-9

## (మెక్సికో) (కాన్ కూన్ -తులుమ్- కోబా-సెనోట్- మాయా విలేజ్-3)-9

కాన్ కూన్‌లో మూడవ రోజు మేం రెండు గ్రూపులుగా విడిపోయి ఎవరికి కావలిసింది వాళ్లు చేసేం.

సత్య, వరు అడ్వెంచరస్ మనుషులు కావడంతో వాళ్లిద్దరూ జిప్ లైన్, జంగిల్ డ్రైవ్ & కేవ్ స్విమ్మింగ్ అడ్వెంచర్ టూరుకి వెళ్లేరు. ఇందులో జిప్ లైన్ అంటే ఒక తాడు ఆధారంగా నడుముకి కట్టిన చెయిన్లతో ఒక చోటు నుంచి మరో చోటుకి గాల్లో జారుకుంటూ వెళ్లడం. జంగిల్ డ్రైవ్‌లో ఎత్తుపల్లాల అడవి మార్గంలో చిన్న వెహికిల్‌లో స్పీడ్‌గా డ్రైవ్ చెయ్యడం, ఇక కేవ్ స్విమ్మింగ్‌లో నడుం లోతు నీటిలో మునిగి చీకటి గుహలో ఈదుకుంటూ వెళ్లడం.

వరు ఇవన్నీ సునాయాసంగా చేసిపారేస్తుంది. సత్యకి ఇటువంటివి చేసి చూడాలన్న ఉత్సాహం ఎక్కువ. ఇక ఇందులో ఏ ఒక్కటీ చెయ్యగల సత్తా, ధైర్యమూ లేనివాళ్ళం నేను, సిరి. కాబట్టి ఇక నేను, సిరి స్థిమితంగా లేచి రిసార్టులో ఫుల్ బ్రేక్ ఫాస్టు చేసి అలా రిసార్టు లోపలే అక్కడక్కడే రిలాక్స్‌గా తిరగడం పనిగా పెట్టుకున్నాం.

అయితే ఈ రిసార్టులో బస చేసినందుకు గాను కొన్ని పాయింట్లు ఇస్తారు. వాటితో రిసార్టు లోఉన్న నెయిల్ సెలూన్, స్పా, గిఫ్ట్ షాపు మొ.న చోట డిస్కౌంట్‌లు పొందవచ్చు. సరే, ఇందులో స్పా ప్రయత్నం చేద్దామని నిశ్చయించుకున్నాను.

ఉదయం 11 గం.లకు స్పా సెషన్‌ను ముందురోజు రాత్రే బుక్ చేసుకున్నాను.

అనుకున్నట్టే సత్య, వరు ఉదయం 8 గం.లకు వాళ్ల అడ్వెంచర్ టూరుకి వెళ్లేరు.

నేను సిరిని తీసుకుని స్పా ఉన్న రెండో అంతస్తులోకి 11 గం.లకు వెళ్లేను.

తీరా వెళ్లేక నాతో బాటూ పాపని లోపలికి తీసుకురావడానికి వీలు లేదన్నారు స్పా డెస్క్ వాళ్లు.

ఆ విషయం ముందు రోజు బుక్ చేసుకునే సమయంలో అడిగితే ఫర్వాలేదన్నారు కదా అన్నాను.

మీకు ఎవరో సరైన సమాచారం ఇవ్వలేదు, కుదరనే కుదరదు అని సమాధానం ఇచ్చారు.

సరే, బయట సోఫాలో నా సెల్ ఫోను ఇచ్చి కూచోబెడతాను. పాప బుద్ధిగా కూర్చుంటుంది. ఒకవేళ అటూ ఇటూ వెళ్లబోతే చూస్తారా అనడిగేను. అదీ వల్ల కాదు అన్నారు.

నాకు బాగా చిర్రెత్తుకొచ్చి మొదటి అంతస్తులో ముందు రోజు రాత్రి స్పా రిజర్వేషను చేసుకున్న కౌంటర్ దగ్గిరికి వెళ్లి అడిగేను.

వాళ్లు పాపని రిసార్టు డేకేర్‌లో కిడ్స్ ప్లే సెషన్‌లో జాయిన్ చెయ్యమని చెప్పేరు.

తీరా అక్కడికి వెళ్లే సరికి అక్కడ ఎవ్వరూ లేరు.అంతా బయట స్విమ్మింగు సెషన్‌లో ఉన్నారు. సిరిని జాయిన్ చేసుకోవడానికి వాళ్ల సెషన్ అయ్యేంత వరకూ ఆగమని ఇన్స్ట్రక్టరు చెప్పింది.

అదయ్యేసరికి ఇక్కడ నా అప్పాయింట్ మెంట్ అయిపోతుంది. చేసేదేమీ లేదని అర్థం అయ్యింది.

అయినా నేను విడిచి పెట్టకుండా రిసార్టు మేనేజరుని పిలిపించమని పట్టుబట్టేను.

హ్యూమన్ రిలేషన్స్ మేనేజర్ పరుగున వచ్చింది.

నా ప్రాబ్లమ్ సావధానంగా విని, వెంటనే నేను మీఅమ్మాయికి డేకేర్ వెంటనే ఏర్పాటు చేయిస్తాను నన్ను నిశ్చింతగా స్పాకి వెళ్లిరమ్మని ఆగమేఘాల మీద అందరికీ ఫోన్లు చేసి గబగబా నాప్రాబ్లమ్ సాల్వ్ చేసింది.

ఇక బిల్లు మాత్రం ఎంత డిస్కౌంట్ అని చెప్తున్నా మా ఊళ్లో కంటే ఎక్కువే అయ్యింది. అదన్నమాట సంగతి!

స్పా నుంచి నేను సిరిని తీసుకురావడం కోసం డేకేర్‌కి వెళ్లగానే సిరి చక్కగా బొమ్మలన్నీ పేర్చుకుని ఆడుకుంటూ, ఆనందంగా కనిపించింది. ఇంకాస్సేపు అక్కడే ఉంటానని పేచీ పెట్టింది కూడా.

మధ్యాహ్నా భోజనం చేసి సిరి, నేను రిసార్టుని ఆనుకుని ఉన్న బీచ్ ఇసుకలో కూలబడి చక్కగా ఆడుకున్నాం.

మూడు నాలుగు గంటల సమయానికే సత్య, వరు తిరిగి వచ్చేసేరు. అంతా కలిసి స్విమ్మింగుకి వెళ్లి, తిరిగొచ్చి స్నానాలు చేసి కేండిల్ లైట్ డిన్నర్‌కి వెళ్ళేం. ఇలాంటి డిన్నర్‌కి వెళ్లేటపుడు ఇక్కడి సంప్రదాయ దుస్తులు వేసుకోవడం పరిపాటి. మగవాళ్లు సూటు బూట్లు, ఆడ వాళ్లు గౌన్లు

వేసుకుంటారు. మేమూ అదే పద్ధతిలో తయారయ్యి డిన్నర్ చేసి వచ్చి పిల్లలతో కలిసి కబుర్లు చెప్పుకుంటూ బాల్కనీలో నుంచి వెన్నెలని, సముద్రతీరాన్ని ఆస్వాదించేం.

♦ ♦ ♦

మర్నాడు ఉదయం మేం తులుమ్- కోబా-సెనోట్- మాయా విలేజ్ వగైరా చూడడానికి టూరు బుక్ చేసుకున్నాం. ఈ ఫుల్ డే టూరులో సెనోట్ అంటే నీళ్లలో స్నానం తప్పనిసరికాబట్టి స్విమ్మింగు బట్టలవీ బ్యాగుతో తెచ్చుకున్నాం. మధ్యాహ్న భోజనం దారిలోని మాయా విలేజ్‌లో చేయడం టూరులోభాగం కాబట్టి భోజనానికి చూసుకోనవసరం లేదు. తాగడానికి మంచినీళ్ల బాటిళ్లు వ్యానులో ఎప్పుడంటే అప్పుడు అడిగి తీసుకోవచ్చు.

ఇక ఇది మొన్నటిలాంటి పెద్ద బస్సు టూర్ కాదు. పది మంది కూర్చొనగలిగే చిన్న సైజు వేన్‌లో మా డ్రైవరే గైడుగా అన్నీ తిప్పి చూపిస్తాడన్న మాట. మాతో బాటూ మరొక నలుగురు వేరే రిసార్టుల నించి ఈ టూరుకి వచ్చేరు. అందులో ఇద్దరు అమ్మాయిల జంట, ఒక వృద్ధ జంట. అంతా అమెరికన్లే. ఇక ఇద్దరు పిల్లల్తో మేం నలుగురం. వెరసి డ్రైవరుతో కలిపి తొమ్మండుగురం రోజంతా కలిసి ప్రయాణం చేసేం. మేం మొదటి సీట్లలో కూర్చోవడం వల్ల మా డ్రైవరు కం గైడుని నేను అక్కడి జీవన విధానం గురించి, ఆర్థిక పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నాను. కాన్ కూన్‌లో డ్రగ్ ట్రాఫికింగ్, అభద్రత గురించి నేను ప్రశ్నించినపుడు "అమెరికాలో భద్రతారాహిత్యం ఎంత ఉన్నా పైకి తేలనివ్వరు. ఇక్కడి చిన్న సంఘటనల్ని కూడా భూతద్దంలో చూపిస్తారు." అన్నాడు. నిజమేనేమో అనిపించింది. ఇక కాన్ కూన్ పర్యాటక ప్రాంతం కాబట్టి ఈ ప్రాంతంలో యువత ప్రత్యేకించి హొటలు మేనేజ్‌మెంటు వంటి కోర్సులు పూర్తిచేసి, ఇంగ్లీషులో కొద్దో గొప్పో ప్రావీణ్యం సంపాదించి రిసార్టు ఉద్యోగాలలో చేరడమే ప్రధాన జీవనోపాధి అనీ, అతనూ కొద్ది సంవత్సరాలు అదే వృత్తిలో గడిపి ఇప్పుడు ఈ వేను టూరు సంస్థలో డ్రైవరుగా చేస్తున్నానని చెప్పేడు. కుర్రవాడే అయినా ఇద్దరు పిల్లల తండ్రి అతడు. ఆ చుట్టుపక్కలే పుట్టి పెరిగిన మాయా సంతతికి చెందిన వాడు. మేం చేసిన ఆ ప్రయాణం అన్నిటికంటే ఉత్తమమైనదని చెప్పుకోవాలి. నిజమైన మాయా సంతతికి చెందిన మనుషుల్ని, వారి ఊళ్లని, సంస్కృతిని చూడాలంటే ఈ టూరుకి తప్పకుండా వెళ్ళిరావాలి.

*(ఇంకా ఉంది)*

♦ ♦ ♦

# భాగం-10

# కాన్ కూన్ -తులుమ్- కోబా-సెనోట్- మాయా విలేజ్-2

*- డా. ఎ.కె.గీత*

మర్నాడు ఉదయం మేం తులుమ్- కోబా-సెనోట్- మాయా విలేజ్ వగైరా చూడడానికి టూరు బుక్ చేసుకున్నాం. ఈ ఫుల్ డే టూరులో సెనోట్ అంటే నీళ్లలో స్నానం తప్పనిసరికాబట్టి స్విమ్మింగు బట్టలవీ బ్యాగుతో తెచ్చుకున్నాం. మధ్యాహ్న భోజనం దారిలోని మాయా విలేజ్‌లో చేయడం టూరులోభాగం కాబట్టి భోజనానికి చూసుకోనవసరం లేదు. తాగడానికి మంచినీళ్ల బాటిళ్లు వ్యానులో ఎప్పుడంటే అప్పుడు అడిగి తీసుకోవచ్చు.

ఇక ఇది మొన్నటిలాంటి పెద్ద బస్సు టూర్ కాదు. పది మంది కూర్చొనగలిగే చిన్న సైజు వేన్‌లో మా డ్రైవరే గైడుగా అన్నీ తిప్పి చూపిస్తాడన్న మాట. మాతో బాటూ మరొక నలుగురు వేరే రిసార్టుల నించి ఈ టూరుకి వచ్చేరు. అందులో ఇద్దరు అమ్మాయిల జంట, ఒక వృద్ధ జంట. అంతా అమెరికన్లే. ఇక ఇద్దరు పిల్లల్తో మేం నలుగురం. వెరసి డ్రైవరుతో కలిపి తొమ్మండుగురం రోజంతా కలిసి ప్రయాణం చేసేం. మేం మొదటి సీట్లలో కూర్చోవడం వల్ల మా డ్రైవరు కం గైడుని నేను అక్కడి జీవన విధానం గురించి, ఆర్థిక పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నాను. కాన్ కూన్‌లో డ్రగ్ ట్రాఫికింగ్, అభద్రత గురించి నేను ప్రశ్నించినపుడు "అమెరికాలో భద్రతారాహిత్యం ఎంత ఉన్నా పైకి తేలనివ్వరు. ఇక్కడి చిన్న సంఘటనల్ని కూడా భూతద్దంలో చూపిస్తారు." అన్నాడు. నిజమేనేమో అనిపించింది. ఇక కాన్ కూన్ పర్యాటక ప్రాంతం కాబట్టి ఈ ప్రాంతంలో యువత ప్రత్యేకించి హొటలు మేనేజ్‌మెంటు వంటి కోర్సులు పూర్తిచేసి, ఇంగ్లీషులో కొద్దో గొప్పో ప్రావీణ్యం సంపాదించి రిసార్టు ఉద్యోగాలలో చేరడమే ప్రధాన జీవనోపాధి అనీ, అతనూ కొద్ది సంవత్సరాలు అదే వృత్తిలో గడిపి ఇప్పుడు ఈ వేను టూరు సంస్థలో డ్రైవరుగా చేస్తున్నానని చెప్పేడు. కుర్రవాడే అయినా ఇద్దరు పిల్లల తండ్రి అతడు. ఆ చుట్టుపక్కలే పుట్టి పెరిగిన మాయా సంతతికి చెందిన వాడు. మేం చేసిన ఆ ప్రయాణం అన్నిటికంటే ఉత్తమమైనదని చెప్పుకోవాలి. నిజమైన మాయా సంతతికి చెందిన మనుషుల్ని, వారి ఊళ్లని, సంస్కృతిని చూడాలంటే ఈ టూరుకి తప్పకుండా వెళ్ళిరావాలి.

కాన్ కూన్ నించి దాదాపు 90 మైళ్ల దూరంలో ఉంది తులుమ్. దాదాపు రెండుగంటల ప్రయాణం. మెక్సికోలో యూకతాన్ ద్వీపకల్పంలోని "క్వింటానా రూ" రాష్ట్రానికి చెందినదే. సముద్రతీరంలో చుట్టూ ప్రహరీ గోడతో ఉన్న మాయా సంస్కృతికి చెందిన నగరం తులుమ్. 15 వ శతాబ్దిలో స్పానిషు ఆక్రమణదారులు రాక పూర్వం గొప్పగా విలసిల్లిన ఈ నగరం తరువాత తరువాత ఊకుమ్మడిగా విస్తరించిన రోగాల వల్ల జనసమ్మర్దం కరువై 18 వశతాబ్దం నాటికి పూర్తిగా నిర్మానుష్యమైపోయిందట.

చిచెన్ ఇట్జా లాగే ఇక్కడ కూడా కట్టడాలన్నీ ఒక రకమైన సున్నపురాయితో నిర్మించబడ్డవే.

తులుమ్ నగరంలో సామాన్యమైన గృహాలతో బాటూ మూడు ప్రధాన కట్టడాలున్నాయి. ఎల్ కాస్తిలో (El Castillo) కోట, టెంపుల్ ఆఫ్ ఫ్రెస్కోస్ (the Temple of the Frescoes), టెంపుల్ ఆఫ్ డిసెండింగ్ గాడ్ (the Temple of the Descending God).

కానీ కట్టడాల పరిరక్షణలో భాగంగా ఇక్కడి ప్రతీ కట్టడం చుట్టూ తాడు కట్టి ఎవరినీ లోపలికి అనుమతించనందున బయటి నించే నడిచి తిరగగలిగేం.

తులుమ్ నగరం సముద్ర తీరాన్ని ఆనుకుని ఉన్న చిన్నపాటి ఎత్తైన కొండమీద ఉన్నా తీరప్రాంతపు ఇసుక మేటలు వేసి ఉంది.

ఒకప్పుడు ఇది ప్రధాన ఓడరేవుగా విలసిల్లి వర్తకవాణిజ్యాలు విరివిగా సాగుతూ ఉండేవట.ఎల్ కాస్తిలోకి సముద్ర వైపున ఉన్న రెండు ప్రధాన కిటికీల నుంచి బహుదూరపు నౌకలు కనిపించేవట, ఇక్కడ వెలిగించే దీప కాంతి వల్లే రాత్రిపూట నౌకలు తీరాన్ని గుర్తించగలిగేవట.

అసలే యూకతాన్ ద్వీపకల్పంలో ఎక్కడా ఎత్తైన చెట్లు ఉండవు. ఇక్కడ మరీ నేలబారుకి ఉన్న సముద్ర తీరపు తుప్పలు తప్ప ఏవీలేవు. ఇక సముద్ర తీరంలో ఇక్కడ ఇలా నగరం విలసిల్లడానికి దగ్గర్లో ఉన్న మంచినీటి భూగర్భ సెనేట్ తాగునీరే ప్రధాన ఆధారమట.

మా బస్సు డ్రైవరే మా గైడు కావడంతో విశేషాలన్నీ వివరించి, కట్టడాల్ని దగ్గరనించి మా అంతట మేం చూసి రావడానికి వెళ్లేటపుడు నడవనని పేచీ పెడుతున్న సిరిని అతని దగ్గరున్న టాబ్లెట్ ఆడుకోవటానికి ఇచ్చి కూచోబెట్టుకుంటూ ఉండడంతో నేను కూడా ప్రశాంతంగా అన్నీ తిరిగి చూడగలిగేను.

అక్కడి రాతికట్టడాల్ని కళ్ల నింపుకుంటూ శిథిలాల మధ్య తిరుగాడుతూ ఉంటే అప్పటి ప్రజల జీవన విధానం కళ్లకి కట్టసాగింది. అక్కడ అన్నిటి కన్నా ఎత్తైన ప్రదేశం నుంచి చూస్తే

అందమైన లేత నీలి రంగు సముద్ర తీరం, చుట్టూ తెల్లని ఇసుక. అక్కడ వెన్నెల రాత్రి ఎంత మనోహరంగా ఉంటుందో అని అనిపించింది. అలల మనోహర గీతాలతో అత్యంత సుందరమైన ఆ ప్రదేశంలో నగరాన్ని నిర్మించుకోవడంలోనే మాయా ప్రజలు ఎంతటి సౌందర్యారాధకులో అర్థం చేసుకోవచ్చు అనిపించింది.

దాదాపు గంటన్నర తర్వాత ఆప్రదేశాన్ని వదిలి వెళ్లలేక వెళ్లలేక వెళ్ళేం.

అయితే ఆ తర్వాత మరో గంటలోమేం చూసిన “కోబా” శిథిలాలు చూసేసరికి ఆశ్చర్యంతో మతిపోయింది. ప్రధాన కట్టడం అత్యంత ఎత్తైనది.అంత గొప్ప ఎత్తైన కట్టడాన్ని ఇటీవల ఎక్కడా చూసినట్టు జ్ఞాపకం లేదు.

*(ఇంకా ఉంది)*

♦ ♦ ♦

# భాగం-11

# కాన్ కూన్ -తులుమ్- కోబా-సెనోట్- మాయా విలేజ్-3

*-డా॥కె.గీత*

తులుమ్- కోబా-సెనోట్- మాయా విలేజ్ డేటూరులో తులుమ్ శిథిలనగర సందర్శనం తర్వాత రెండవ ప్రదేశం "కోబా"శిథిల నగరం. ఇది తులుమ్ నగరానికి పూర్తిగా విభిన్నమైనది.

క్రీ.శ 600 నుండి క్రీ.శ 900 మధ్యలోతులుమ్ నగరానికి దాదాపు 30 మైళ్ల దూరంలో దట్టమైన చెట్ల నడుమ మాయా సంస్కృతికి చెందిన గొప్ప నగరం ఇది.

ఒకప్పుడు వంద మైళ్ల విస్తీర్ణంలో విలసిల్లిన ఈ నగరంలో దాదాపు యాభై వేల మంది నివసించేవారట.

ఇప్పటికీ ఇదే పేరుతో దగ్గర్లో ఉన్ననగరంలో కేవలం పదమూడు వందల మంది మాత్రమే నివసిస్తున్నారు.

స్పానిషు దురాక్రమణల వల్ల కనుమరుగై పోయిన సంస్కృతిలో మిగిలిన శిథిలాలు మూగ సాక్ష్యాలుగా ఇక్కడ దర్శనమిస్తాయి.

కోబా నగరం కోబా సరస్సు ( Lake Coba), మెకానోక్ సరస్సు (Lake Macanxoc)ల మధ్య ఉన్న సారవంతమైన భూభాగంలో నిర్మితమైంది.

ఈ యూకతాన్ ద్వీపకల్పంలో ప్రతీ చోటా కనబడే సున్నపురాతితోనే ఇక్కడ కూడా ఇళ్లతో మొదలుకుని అతిపెద్ద దేవాలయాల వరకు నిర్మించబడ్డాయి.

ఈ శిథిల నగరాన్ని పరిరక్షించడం కోసం ఇప్పుడు ఈ ప్రాంతాన్నంతా రక్షిత ప్రాచీన సంస్కృతీ కేంద్రంగా గుర్తించారు.

టూరిస్టుబస్సులు, వాహనాలు దాదాపు రెండు, మూడు మైళ్ల అవతలే ఆపి, శిథిల నగరం మొత్తం కాలినడకన కానీ అద్దెకు తీసుకున్న సైకిళ్ల మీద గానీ తిరగాల్సిందే. బహుకొద్ది సంఖ్యలో రిక్షాలు ఉన్నాయి.

సైకిళ్లకు లాగానే రిక్షాకు కూడా టిక్కెట్టు తీసుకోవడమే. ఒక సైకిలుకి 60 పేసోలు, రిక్షాకు 100 పేసోలు అద్దె. అంటే అమెరికన్ డాలర్లలో దాదాపు 3 డాలర్లు, 5 డాలర్లన్న మాట. అందులో పార్కు నిర్వాహకులకు కొంత, రిక్షాల ఓనర్లకు కొంత భాగం పోగా, రిక్షాలు తొక్కే సామాన్యులకు మిగిలేది అతి కొద్ది భాగం మాత్రమే.

అదృష్టం కొద్దీ మేం అడుగుపెట్టిన సమయానికి ఒకేఒక్క రిక్షా ఉందక్కడ. నేను బేరం కూడా ఆడకుండా సిరిని తీసుకుని వెళ్లి, ఎక్కి కూచున్నాను.

సత్య, వరు చెరో సైకిలు అద్దెకు తీసుకున్నారు.

ఇక్కడి రిక్షాలో మనుషులు కూచునే సీటు వీపు వెనక వైపు తొక్కే మనిషి ఉండడంతో ముందుకు ఎక్కడ పడతామో అనిపిస్తూ ఉంటుంది.

సిరి ముందు కూచోనని పేచీ పెట్టినా రెండు నిమిషాల్లో "హుర్రే" అని సరదాగా చుట్టూ చూడసాగింది.

కొద్దో గొప్పో ఇంగ్లీషు, స్పానిషు కలిపి మాట్లాడుతున్న రిక్షా అబ్బాయి మాయా సంతతికి చెందిన వాడినని చెప్పటంతో నేను అతనితో ఉత్సాహంగా కబుర్లలో పడ్డాను.

అట్టే ఎత్తులేని పొట్టి సరుగుడు చెట్ల లాంటి చెట్లు, బాట కిరుపక్కల దట్టంగా అల్లుకున్న తీగలతో పెద్ద పెద్ద ఆకుల మొక్కల మధ్య సన్నని మట్టి దారిలో దాదాపు అరగంట పాటు ప్రయాణంలో ముఖ్యమైన కట్టడాల దగ్గిర దిగుతూ, మళ్లీ ఎక్కుతూ ప్రధాన కట్టడమైన లొమాహా (Ixmoja) దేవాలయానికి చేరుకునేలోగా దారిలో ఆకులతో బూరలు తయారుచేసే మొక్క నుంచి, గాయాలకు ఔషధంగా ఉపయోగించే మొక్క వరకు అనేక విశేషాలు చెప్పేడతను. బహుశా: పాతికేళ్ళు ఉంటాయేమో. అక్కడ ఉన్న స్థానికులందరిలాగానే అతనికి కూడా టూరిజమే ప్రధాన జీవనోపాధి. అతని తాత ముత్తాతలందరూ చిన్న చిన్న కమతాల మొక్కజొన్నపంటలతోను, అటవీ సంపదతోనూ జీవనాన్ని సాగించేవారని, నాగరిక ప్రపంచానికి దూరంగా అతని పూర్వీకులు నివసించిన చోటే ఇలా జీవించడంలో ఎంతో ఆనందం ఉందనీ చెప్తున్న ఆ యువకుణ్ణి అభినందించాల్సిందే. ఇతనిలా ఎందరు ఆలోచిస్తున్నారు అనిపించింది.

రిక్షాని కావలసిన చోటల్లా ఆపుతూ, నేను అటూ ఇటూ చూడడానికి వెళ్లినపుడల్లా సిరిని కనిపెట్టుకుని జాగ్రత్తగా చూసుకున్న అతనికి దిగేటప్పుడు 20 డాలర్లు ఇచ్చేను.

అతని ఆనందానికి అవధులు లేవు. వారమంతా పనిచేసినా ఇంత రాదని అతను ఎంతో సంతోషించేడు.

మాతో వెనకే వస్తున్న సత్య, వరు మాతోబాటూ ఆగుతూ వచ్చేరు.

దారంతా సిరి "డాడీ! కమాన్, క్విక్" అంటూ వెనక్కి చూస్తూ హుషారుగా నవ్వుతూ అరుస్తూనే ఉంది.

దారిలో చిన్నవీ, పెద్దవీ ఎత్తున నలుచదరంగా కట్టిన అనేక కట్టడాలున్నాయి.

కొన్ని సమావేశస్థలాలు, కొన్ని దేవాలయాలు, కొన్ని సామూహిక నివాసస్థలాలు.

చిట్ట చివరిదైన లొమాహా దేవాలయానికి చేరుకునే సరికి ఆశ్చర్యంతో మతిపోయింది. ఆ కట్టడం ఇప్పటివరకు చూసిన అన్ని కట్టడాల కంటే, చిచెన్ ఇట్జా కంటే అత్యంత ఎత్తైనది. అంత గొప్ప ఎత్తైన కట్టడాన్ని ఇటీవల ఎక్కడా చూసినట్టు జ్ఞాపకం లేదు.

నలుచదరాకారంలో రాళ్ళు పేర్చుకుంటూ వెళ్లి పోయారు. క్రింద అతిపెద్ద చదరం నుంచి పైకి వెళ్ళే కొలదీ చిన్న చదరంగా ఆకాశంలోకి విస్తరించిన ఆ కట్టడాన్ని కన్నార్పకుండా చూస్తూ ఉండిపోయేను.

అన్ని ఇతర చోట్లలా కాకుండా దీనిమీదికి అధిరోహించనివ్వడం విశేషం. అయితే మోకాలి పర్వతంలా ఒక్కో మెట్టుకి, మెట్టుకీ మధ్య ఎత్తు చాలా ఉండడంతోను, మధ్య మధ్య విరిగిపోయిన రాతి ముక్కలతో జారుతూ ఉండడం వల్ల పై నుంచి కింద వరకూ వేళ్ళాడుతున్న తాళ్ల సహాయంతో పైకి ఎక్కాలి.

సత్య, వరు చకచకా ఎక్కేసినా, సిరితో కష్టమని నేను పదో మెట్టు లోనే ఆగిపోయేను.

అంత ఎత్తులో కట్టిన ఆ దేవాలయానికి అర్థం ఏవిటో పైకెక్కి తెలుసుకోవాలని ఎంతో ఉత్సాహంగా అనిపించినా, రాళ్ల మధ్య మెట్ల మీద దెబ్బలు తగిలించుకుంటూ కిందికి వస్తున్న తోటి సందర్శకులని చూసి విరమించుకున్నాను.

దాదాపు వంద మంది ఔత్సాహికులు పైకెక్క సాగేరు.

కిందన కబుర్లు చెప్పుకుంటున్న పది మంది రిక్షాల వాళ్లు, మా లాగే ఎక్కలేని ఐదారుగురు తప్ప ఎవరూ లేరు.

మంచి ఎండ సమయంలో ఆ కట్టడం పైకెక్కి కిందకి దిగడానికి గంట పైనే పడుతూ ఉంది.

*(ఇంకా ఉంది)*

♦ ♦ ♦

# భాగం-12

# కాన్ కూన్ -తులుమ్- కోబా-సెనోట్- మాయా విలేజ్-4

- డా॥కె.గీత

తులుమ్- కోబా-సెనోట్- మాయా విలేజ్ డేటూరులో తులుమ్ శిథిలనగర సందర్శనం తర్వాత రెండవ ప్రదేశం "కోబా"శిథిల నగరంలో ఆ ఎత్తైన కట్టడం దగ్గిరే దాదాపు రెండు గంటల సమయం గడిచిపోయింది.

తిరిగి వస్తూ ఉన్నపుడు చుట్టూ అరణ్యంలా మొలిచిపోయిన చెట్ల నడుమ అక్కడక్కడా మాయా చరిత్రకు ఆనవాళ్లుగా మిగిలిపోయిన శిథిల గృహాల అవశేషాలు, అప్పటి జన సమూహాల పాదముద్రల సాక్ష్యాలుగా నిలిచిపోయిన చిన్నా, పెద్దా కట్టడాలు మనసులో గొప్ప దిగుల్ని, బాధని కలిగించేయి.

ఎంత గొప్ప సంస్కృతయినా, సమాజమైనా అంతరించిపోతే ఇంతే కదా అనిపించింది.

దారిపొడవునా వన దేవతలు ఇప్పటికీ అక్కడే సంచరించిస్తున్న గగుర్పాటు కలిగింది.

మేం తిరిగి గేటు వరకు రిక్షాలో వచ్చి, దిగేక కూడా కాసేపు మాయా సంతతికి చెందిన అతనితో కబుర్లు చెపుతూనే ఉన్నాను. తాతముత్తాతలు జీవించిన అదే ఊళ్ళో ఉపాధి వెతుక్కున్న అతని మీద గౌరవం కలిగింది.

వచ్చే దారిలో మా మినీ బస్సు డ్రైవరు ఇప్పటికీ బయటి ప్రపంచపు ఊసు లేకుండా అడవిలోనే జీవనం సాగించే వారి ఇళ్లను దూరం నుంచి చూపించేడు. త్రోవలో ఒక చోట ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి బడికి వచ్చిన పిల్లలు కాలినడకన పోతుంటే ఆపి ఎక్కించుకుని రెండు, మూడు మైళ్ళ తర్వాత రోడ్డు మీద దించేడు.

ఆ చుట్టు పక్కల బస్సు సౌకర్యం లేనందున తమలాంటి ప్రైవేటు వాహనాల వాళ్ళందరూ ఇలా సాయం చేస్తుంటామని చెప్పేడు. అది చూసి మాబస్సు డ్రైవరు మీద ఎనలేని గౌరవం కలిగింది నాకు.

ఆ తరువాత మధ్యాహ్న భోజన విడిది కోసం మాయా పల్లెటూరికి తీసుకు వెళ్ళేరు.

మా మినీ బస్సు విడిదికి రెండు వీథుల అవతల ఆపేడు మా డ్రైవరు.

చుట్టూ మట్టిరోడ్లు, కంచెలు కట్టిన తడికెల ఇళ్లు అచ్చం మనవైపు ఊరులా ఉంది.

బస్సు ఆపిన చోటి నుండి ముందు నడుస్తూ దారిలో డ్రైవరు ఒక ఎర్ర పూలు, కాయల తుప్ప చెట్టొకటి చూపించి, కాయల్లోని గింజలు మాకు ఒకటి ఇచ్చేడు. ఆ గింజని నలిపితే వచ్చే ఎర్రని సింధూరం వంటి రంగు వస్తూంది.

ఆ రంగు వంటకాల్లో, ముఖాలకు రాసుకుందుకు రంగుకోసం వాడతారని చెప్పేడు.

ఇక చుట్టూ ఇళ్లున్న మాయా గ్రామంలో మధ్య కట్టిన పెద్ద ధాబాలా ఉంది ఆ టూరిజమ్ వాళ్ల భోజనశాల.

అయితే వంట జరుగుతున్న చోటుకి అందర్నీ ప్రత్యక్షంగా తీసుకెళ్లి సాంప్రదాయిక వంటలు, పదార్థాలు ఎలా వండుతున్నారో చూపించడం, అక్కడే వడ్డించడం విశేషం.

మేం ఇంతకు ముందు రోజు చిచెన్ ఇట్జా టూరులో తిన్న పప్పు వడల వంటివి ఇక్కడ ప్రత్యక్షంగా వండడం చూపించేరు. చక్కగా ఎర్ర మట్టితో అలికిన పెద్దగాడి పొయ్యి మీద పెద్ద పెనంలో వేయిస్తున్న వడలు చూస్తే అచ్చం ఒకప్పటి మన వంటశాలలు గుర్తుకు వచ్చేయి.

మెక్సికను ప్రాంతపు మిరప పళ్లు, టమాటా కలిపిన సాల్సా, మొక్కజొన్న చిప్స్, అవకాడో డిప్, బీన్స్, కేరట్స్‌తో ఉడికించిన లావుపాటి అన్నం, మాంసంతో, బీన్స్ పప్పుతో తయారుచేసిన గట్టి స్ప్రింగ్ రోల్స్,

వడలు, మొక్కజొన్న చపాతీలు, వేయించిన చికెన్ వంటి రకరకాల వంటకాలెన్నున్నా వడలు మాత్రమే అచ్చం మనం చేసుకున్నట్టు రుచిగా ఉండడంతో మేం మళ్లీ మళ్లీ అవే వడ్డించుకున్నాం. చిట్టచివర్లో ఏదో నువ్వుల అచ్చులా కనబడితే తెచ్చుకుని తీరా అది చియా సీడ్స్ వంటి వాటితో తయారుచేసినదేదో అయ్యేసరికి నోట్లో పెట్టుకోలేక నవ్వుకున్నాం.

భోజనం అయ్యేక ఆవరణలోనే ఉన్న వల ఉయ్యాళ్లలో కాస్సేపు సేద తీరేం.

ఆ తరువాత దగ్గర్లో దిగువనెక్కడో ప్రవహిస్తున్న సన్నని సెలయేటి లోయకి ఇటునుంచి అటుకి కట్టిన తాళ్ల వంతెన చూపించడానికి అందర్నీ పిలుస్తుండంతో అటు వెళ్ళేం.

నేను, సిరి చివర్లో నడవడం మొదలుపెట్టేం. జీవితంలో మొదటిసారి అలా నడవడమేమో భలే భయం వేసింది. వంతెన మధ్యలోకి వెళ్లేసరికి బాగా కదలడం మొదలెట్టేసరికి సిరి భయంతో కూచుండి పోయింది. ఇక నేనైతే ఎటూ వెళ్లలేక అరవడం మొదలుపెట్టేను. అటువైపు నుంచి సత్య

వెనక్కివచ్చి సిరినెత్తుకుని పరుగెత్తుతూ మరింత వేగంగా వంతెనని కదిపేడు. ఇక నా భయం చూడాలి! ఇప్పుడు తల్చుకుంటే నవ్వొస్తోంది గానీ అక్కడ దాటుతున్నంతసేపు బిగ్గరగా ఏదేదో మాట్లాడుతూ, అరుస్తూనే ఉన్నాను. ఎలాగైతేనేం మొత్తానికి మెల్లిగా అడుగులో అడుగేస్తూ వచ్చి బస్సు కదిలే చివరి నిమిషంలో అందులో నుంచి బయటపడ్డాను. అలా అడుగు వేస్తే గాల్లో ఊగే వంతెన మీద నడవడం ఒళ్లు గగుర్పొడిచే గొప్ప అనుభవం!

ఆ తర్వాత ఆరోజు మా యాత్రలో చివరిదైన సెనోట్ దగ్గిర ఆగేం. ఇక్కడ కూడా పార్కింగ్ నుంచి చాలా దూరం లోపలికి వెళ్లాల్సి రావడం, సిరి నడవనని పేచీ పెట్టడంతో ఇక ఆవరణలో ఉన్న ఒకే ఒక్క రిక్షాని నేను, సిరి ఎక్కేం.

అయితే రిక్షా నడపడానికి నలుగురు రావడం ఆశ్చర్యం కలిగించింది. దారిలో బ్రిడ్జిని దాటి, కొండెక్కి వెళ్లాల్సిన మట్టి బాట వెంట దారి పొడవునా చక్రాలు కప్పడే ఇసుక ఉండడంతో అర్థమయ్యింది ఎందుకంత మంది వచ్చారో. ఆ బండికి ఇద్దరు ముందు, ఇద్దరు వెనక సాయం పట్టసాగేరు.

ఎత్తు దారిలో నేను నడుస్తానని చెప్పి కాస్సేపు దిగుతానన్నా వాళ్ళు వినిపించుకోలేదు.

వాళ్ళంతా వచ్చీ రాని ఇంగ్లీషు భాషలో మాట్లాడుతూ సరదాగా తీసుకెళ్ళేరు.

ఈ సెనేట్ పూర్తిగా పై భాగం మూతబడి ఎక్కడో దిగువన గుహాంతర్భాగంలో ఉంది.

సిరి ముందు రాననే సరికి బట్టలు మార్చుకునే వసతి బయటే గుండ్రంగా కట్టి ఉన్న ఆవరణలోఆగిపోయేను నేను.

సిరిని నడిపిస్తూ మెట్లు దిగడం కష్టమని ఆలోచిస్తూ ఉండగా, మా రిక్షా అబ్బాయిల్లో ఒకతను కిందికి పాపను ఎత్తుకుని తీసుకువెళ్లడానికి సాయం చేస్తానని చెప్పడంతో, నేనూ మెట్లు దిగడం మొదలుపెట్టేను.

మెట్లన్నీ దిగగంగానే విశాలంగా ఉన్న గుహాంతర్భాగంలో లైట్ల నడుమ సహజ సిద్ధమైన పెద్ద స్విమ్మింగ్ పూల్ లాగా భలే అందంగా, అత్యద్భుతంగా ఉంది ఈ సెనోట్.

మాతో వచ్చిన అతి తక్కువ మంది మాత్రమే ఉండడంతో చల్లని నీళ్లలో ఈదులాడుతూ గంటసేపు గడపనిచ్చేరు.

సిరితో అంత కిందికి దిగడం, ఎక్కడం కొంచెం కష్టమైనా అక్కడికి వెళ్లకపోయి ఉంటే మంచి అనుభూతిని మిస్సయ్యిపోయేదాన్ని అనిపించింది.

తడితలలతో బయటకు వచ్చేక స్థానిక పెద్దమనిషి ఒకాయనతో వారి సంస్కృతిలో పూజాశీర్వాదాల కార్యక్రమం నిర్వహించేరు. అందుకోసం అందర్నీ గుండ్రంగా నిలబెట్టేరు.

గుగ్గిలం పొగ వేసిన మట్టిదిమ్మె ఒకచేత్తో పట్టుకుని, ఆకులూ, పూలు అర్థచంద్రాకారంలో చుట్టి అలంకరించిన మండపంలో మొక్కజొన్నలు, పళ్ళు, పూలు వేసి స్థానిక మాయా భాషలో మంత్రాలు చదివి అందర్నీ ఆశీర్వదించేడు ఆయన. అలా ప్రత్యక్షంగా వారి భాషని వినగలిగేం. ఆ మొత్తం తతంగమంతా చాలా ఆసక్తికరంగా చూసేరు పిల్లలూ, పెద్దలూ.

అక్కణ్ణించి తిరిగి బస్సు దగ్గిరికి వచ్చేసరికి పొద్దుపోతుండడంతో రిక్షా అబ్బాయిలు సరదాగా పాటందుకున్నారు. సిరి అందుకు సరిపడా గొంతు కలపడం మొదలెట్టింది. భలే సంతోషం వేసింది.

దిగుతూనే రిక్షా బాడుగ కాకుండా అందరికీ తలా పది డాలర్లు ఇచ్చేను.

ఆ రోజుకి ఆ పార్కులో మేమే చివరి బాచ్ కావడంతో అందరూ తలా సైకిలు వేసుకుని మా బస్సు ముందే బయల్దేరేరు. కానీ అందరికీ నాయకుడిలా ఉన్నతను మాత్రం మా బస్సు పక్కనే ఆగున్న కారు తీసి రయ్యిన వెళ్లిపోయేడు.

ఇక అక్కడ ఫొటోలు, వీడియోలు వాళ్లే తీసి అవన్నీ పెన్ డ్రైవ్‌లో పెట్టి ఇవ్వడానికి యాభై డాలర్లకి ఇస్తుంటే మేమూ మావి తీసుకున్నాం. అయితే తీరా అమెరికా తిరిగి వచ్చేసరికి ఆ పెన్ డ్రైవ్ కనబడలేదు. అయితే వాళ్ల వెబ్సైటులో ముప్ఫై రోజుల వరకు భద్రపరుస్తామని వారు చెప్పడం గుర్తురావడంతో కాంటాక్ట్ చేసి ఫొటోలన్నీ డౌన్లోడ్ చేసుకోగలిగేం.

తిరిగి మా రిసార్టుకి చేరుకునేసరికి ఆరేడు గంటల ప్రాంతమయ్యింది.

అప్పటివరకు చూసిన అన్నిటికంటే ఆ రోజు చూసిన తులం, కోబా శిథిలాలు, మాయ గ్రామం, ప్రజలు, వారి ఆచారవ్యవహారాలు ప్రత్యక్షంగా చూసిన అనుభూతి ఎప్పటికీ పదిలంగా హృదయంలో ముద్రపడిపోయింది.

*(ఇంకా ఉంది)*

♦ ♦ ♦

# భాగం-13

# కాన్ కూన్ (సిటీ టూర్- మార్కెట్-28)

-డా.ఎకె.గీత

ఇక మా తిరుగు ప్రయాణం రెండు రోజుల్లోకి వచ్చేసింది. మర్నాడు కాన్ కూన్‌లో అప్పటివరకూ సిటీ టూర్ చెయ్యలేదు మేం. అంతే కాదు, అప్పటివరకూ టాక్సీల్లో, టూరు బస్సుల్లోనే తిరిగేం కానీ పబ్లిక్ ట్రాన్స్ పోర్ట్ ఎలా ఉంటుందో చూడలేదు. కానీ పిల్లలతో బస్సుల్లో తిరగడం జరిగే పని కాదు కాబట్టి పిల్లలిద్దరినీ రూములోనే వదిలేసి మేమిద్దరమే బయలుదేరుదామని అనుకున్నాం.

ముందు సత్య వెళ్లాలనుకున్న జెట్ ప్యాక్ రైడ్ కి, ఆ తర్వాత కాన్ కూన్ డౌన్ టౌన్‌లోలోకల్ వస్తువులు అమ్మే మార్కెట్-28 చూడడానికి నిశ్చయించుకున్నాం.

పొద్దున్నే హడావిడి లేకుండా కాస్త స్థిమితంగా లేచి పదిగంటల వేళప్పుడు హొటలు బయటికొచ్చి రోడ్డు మీద కనబడ్డ మొదటి బస్సు ఎక్కేసేం. మేమున్న హొటలు జోన్ నించి ఎడమ వైపుకి వెళ్లే ప్రతి బస్సు జెట్ ప్యాక్ రైడ్ టిక్కెట్లు అమ్మే లాఇస్లా (Laisla) కాంప్లెక్సుకు, కుడి వైపుకి వెళ్లే ప్రతి బస్సు మార్కెట్-28కు వెళ్తాయని మా రిసార్టు కౌంటర్లో చెప్పేరు. ఇక బస్సుల్లో ఎక్కి దిగడానికి అక్కడిలోకల్ కరెన్సీ "పేసో"లు అవసరం కాబట్టి రిసార్టు లోనే ఎటిఎం నుంచి వంద డాలర్లు పెట్టి రెండువేల పేసోలు తీసుకున్నాం.

బస్సు ఎక్కగానే లోపల నీలం, పసుపు పచ్చ రంగు సీట్లు చూడగానే నాకు ఏదో మనవైపు బస్సెక్కినట్లు అనిపించి తెలీని ఆనందం కలిగింది. బస్సులు రద్దీగా లేవు. నిలబడి ప్రయాణం చెయ్యడాలు అసలే లేవు. అయిదునిమిషాలకో బస్సు ఉండడం వల్ల సీట్లు బానే దొరుకుతున్నాయి. నిజానికి అక్కడి ప్రాంతీయ జనాన్ని చూడడానికి అదే మంచి అవకాశమని అర్థమయ్యింది. అంతే కాకుండా మేమున్న హొటల్ జోన్ నించి డౌన్ టౌన్‌కి ఒకవైపు టిక్కట్ మనిషికి ఎనిమిదిన్నర పేసోలు. అంటే టాక్సీతో పోలిస్తే పదో వంతు.

ముందు సత్య వెళ్లాలనుకున్న జెట్ ప్యాక్ రైడ్ కోసం లాఇస్లా (Laisla) కాంప్లెక్సుకి వెళ్ళేం. మా హొటలు నుంచి పది నిమిషాల వ్యవధిలో ఉందది. అది కొత్తగా కట్టిన పెద్ద మాల్ వంటిది.

కానీ ఉదయం కావడంవల్లనో ఏమో జనం లేరు. అయితే సత్యకి కావలసిన జెట్ ప్యాక్ రైడ్‌కి అవేళ్టికి టిక్కెట్లు లేకపోవడంతో వెనుతిరిగేం.

ఇక తిన్నగా మార్కెట్-28 బస్సెక్కేం. మాలాగా వచ్చిన టూరిస్టులు చాలామంది డౌన్ టౌన్ ప్రధాన స్టాపుల్లో పెద్ద షాపింగ్ మాళ్లు, సినిమా థియేటర్లు, మ్యూజియమ్స్, గేమ్స్ సెంటర్ల దగ్గర దిగిపోవడంతో బస్సు దాదాపు పూర్తిగా ఖాళీ అయిపోయింది.

దాదాపు అరగంట ప్రయాణం తర్వాత మార్కెట్-28 లోని మొదటి దుకాణం ప్లాజా-28 దగ్గిర దిగేం. ఈ ప్లాజా వల్లే ఈ మార్కెట్‌కు మార్కెట్-28 పేరు వచ్చింది. అక్కడి నుంచి దాదాపు మైలు దూరంలో చతురస్రంగా విస్తరించి ఉన్న ఒక్కోదుకాణం చూసుకుంటూ కాలినడకన వెళ్లి తిరిగి ఇక్కడికే వచ్చి బస్సు ఎక్కాలని అనుకున్నాం.

కాన్ కూన్ లోని హొటల్ జోన్ లోని లగ్జరీ సిటీ ప్రాంతానికి ఈ మార్కెట్‌కు సంబంధమే లేదు. ఇక్కడే అసలు సిసలు జీవితాలున్నాయి.

ప్లాజా-28 గులాబీ రంగు గోడలతో ఉన్న దుకాణ సముదాయం. మొదటి దుకాణం దగ్గరనించి స్థానిక మద్యం "టకీలా" అమ్మే దుకాణదారులు సత్యని లోపలికి రమ్మని పిలుస్తూ ఉండడం చూసి తను అటువైపు నడుస్తున్నవాడు కాస్తా నాకు ఇటుపక్కకి వచ్చి నడవడం మొదలు పెట్టేడు. అది చూసి నాకు నవ్వాగలేదు.

దారిపొడవునా మాయా సంస్కృతి ప్రతిబింబించే సాంప్రదాయ దుస్తులు, పూసలు, రాళ్ల నగలు దగ్గరనించి రంగురంగుల సిరామిక్ కపాలాల వరకు అనేక వస్తువుల్ని అమ్మే చిన్నచిన్న దుకాణాలు.

నా వరకు నాకు "మన" అనిపించే మనుషుల్లోకి వచ్చిపడిన అద్వితీయానందం కలిగింది.

ఇక్కడి స్థానిక వస్తువులని కొని కుటీర పరిశ్రమల్ని నిలబెట్టమని దారిపొడవునా దుకాణాల వాళ్లు అడగసాగేరు. కానీ ఒకేలాంటి వస్తువులు చిన్న దుకాణాల్లో ఎక్కువ ధరకి, పెద్ద దుకాణాల్లోతక్కువ ధరకి అమ్ముతున్నారు చిత్రంగా. ఇటువంటి ప్రతీ చోటా ఉన్నట్లే ఇక్కడకూడా ఒకేలా కనిపించే వస్తువుల నాణ్యతలో కూడా తేడాలున్నాయి.

ఎక్కడికి వెళ్లినా అరచేతిలో ఇమిడే చిన్న వస్తువులు మా అద్దాల షోకేసులోకి కొనడం అలవాటు నాకు. అందుకోసం అక్కడే తయారు చేస్తున్న చిన్న చిన్న చెక్క స్ప్రింగ్ బొమ్మలు కొన్ని కొన్నాను.

దారిపొడవునా ట్రంపు గురించిన బూతు తిట్లతో ముద్రించిన టీ-షర్టులు అమ్మడం చూసేం.

ఒకరిద్దరు మేం అమెరికా నుంచి వచ్చేమని తెలిసి మరీ అధ్యక్షుడు ట్రంపుని బూతులు తిట్టేరు. అమెరికాలో అధికారిక నామపత్రాలు లేకుండా నివసిస్తున్న మెక్సికన్ల పట్ల వహిస్తున్న కఠిన వైఖరి, దేశాల మధ్య అక్రమ వలసల్ని అరికట్టేందుకు గోడ కట్టాలన్న ప్రతిపాదనలే అందుక్కారణమని ముందురోజు మా టూరు గైడు చెప్పిన మాటలు జ్ఞాపకం వచ్చేయి.

ఇక కీ చెయిన్లు, స్థానిక స్వెట్టర్లు, టోపీలు, మట్టి బొమ్మలు వంటివి అంతకు ముందే టూర్లలో కొన్ని కొన్నాం. ఇక ఆ దుకాణాల దగ్గిర ఆగకుండా ముందుకు నడిచేం.

దాదాపు మైలు దూరం నడిచేక చివరిగా ఉన్న స్వీట్లు అమ్మే దుకాణాల్లో అద్దాలలో ఉన్న మంచి దుకాణానికి వెళ్లి పది డాలర్లకు ఒక ప్యాకెట్టు చొప్పున అరడజను ప్యాకెట్లు కొన్నాం. మన పాలకోవా బిళ్లల్లాంటివి కొన్ని, చింతపండుతో తయారుచేసినవి కొన్ని కొన్నాం. నిజానికి పెట్టిన డబ్బులకి సరితూగేవి కావవి. అయినా ఆఫీసుల్లో పంచడానికి తప్పనిసరిగా తీసుకున్నాం.

వచ్చే దార్లో అరటి పళ్లు, నారింజలు వంటివే కాక అరచేయంత పెద్ద సపోటాలు, (Pitaya) పిటాయాలనబడే బొమ్మజెముడు పళ్లు వంటి స్థానిక వెరైటీలు కూడా చూసేం. పళ్ల దుకాణాల ఒక చిన్న బండి మీద ఏవో కాశీ రేగుపళ్ళ కంటే కొంచెం పెద్దవైన కాయలు ఉప్పూ, కారం, నిమ్మరసం పెట్టి అమ్ముతుంటే ఒక కాయ తినిచూసి, బావుండడంతో పది పేసోలకి ఎనిమిది కాయలున్న ఒక చిన్న సంచీడు కొనుక్కుని దారి పొడుగునా నడుస్తూ తిన్నాం. మధ్యలో పెద్ద గింజతో మామిడి, పీచ్ కలిపిన రుచితో ఒకరకమైన పండు అది. మేం నవంబరులో వెళ్లిన సీజనులో దొరికే ఈ పండు పేరు మెక్సికన్ ప్లమ్. స్థానికభాషలో దీనిని సెరులా (Ciruela) అని పిలుస్తారు.

షాపుల్లో ఎక్కడైనా పేసోలే కంటే డాలర్లు తీసుకోవడానికే ఉత్సాహపడసాగినా మేం మా దగ్గిర పేసోల్ని ఖర్చు చెయ్యడం కోసం వాటినే వాడేం. దారిలో వంద పేసోలు పెట్టి మూడు విసనకర్రలు కొన్నాను. దాదాపు నాలుగు దుకాణాల్లో బేరమాడి చివరికి ఒక దుకాణంలో ఆరు వందల పేసోలకు ఒక దుప్పటి కొన్నాను. చిచెన్ ఇట్జా వంటి స్థానిక చిత్రాలతో అల్లిన చేనేత దుప్పటీ అది. ఒక విధమైన ఎరుపు, నారింజ, పసుపు దారాలతో అల్లిన ఆ దుప్పటీ నాకెంతో నచ్చింది.

ఇక అప్పటికే పన్నెండు కావస్తుండడంతో భోజనాల సమయానికి రిసార్టుకు చేరుకోవడానికి వెనక్కి తిరిగొచ్చి మేం బస్సు దిగిన ప్లాజా-28 దగ్గిరే పది నిమిషాలు నిలబడ్డాక అర్థమైన విషయం ఏవిటంటే అది ఒన్ వే అని.

నాకు వచ్చీ రాని స్పానిషు భాషలో దుకాణాదారుల్ని అడుగుతూ ముందుకు నడిచి మొత్తానికి

ఆ పెద్ద సర్కిల్‌లో మరో వైపున ఉన్న పెద్ద మార్ట్ దగ్గిర బస్సెక్కడానికి పరుగెత్తేం. వచ్చిన ప్రతీ బస్సుని అడుగుతూ ఉండగా ఒక బస్సతను అక్కడ మా హెూటల్ జోన్ బస్సులు ఆగవని మరికాస్త ముందుకు నడవమని చెప్పేడు. ఇంకాస్త నడిచి మొత్తానికి మరో అరగంటలో బస్సు పట్టుకున్నాం.

సత్య అప్పటికే ఊబర్ వంటివేవైనా దొరుకుతాయేమోనని సెల్ ఫోనులో ఎంతో ప్రయత్నం చేసేడు. తెలీని ప్రదేశంలో బస్సులు ఎక్కే ముందు రూట్లు సరిగా చూసుకోవాలని అప్పుడు గ్రహించేం. హెూటల్ జోన్ నించి వెళ్లే ప్రతి బస్సు డౌన్ టౌన్ మీంచి వెళ్తుంది కానీ డౌన్ టౌన్ దాటి వచ్చేక మార్కెట్ -28 నుంచి వెనక్కి వెళ్లే ప్రతి బస్సు హెూటల్ జోన్‌కి మాత్రమే వెళ్లదు.

ఇప్పుడు తల్చుకుంటే నవ్వు వస్తుంది కానీ, అప్పుడు అసలే పిల్లల్ని హెూటల్‌లో వదిలి వచ్చేమని భలే గాభరాగా అనిపించింది. ఏ నంబరు బస్సెక్కితే ఎటెళ్తామో తెలియదు. మొత్తానికి బస్సెక్కి ఒంటి గంటకల్లా ఆదరాబాదరా రిసార్టుకి చేరుకునేసరికి పిల్లలిద్దరూ చక్కగా స్నానాలు చేసి రెడీ అయ్యి, హాయిగా టీవీ చూసుకుంటున్నారు.

*(ఇంకా ఉంది)*

♦ ♦ ♦

# కాన్ కూన్ ( చివరి భాగం)

-డా.ఎకె.గీత

మర్నాడే మా తిరుగు ప్రయాణం. ఆ రోజుతో కాన్ కూన్‌లో చూడవలసిన ప్రదేశాలు చూడడం, చెయ్యవలసిన ఎడ్వెంచర్ టూర్లు చెయ్యడం, అన్నీ అనుకున్నట్టుగా అయ్యేయి.

అంత వరకు బయట అన్నీ చూసేం గానీ మా రిసార్టులో విశేషాలు ఏవీ చూడలేదు.

కాబట్టి ఆరోజు అందుకోసం కేటాయించేం. అంతే కాదు సముద్ర తీరంలోనే ఉన్నా ఇసుకలో అడుగులు మోపి నాలుగడుగులు కూడా వెయ్యలేదు.

ఇంకేం పొద్దున్నే సత్య, నేను తెలతెలవారకుండానే సముద్ర తీర వ్యాహ్యాళికి బయలుదేరేం.

రిసార్టు నుంచి ఎడమకు, తిరిగొచ్చి మళ్లీ కుడికి నడక సాగించేం.

ఉదయం గోరు వెచ్చగా అత్యంత ఆహ్లాదంగా ఉంది. ఇంటి దగ్గిర ప్రతిరోజూ ఇద్దరం కలిసి వాకింగ్‌కి వెళ్తుంటాం.

అయినా ఆ ఉదయం గొప్ప ప్రత్యేకతను సంచరించుకుంది. తూర్పున కిరణాలు విచ్చుకోకముందు మబ్బు పట్టిన ఆకాశంలా మసకమసక వెలుతురు నాకెంతో ఇష్టం. పైగా స్వచ్ఛమైన ఉదయరాగాలు ఆలకించడానికన్నట్లు ఆకాశానికి ఎగిసి పడ్తున్న సముద్రకెరటాలు, తీరాన పాదాల వెంటబడుతున్న పాలనురుగు. తెల్లని ఇసుకలో ఇద్దరి పాదాల్ని పక్కపక్కన ముద్రలేసుకుని మురిసిపోతూ, దార్లో ఆగి ఎవరో కట్టిన ఇసుక గూడుకి మా వంతుగా చిన్న ఇసుక గోపురాన్ని అతికిస్తూ, ఎప్పటెప్పటివో కబుర్లన్నీ కలబోసుకుంటూ వెలుగురేఖలు విచ్చుకుని భానుకిరణాలు తళతళా మెరిసే వరకూ నడుస్తూనే ఉన్నాం.

రిసార్టు నుంచి ఎడమకు ఉన్న మరో రిసార్టు దగ్గిర బీచి మొత్తం ఊర్లో ఉన్న ట్రాక్టర్ వంటి ట్రాక్టర్‌తో చదును చేయసాగేరు. అమెరికాలో ఇటువంటిదెప్పుడూ చూడక అతనితో మాట్లాడి రెండు మూడు ఫోటోలు తీసుకున్నాను. ఇలా రిసార్టు బీచి ఒడ్డున ప్రతీ రోజూ చదును చేస్తూ, పెళ్లిళ్లు మొదలైన పార్టీలకు, ముందుగా బుక్ చేసుకున్న బీచి పార్టీలకు ఏర్పాట్లు చేస్తారని చెప్పేడతను.

తిరిగి రూముకి వచ్చి పిల్లలని లేపి తయారుచేసి బ్రేక్ ఫాస్టు కాగానే ముందురోజే బుక్ చేసుకున్న ఫోటో షూట్ కోసం రిసార్టులోనే ఉన్న ఫోటో స్టూడియోకి వెళ్ళేం.

ఇక్కడ రిసార్టు పాయింట్ల గురించి కొంచెం చెప్పాలి. రిసార్టులో బస చేసినందుకు గాను కొన్ని ఉచిత పాయింట్లు ఇస్తారు. వాటిని రిసార్టులో ఉన్న గిఫ్ట్ స్టోర్స్, ఫోటో స్టూడియో, మసాజ్ సెంటర్ల వంటి చోట్ల రేట్లలో తగ్గింపు కోసం వాడుకోవచ్చు. అయితే ప్రతీచోటా కొన్ని నియమిత పాయింట్లు మాత్రమే వాడుకోవడానికి ఉంటాయి. ఎక్కడ ఎన్ని పాయింట్లు ఉంటాయో వివరంగా ముద్రించిన కార్డు ఒకటి ఇస్తారు.

అప్పటికే నేను దాదాపు కొన్ని చోట్ల పాయింట్లు డిస్కౌంట్ ఉపయోగించేను.

ఇక ఆ రోజు ఆ లిస్టులో ఉన్నవి గిఫ్ట్ స్టోర్స్, ఫోటో స్టూడియో.

అమెరికాలో బయటికెళ్లి ఫామిలీ ఫోటోలు ప్రత్యేకంగా తీయుంచుకోవడం ఒక లగ్జరీ.

మాకున్న పాయింట్లతో ఉచితంగా ఫోటోలు తీస్తారు కానీ ప్రతీ ఒక్క ఫోటోని కొనుక్కోవాలి.

సరే అప్పటికే ప్రత్యేకమైన దుస్తులేసుకుని సరదాగా తయారయ్యిన మాకు మిగతా వివరాలకంటే ఫోటోలు తీయుంచుకునే ఉత్సాహం ఎక్కువైపోయింది.

దాదాపు గంటన్నర పాటు రిసార్టులో అందమైన స్పాట్లలో, సముద్రతీరంలో మాకునచ్చినట్లు ఆడుకుంటూ ఉండమని రకరకాల ఫోటోలు తీసేడతను. అవెంత బావున్నాయంటే ఒక్క ఫోటోకూడావదలాలని అనిపించలేదు. మొత్తం నూటపది ఫోటోలు, డిజిటల్ కాపీలుగా మాత్రమే తీసుకున్నా వెయ్యి డాలర్లు బిల్లు కట్టాల్సి వచ్చింది. అయితేనేం డబ్బులతో వెలకట్టలేనివి జీవితంలో అందమైన జ్ఞాపకాలు.

ఇక గిఫ్ట్ స్టోర్‌లో కొన్ని ఉచిత పాయింట్లకి ఒక వెండి బ్రేస్లెట్ తీసుకుని, మిగిలిన డిస్కౌంట్ పాయింట్లతో బాటూ మరొక రెండువందల డాలర్లు పెట్టి మెక్సికో జెమ్ స్టోన్ ఫాషన్ జ్యూయలరీ సెట్టు కొనుక్కున్నాను. నిజానికి ఈ పాయింట్లన్నీ మనుషుల్ని ఆయా చోట్లకి రప్పించడానికేనని తెలిసినా కొత్త చోట్లకి వెళ్ళినపుడు అన్ని విశేషాలూ చూసి రావాలని, వివరాలు తెలుసుకోవాలని ఉత్సుకతతో వెళ్లొచ్చేను. పిల్లలకు కూడా వాళ్లకి నచ్చిన టోపీలు, టీ షర్టుల వంటివి కొనిపెట్టేసరికి వాళ్ల ఆనందానికి అంతు లేకుండా పోయింది. గదిలో పరుగులెడుతూ గంతులేయడం మొదలుపెట్టేరు. చిన్న పిల్లల్లా ప్రపంచంలో అందరూ అల్పసంతోషులుగా ఉంటే ఎంత హాయిగా ఉంటుందో కదా అనిపించింది.

మధ్యాహ్నమంతా పదిహేనంతస్తుల ఆ రిసార్టులో అన్ని ఫ్లోర్లు తిరిగి, విశేషాలన్నీ చూసి వచ్చి, సాయంత్రం ఆవరణలోనే ఉన్న ఇన్ఫినిట్ స్విమ్మింగ్ పూల్‌కి వెళ్లి ఈతలు కొడుతూ సరదాగా గడిపేం.

చీకటి పడ్డాక బాల్కనీలో కొచ్చి కూచున్నాం. ఎదురుగా సాగరతీరాన దేదీప్యమానంగా వెలుగుతున్న కార్తీక పౌర్ణమి చంద్రుడు కెరటాల మీద నుంచి వెన్నెల రాశులు పోసుకుంటూ ఆకాశంలోకి ఎగిసినట్లు అత్యద్భుతమైన దృశ్యం. పగటి అలసటని పోగొట్టడానికన్నట్లు సుతారంగా మేను తాకే నునువెచ్చని సముద్రపు గాలి. పగలల్లా అలిసిపోయిన పిల్లలు ఒళ్లోనే నిద్రపోయేరు. ఆకాశాన్ని, సాగరాన్ని తనివితీరా కళ్ల నింపుకుంటూ మేమిద్దరం ఎంతో సేపు కబుర్లు చెప్పుకుంటూనే ఉన్నాం.

ఇటీవల వెళ్లిన అన్ని టూర్లలో అత్యంత హాయి గొల్పిన అందమైన ప్రయాణం ఇది. అక్కడినుండి మర్నాడే బయలుదేరి వచ్చేసినా మనసుని తన దగ్గరే కట్టివేసి, భద్రపరుచుకుని మా కోసం ఎప్పటికీ ఎదురుచూస్తున్నట్లు అనిపించిన అందమైన విడిది కాన్ కూన్.

♦ ♦ ♦

# భాగం-11

# కాన్ కూన్ -తులుమ్- కోబా-సెనోట్- మాయా విలేజ్-3

*-డా॥కె.గీత*

తులుమ్- కోబా-సెనోట్- మాయా విలేజ్ డేటూరులో తులుమ్ శిథిలనగర సందర్శనం తర్వాత రెండవ ప్రదేశం "కోబా"శిథిల నగరం. ఇది తులుమ్ నగరానికి పూర్తిగా విభిన్నమైనది.

క్రీ.శ 600 నుండి క్రీ.శ 900 మధ్యలోతులుమ్ నగరానికి దాదాపు 30 మైళ్ల దూరంలో దట్టమైన చెట్ల నడుమ మాయా సంస్కృతికి చెందిన గొప్ప నగరం ఇది.

ఒకప్పుడు వంద మైళ్ల విస్తీర్ణంలో విలసిల్లిన ఈ నగరంలో దాదాపు యాభై వేల మంది నివసించేవారట.

ఇప్పటికీ ఇదే పేరుతో దగ్గర్లో ఉన్ననగరంలో కేవలం పదమూడు వందల మంది మాత్రమే నివసిస్తున్నారు.

స్పానిషు దురాక్రమణల వల్ల కనుమరుగై పోయిన సంస్కృతిలో మిగిలిన శిథిలాలు మూగ సాక్ష్యాలుగా ఇక్కడ దర్శనమిస్తాయి.

కోబా నగరం కోబా సరస్సు ( Lake Coba), మెకానోక్ సరస్సు (Lake Macanxoc)ల మధ్య ఉన్న సారవంతమైన భూభాగంలో నిర్మితమైంది.

ఈ యూకతాన్ ద్వీపకల్పంలో ప్రతీ చోటా కనబడే సున్నపురాతితోనే ఇక్కడ కూడా ఇళ్లతో మొదలుకుని అతిపెద్ద దేవాలయాల వరకు నిర్మించబడ్డాయి.

ఈ శిథిల నగరాన్ని పరిరక్షించడం కోసం ఇప్పుడు ఈ ప్రాంతాన్నంతా రక్షిత ప్రాచీన సంస్కృతీ కేంద్రంగా గుర్తించారు.

టూరిస్టుబస్సులు, వాహనాలు దాదాపు రెండు, మూడు మైళ్ల అవతలే ఆపి, శిథిల నగరం మొత్తం కాలినడకన కానీ అద్దెకు తీసుకున్న సైకిళ్ల మీద గానీ తిరగాల్సిందే. బహుకొద్ది సంఖ్యలో రిక్షాలు ఉన్నాయి.

సైకిళ్లకు లాగానే రిక్షాకు కూడా టిక్కెట్టు తీసుకోవడమే. ఒక సైకిలుకి 60 పేసోలు, రిక్షాకు

100 పేసోలు అద్దె. అంటే అమెరికన్ డాలర్లలో దాదాపు 3 డాలర్లు, 5 డాలర్లన్న మాట. అందులో పార్కు నిర్వాహకులకు కొంత, రిక్షాల ఓనర్లకు కొంత భాగం పోగా, రిక్షాలు తొక్కే సామాన్యులకు మిగిలేది అతి కొద్ది భాగం మాత్రమే.

అదృష్టం కొద్దీ మేం అడుగుపెట్టిన సమయానికి ఒకేఒక్క రిక్షా ఉందక్కడ. నేను బేరం కూడా ఆడకుండా సిరిని తీసుకుని వెళ్లి, ఎక్కి కూచున్నాను.

సత్య, వరు చెరో సైకిలు అద్దెకు తీసుకున్నారు.

ఇక్కడి రిక్షాలో మనుషులు కూచునే సీటు వీపు వెనక వైపు తొక్కే మనిషి ఉండడంతో ముందుకు ఎక్కడ పడతామో అనిపిస్తూ ఉంటుంది.

సిరి ముందు కూచోనని పేచీ పెట్టినా రెండు నిమిషాల్లో "హుర్రే" అని సరదాగా చుట్టూ చూడసాగింది.

కొద్దో గొప్పో ఇంగ్లీషు, స్పానిషు కలిపి మాట్లాడుతున్న రిక్షా అబ్బాయి మాయా సంతతికి చెందిన వాడినని చెప్పటంతో నేను అతనితో ఉత్సాహంగా కబుర్లలో పడ్డాను.

అట్టే ఎత్తులేని పొట్టి సరుగుడు చెట్ల లాంటి చెట్లు, బాట కిరుపక్కల దట్టంగా అల్లుకున్న తీగలతో పెద్ద పెద్ద ఆకుల మొక్కల మధ్య సన్నని మట్టి దారిలో దాదాపు అరగంట పాటు ప్రయాణంలో ముఖ్యమైన కట్టడాల దగ్గిర దిగుతూ, మళ్లీ ఎక్కుతూ ప్రధాన కట్టడమైన లొమాహా (Ixmoja) దేవాలయానికి చేరుకునేలోగా దారిలో ఆకులతో బూరలు తయారుచేసే మొక్క నుంచి, గాయాలకు ఔషధంగా ఉపయోగించే మొక్క వరకు అనేక విశేషాలు చెప్పేడతను. బహుశా: పాతికేళ్ళు ఉంటాయేమో. అక్కడ ఉన్న స్థానికులందరిలాగానే అతనికి కూడా టూరిజమే ప్రధాన జీవనోపాధి. అతని తాత ముత్తాతలందరూ చిన్న చిన్న కమతాల మొక్కజొన్నపంటలతోను, అటవీ సంపదతోనూ జీవనాన్ని సాగించేవారని, నాగరిక ప్రపంచానికి దూరంగా అతని పూర్వీకులు నివసించిన చోటే ఇలా జీవించడంలో ఎంతో ఆనందం ఉందనీ చెప్తున్న ఆ యువకుణ్ణి అభినందించాల్సిందే. ఇతనిలా ఎందరు ఆలోచిస్తున్నారు అనిపించింది.

రిక్షాని కావలసిన చోటల్లా ఆపుతూ, నేను అటూ ఇటూ చూడడానికి వెళ్లినపుడల్లా సిరిని కనిపెట్టుకుని జాగ్రత్తగా చూసుకున్న అతనికి దిగేటప్పుడు 20 డాలర్లు ఇచ్చేను.

అతని ఆనందానికి అవధులు లేవు. వారమంతా పనిచేసినా ఇంత రాదని అతను ఎంతో సంతోషించేడు.

మాతో వెనకే వస్తున్న సత్య, వరు మాతోబాటూ ఆగుతూ వచ్చేరు.

దారంతా సిరి "డాడీ! కమాన్, క్విక్" అంటూ వెనక్కి చూస్తూ హుషారుగా నవ్వుతూ అరుస్తూనే ఉంది.

దారిలో చిన్నవీ, పెద్దవీ ఎత్తున నలుచదరంగా కట్టిన అనేక కట్టడాలున్నాయి.

కొన్ని సమావేశస్థలాలు, కొన్ని దేవాలయాలు, కొన్ని సామూహిక నివాసస్థలాలు.

చిట్ట చివరిదైన లొమాహా దేవాలయానికి చేరుకునే సరికి ఆశ్చర్యంతో మతిపోయింది. ఆ కట్టడం ఇప్పటివరకు చూసిన అన్ని కట్టడాల కంటే, చిచెన్ ఇట్జా కంటే అత్యంత ఎత్తైనది. అంత గొప్ప ఎత్తైన కట్టడాన్ని ఇటీవల ఎక్కడా చూసినట్టు జ్ఞాపకం లేదు.

నలుచదరాకారంలో రాళ్ళు పేర్చుకుంటూ వెళ్లి పోయారు. క్రింద అతిపెద్ద చదరం నుంచి పైకి వెళ్ళే కొలదీ చిన్న చదరంగా ఆకాశంలోకి విస్తరించిన ఆ కట్టడాన్ని కన్నార్పకుండా చూస్తూ ఉండిపోయేను.

అన్ని ఇతర చోట్లలా కాకుండా దీనిమీదికి అధిరోహించనివ్వడం విశేషం. అయితే మోకాలి పర్వతంలా ఒక్కో మెట్టుకి, మెట్టుకీ మధ్య ఎత్తు చాలా ఉండడంతోను, మధ్య మధ్య విరిగిపోయిన రాతి ముక్కలతో జారుతూ ఉండడం వల్ల పై నుంచి కింద వరకూ వేళ్ళాడుతున్న తాళ్ల సహాయంతో పైకి ఎక్కాలి.

సత్య, వరు చకచకా ఎక్కేసినా, సిరితో కష్టమని నేను పదో మెట్టు లోనే ఆగిపోయేను.

అంత ఎత్తులో కట్టిన ఆ దేవాలయానికి అర్థం ఏవిటో పైకెక్కి తెలుసుకోవాలని ఎంతో ఉత్సాహంగా అనిపించినా, రాళ్ల మధ్య మెట్ల మీద దెబ్బలు తగిలించుకుంటూ కిందికి వస్తున్న తోటి సందర్శకులని చూసి విరమించుకున్నాను.

దాదాపు వంద మంది ఔత్సాహికులు పైకెక్క సాగేరు.

కిందన కబుర్లు చెప్పుకుంటున్న పది మంది రిక్షాల వాళ్లు, మా లాగే ఎక్కలేని ఐదారుగురు తప్ప ఎవరూ లేరు.

మంచి ఎండ సమయంలో ఆ కట్టడం పైకెక్కి కిందకి దిగడానికి గంట పైనే పడుతూ ఉంది.

*(ఇంకా ఉంది)*

♦ ♦ ♦

# ఎన్సినాదా (మెక్సికో

# నా కళ్లతో అమెరికా-64 ( మెక్సికో నౌకా యానం- భాగం-1)

అమెరికాలో ఇప్పటి వరకు మేం కార్లలోనూ, విమానాల్లోనూ తిరిగే టూర్లకే వెళ్ళేం. కానీ జల యాత్ర చెయ్యలేదు. అంటే చిన్న బోట్లలోనో, పడవల్లోనో ఆ రేవు నించి ఈ రేవు వరకూ ఎక్కి దిగడం కాదు. సముద్రం మీద రోజుల పాటు ప్రయాణం చేసే నౌక యాత్ర. గాంధీ ఆత్మకథలో ఆయన మూడేసి నెలలు నౌక యానం చేసిన సందర్భాలు చదివినప్పుడల్లా, నౌకా యాత్ర ఎలా ఉంటుందోననే కుతూహలం కలుగుతూ ఉండేది.

అమెరికాలో పాపులర్ టూర్లలో క్రూయిజ్ టూర్ ఒకటి. ఇది కోట్లలో వ్యాపారం. కార్నివాల్, డిస్నీ మొ.న ప్రతిష్టాత్మకమైన క్రూయిజ్ కంపెనీలు దాదాపు పది అంతస్థుల అపార్టుమెంట్లంత అతి పెద్ద నౌకలమీద విహార యాత్రలు నిర్వహిస్తూ ఉంటాయి.

ఆసక్తి ఉన్నా, క్రూయిజ్ అంటే నాకు ఒక విధంగా భయం. ఇంతకు ముందు ఒకట్రెండు సార్లు సముద్రంలోకి అరగంట, గంట టూర్లకి వెళ్ళిన ప్రతీ సారీ విపరీతమైన సిక్ నెస్‌కి లోనయ్యి, వాంతులు పట్టుకున్నాయి. ఆ భయంతో ఇక సముద్రంలోకి వెళ్లకూడదని నిర్ణయించుకున్నాను. పెద్ద షిప్పులలో అలాంటి సిక్ నెస్ ఉండదని సత్య నాకు ఎంత నచ్చజెప్పినా ససేమిరా అనేదాన్ని.

అయితే సత్యకి, పిల్లలకి ఎన్నాళ్ళుగానో క్రూయిజ్‌కి వెళ్లాలని బాగా సరదా ఉండడంతో ఈ మధ్య సెలవులు వచ్చినపుడల్లా ఎక్కడికి వెళ్దాం? అనగానే క్రూయిజ్ అనడం మొదలు పెట్టేరు. దాంతో ఒక్క సారి వెళ్లి చూద్దామని నిర్ణయించుకున్నాను. జూన్, జూలై నెలలు వేసవి సెలవులు ఇక్కడ. ఏప్రిల్ లోనే పేచీ మొదలెట్టేరు. ఇక్కడ మామూలుగానే క్రూయిజ్ లకు గిరాకీ ఎక్కువ. చలికాలంలో అన్ని క్రూయిజ్ లూ తిరగవు. ఇక వేసవి సెలవుల్లో డిమాండ్ విపరీతం. ఏప్రిల్ లోనే టిక్కెట్ల కోసం ప్రయత్నించినా మాకు జూన్, జూలైలలో ఎక్కడా బుకింగు దొరకలేదు. చివరికి వెతగ్గా వెతగ్గా మొత్తానికి ఆగస్టు నెల మొదటి వారంలో దొరికాయి. ఎలాగూ ఆగస్టు రెండవ వారంలో స్కూలు తెరుస్తారు కాబట్టి ఫర్వాలేదనుకుని బుక్ చేసుకున్నాం. క్రూయిజ్ బుకింగుకి కాస్ట్ కో ఇతరత్రా మధ్యవర్తిత్వపు సైట్లలో కంటే తిన్నగా క్రూయిజ్ సైటులో బుక్ చేసుకుంటేనే చవక, పైగా మనకి కావలసిన ఫెసిలిటీలు కూడా దొరుకుతాయి. ఆలా మాకు సముద్రం కనిపించే కిటికీ ఉన్న గది కేవలం క్రూయిజ్ సైటు లోనే దొరికింది. ఇక టిక్కెట్లలో అతి తక్కువ నించి అత్యంత ఖరీదు వరకూ విభాగాలుంటాయి. అత్యంత ఖరీదైన గదులకు పర్సనల్ బాల్కనీ వంటి

సదుపాయాలే కాకుండా, వాళ్లకు మాత్రమే అందుబాటులో ఉండే విభాగాలు కూడా ఉంటాయి. మేం ఎకానమీ ప్యాకేజీ తీసుకున్నా ఉన్న వాటిలో కాస్త బెస్ట్‌గా ఉండే ఫామిలీ రూమ్ విత్, సీ వ్యూ తీసుకున్నాం.

అమెరికాలో క్రూయిజ్‌లు అటు తూర్పున అట్లాంటిక్ సముద్రంలోనూ, ఇటు దక్షిణాన గల్ఫ్ ఆఫ్ మెక్సికో లోనూ, ఇటు పశ్చిమాన పసిఫిక్ తీరం లోనూ యాత్రలకు తిరుగుతూ ఉంటాయి. ఇందులో మూడు రోజుల నించి, నెల రోజుల వరకూ సమయాలలో రకరకాల ప్రదేశాలు చూసేందుకు వీలు కలిపిస్తున్న రకరకాల నౌకా యాత్రలున్నాయి.

శాన్ ఫ్రాన్సిస్కో పేరు గాంచిన నౌకా తీరం. పైగా మేమున్న బే ఏరియా నించి గంట దూరంలో ఉంటుంది. కాబట్టి ఇక్కడి నించే ఆ యాత్ర ఏదో చేద్దామని ముందు ఇక్కడి నుంచి తిరిగే యాత్రల పట్టిక వెతికాం. అందులో తొమ్మిది రోజుల నించి పై చిలుకే ఉన్నాయి యాత్రలన్నీ. పిలలకైతే సెలవులు గానీ, మా ఇద్దరికీ మహా అయితే అయిదు రోజుల కంటే సెలవు దొరకదు. పైగా అన్నేసి రోజులు నౌకా యాత్రలంటే తక్కువ ఖరీదు కూడా కాదు.

మేం వెతికిన **3-5** రోజుల టూర్లలో లాస్ ఏంజిల్సు నించి బయలుదేరే మెక్సికో క్రూయిజ్ అన్నిటికీ అనువుగా అనిపించింది మాకు. మూడు రోజుల యాత్రలో లాంగ్ బీచ్ నించి బయలుదేరి మెక్సికోలో ఎన్ సినాడా వరకూ వెళ్లి, ఒక రోజు ఆ ఊర్లో హాల్టు వేసి, తిరిగి తీసుకు వస్తారు. నాలుగు రోజుల యాత్రలో మధ్యలో ఒక రోజు కేటలీనా ద్వీపం కూడా చూపిస్తారు. కేటలీనా మేం ఇది వరకే చూసినందువల్ల మూడు రోజుల క్రూయిజ్ నే ఎంపిక చేసుకున్నాం. ఎలాగూ అటూ ఇటూ రెండు రోజులు రానూ పోనూ మా ఊరి నించి లాస్ ఏంజిల్సు వరకూ డ్రైవ్లో పోతుంది.

ఇక బుక్ చేసుకునే ముందు వచ్చిన ముఖ్యమైన సందేహాల్లో మొదటిది వీసా సమస్య. మెక్సికో అంటే అమెరికా సరిహద్దు దేశం. సరిహద్దు దాటి వెళ్లడం వల్ల ఒకసారి అక్కడ పోర్టులో దిగి మళ్లీ అమెరికా భూభాగంలో అడుగుపెట్టాలంటే వీసా తప్పనిసరి. ఇండియా నుంచి ఉద్యోగరీత్యా వచ్చినా, విజిటింగుకి వచ్చినా తాత్కాలిక వీసా కిందే లెక్క. తాత్కాలిక వీసాలో ఉన్న వాళ్లు బోర్డరు దాటి వెళ్తే ముందే క్యాన్సిలేట్ నించి అధికారిక అనుమతి ఉండాలా? అవసరం లేదా? అనేది మా సందేహం. టిక్కెట్లు బుక్ చేసుకునే ముందే రకరకాల సైట్లు చదివేం. తెల్సిన ఒకరిద్దరిని అడిగినా వారంతా ఇక్కడ సిటిజన్లు కావడంతో సరైన సమాచారం దొరకలేదు. టిక్కెట్లు అమ్మే సైటు సపోర్టు వాళ్లకి ఈ-మెయిల్ పెట్టి కనుక్కున్నాం. అంతా చెప్పేదీ ఒక్కటే నిబంధనలకు సరిపడే "వేలీడ్" వీసా ఉంటే చాలునని. నిబంధనలకు సరిపడే వీసా ఉన్నా, మాకొచ్చిన సందేహం ఏవిటంటే మళ్లీ

కాన్సిలేటుకి వీసా స్టాంప్పింగుకి వెళ్ళాలా? అని. అది మాత్రం ఎవరూ చెప్పలేకపోయారు. ఇక అయ్యేదేదో అవుతుందని ధైర్యంగా బుక్ చేసేసుకున్నాం. ఈ వీసా తమాషా ఏం జరిగిందో అక్కడి వరకూ వచ్చేక వివరిస్తాను. కానీ ప్రయాణానుభవం వల్ల తెలిసినదేవిటంటే అమెరికాలో గ్రీన్ కార్డు హోల్డర్లు, సిటీజన్లు కాక ముందు దేశం దాటి వెళ్లే ఇలాంటి టూర్లకి వెళ్లకపోవడమే మంచిదని.

ఇక తరువాతి సందేహం ఖరీదుకి సంబంధించి. ఆన్ లైనులో చూపిస్తున్న టిక్కెట్టు ఖరీదు మనిషి చొప్పున. అందులో మా ఎకామిడేషను కలుస్తుందా? లేదా మళ్లీ ఎకమడేషను కొనుక్కోవాలా? అనేది మా ప్రశ్న. మొత్తానికి కనిపెట్టినదేవిటంటే ఆ టిక్కెట్టు లోనే ఎకమడేషను కలుస్తుంది. అంతే కాదు ఇంకొక ఆనందదాయకమైన విషయమేవిటంటే మేం వెళ్ళిన కార్నివాల్ క్రూయిజ్‌లో ఫుడ్ కూడా ఆ టిక్కెట్టులోనే భాగం. విడిగా కొనుక్కోనవసరం లేదు. ఎంత కావాలంటే అంత, ఎప్పుడు కావాలంటే అప్పుడు తినొచ్చు. తాగడానికి మాత్రం రోజు మొత్తానికి కలిపి ఒక్కో టిక్కెట్టు చొప్పున విభాగాల ప్రకారం ఉన్న ఖరీదు టిక్కెట్లు కొనుక్కోవాలి. ఈ టిక్కెట్లు ఆల్కహాలు తాగే వారికి ఉపయోగకరం. రోజు మొత్తం మీద కొనుక్కున ఒక్క టిక్కెట్టుతో ఎన్ని సార్లయినా తాగొచ్చు. మాలా కూల్ డ్రింకులు తాగే వారికి అసలు అలాంటి టిక్కెట్టు అనవసరం. ఎందుకంటే అక్కడ ఫుడ్ కౌంటర్లలో కూల్ డ్రింకులు, జ్యూసులు ఎడాపెడా తాగొచ్చు. ఇది తెలియక మేం మొదటే నాలుగు రోజులకి ఫామిలీలో ప్రతీ ఒక్కరికీ జ్యూస్ టిక్కెట్లు కొనేసాం.

ఇక ఇన్సూరెన్సులు, టిప్పులు వగైరా కూడా టిక్కెట్టుతో బాటే కట్టేసరికి మా ఇద్దరికీ, పిల్లలిద్దరికీ కలిపి దాదాపు రెండు వేల డాలర్లు వదిలాయి. అయినా అనంత సాగరపు అలల మీద రేయింబగళ్లు కలల రెక్కలు సాచుకుని విహంగాల్లా స్వేచ్ఛగా తేలియాడాలన్న ఔత్సాహిక మానసాలకి వెలకట్టలేని ఆనందమే ఒక పరమాంబుధి కదా!

ఇక షిప్పులోని ఆటపాటలూ, చూడాల్సిన విశేషాలూ వెబ్సైటుల్లో ఎంత చదివినా కళ్లారా చూస్తే గానీ అర్థం కానంత విశేషమైనవి.

షిప్పులో ఒక రాత్రి ప్రత్యేకించి భోజనానికి వేసుకోవల్సిన ఫార్మల్ డ్రెస్సుల కోసం షాపింగుతో మా ప్రయాణం హడావిడి మొదలయ్యింది.

మొత్తం మూడు రోజుల షిప్పు ప్రయాణానికి లాస్ ఏంజల్సు వరకూ రెండు రోజులు అటూ ఇటూ మా ప్రయాణం కలుపుకుంటే మొత్తం అయిదు రోజులకు సరిపడా తలా ఒక బాగు సర్దుకున్నాం.

ఆగస్టు నెల మొదటి వారంలో ఇంకా వేసవి వేడిమి ఉండి, నును వెచ్చగా ఉండి ఆహ్లాదంగా ఉంటుందిక్కడ. చక్కగా తేలికపాటి దుస్తులు వేసుకుని హాయిగా తిరొగొచ్చు. ఇక షిప్పులో ఉండే స్విమ్మింగు యాక్టివిటీల కోసం అంతా స్విమ్మింగు డ్రెస్సులు, మరో నాలుగైదు జతల లోదుస్తులు సర్దుకోవడం మర్చిపోలేదు.

షిప్పులో ఇచ్చిన లిస్టులో ఉన్న ఏ యాక్టివిటీలోనూ పాల్గొనే మనస్తత్వం లేని నేను షిప్పు డెక్ మీద కూచుని హాయిగా చదువుకుందుకు ఇటీవలే ఒక మిత్రురాలు బహుమతిగా ఇచ్చిన బిపిన్ చంద్ర "సహవాసి" పుస్తకాన్ని తోడుగా తీసుకెళ్లేను. లాంగ్ డ్రైవ్ లకి వెళ్ళినప్పుడు అప్పుడప్పుడు సత్య, నేను పుస్తకాల్ని ఒకళ్లు చదువుతూంటే మరొకళ్లు వింటూ డ్రైవ్ చేస్తూ ఉంటాం.

ఈ ప్రయాణంలో నౌకాయానంలోనూ, కారు ప్రయాణంలోనూ ఈ పుస్తకం మాకు నిజంగా సహవాసి అయింది.

గురువారం సాయంత్రం అయిదు గంటలకు షిప్పు బయలుదేరుతుంది. కానీ ఒంటి గంటకే బోర్డింగు ప్రారంభమయ్యిపోతుంది. మా ఇంటి నుంచి లాస్ ఏంజల్సు అయిదారు గంటల డ్రైవ్‌లో ఉంటుంది. అక్కడి నుంచి షిప్పు ఎక్కాల్సిన పోర్టు లాంగ్ బీచ్ మరో గంట. అయితే ఎక్కడ ట్రాఫిక్ జాములో ఇరుక్కున్నా సరైన సమయానికి చేరడం కష్టం. ఇక అదే రోజు తెల్లారగట్ల ఇంటి నుంచి బయలుదేరి చిన్న పిల్లల్తో హడావిడి పడడం ఎందుకని ముందురోజే లాస్ ఏంజల్సుకి చేరుకున్నాం.

ఇక కారు పార్కింగుకి లాంగ్ బీచ్ పోర్టులో మూడు రోజుల పాటు కట్టే డబ్బులు ఆదా చెయ్యడం కోసం అసలు ఇలా షిప్పు ప్రయాణాల ట్రాన్స్ పోర్టు కనెక్టివిటీ అందించే హొటలులోనే బస చేసేం. ఆన్ లైనులో వెతికితే వచ్చే ఆప్షన్ లలో మాకు బాగా నచ్చే హిల్టన్ గ్రూప్ హొటల్సులో ఒకటి దొరికింది. అక్కడ ఒక రోజు ఎకామడేషనుతో బాటూ ఇలా క్రూయిజ్ వెళ్లే వాళ్లకి కారు పార్కింగు ఫ్రీ.

ఎప్పటిలానే రోజంతా నవ్వుతు, తుళ్ళుతూ కారు ప్రయాణాన్ని ఆహ్లాదంగా అనుభూతిస్తూ లాస్ ఎంజిల్సుకి చేరేం.

అలా ముందు రోజు వెళ్ళడం వల్ల కారు ప్రయాణపు బడలిక తీరి మర్నాడు షిప్పు ప్రయాణానికి ఉత్సాహంగా తయారయ్యేం.

*(ఇంకా ఉంది)*

♦ ♦ ♦

# నా కళ్లతో అమెరికా-65 (మెక్సికో నౌకా యాత్ర- భాగం-2)

లాంగ్ బీచ్ లోని పోర్టు నించి దాదాపు అరగంట వ్యవధిలో ఉంది మా హొటల్. అయితే ప్రత్యేకించి మాలాగా క్రూయిజ్‌కు వెళ్లే వాళ్ల కోసం ఉచిత కారు పార్కింగు, డ్రాపింగు సర్వీసు అక్కడ ఉన్నందున ఉదయం స్థిమితంగా నిద్ర లేచేం.

అన్నిటికన్నా పై అంతస్థులో ఉన్న రెస్టారెంటులో బ్రేక్ ఫాస్టు చేసి, అక్కణ్ణించి కనిపిస్తున్న నగర సౌందర్యాన్ని ఆస్వాదించేం.

పై నించి కార్లన్నీ చిన్న బొమ్మ కార్లలా కనిపించసాగేయి. దగ్గర్లోని నాలుగు రోడ్ల కూడలిలో సిగ్నల్ పనిచెయ్యడం మానేసినట్లుంది.

కార్లన్నీ ఒక క్రమ పద్ధతిలో ఒక దాని తర్వాత ఒకటి వెళ్తున్నాయి. అమెరికాలో సిగ్నళ్లు పనిచెయ్యక పోతే స్టాపు సిగ్నల్ పద్ధతిని పాటించాలి. అంటే ఒక్కొక్క కారు చొప్పున ఎవరు ముందు వచ్చి సిగ్నల్ దగ్గర ఆగితే, వాళ్లు వెళ్లాలి.

ఎక్కడా పొరబాటున కూడా ఇద్దరు వచ్చి కూడలిలో గొడవ పడకుండా ఎవరి దారిన వారు క్రమ శిక్షణతో వెళ్తున్న దృశ్యాన్ని పై నించి పిల్లలకు చూపించి, "ఇతర గ్రహాల నించి ఏలియన్సు వస్తే ఈ క్రమశిక్షణకి మురిసిపోతారు ముందు" అన్నాను.

"ఏలియన్సు వరకూ ఎందుకు? భూగోళానికి అవతలి నుంచి వచ్చిన మనమే మురిసిపోవట్లే" అన్నాడు సత్య.

"ఇక్కడి నుంచి హార్బరు అనిపించడం లేదు గానీ, లేకపోతే మమ్మీ కవిత్వం రాయడం మొదలు పెట్టుంది" అంది వరు.

మొత్తానికి పదకొండు గంటల వేళకల్లా మా సామాన్లు సర్దుకుని హొటలు పార్కింగులో మా కారు వదిలేసి, హొటలు షటిల్‌లో పోర్టుకి చేరుకున్నాం.

మంచి ఎండగా ఉండడం వల్ల సముద్ర తీరంలో ఆహ్లాదంగా ఉంది.పోర్టులో మా షటిల్ మమ్మల్ని దించే చోటనే సూట్ కేసులని ట్యాగులతో కట్టి షిప్పులోకి కేబిను లగేజీగా తీసుకునే సౌకర్యం ఉంది. మేం కాస్త ఎక్కువ టిప్పు ఇచ్చేసరికి షటిల్ డ్రైవరు దిగి వచ్చి మా లగేజీనంతటినీ దించడానికీ, షిప్పు కేబిను లగేజీ కార్టులలో ఎక్కించడానికీ సహాయం చేసేడు.

పోర్టు ఎంట్రెన్సు పెద్ద డోమ్ ఆకారంలో ఆకర్షణీయంగా ఉంది. ఆ పక్కనే పెద్ద షిప్పు కనిపిస్తూండడంతో అదే మా షిప్పని అనుకున్నాం. కానీ తర్వాత అర్థమయ్యింది. అది హొటలుగా మలిచిన పాత షిప్పని.

ఇక గ్లోబు లోని ఎంట్రెన్సుకి బయటి నించే పెద్ద లైను, సెక్యూరిటీ ఉన్నాయి.

విమాన ప్రయాణానికున్న హంగులన్నీ ఉన్నాయి. విమాన ప్రయాణపు చెకింగు పాయింటు లాగే ఇక్కడా వాటర్ బాటిల్సు నిషిద్ధం కనుక మాతో తెచ్చిన వాటర్ బాటిల్సు అక్కడ పడెయ్య వలసి వచ్చింది. లైన్లలో వరసగా వెళ్లి టిక్కెట్లు చూపించడం వరకూ సజావుగా జరిగాయి.

ఇక మాకు బోర్డింగు పాసులు ఇవ్వడానికి పాసుపోర్టులు, వీసా కాగితాలు పుచ్చుకుని కౌంటరు లోని వ్యక్తి మమ్మల్ని అరగంటకి పైగా నిలబెట్టేడు. లోపలికి వెళ్లడం, ఎవరితోనో మాట్లాడడం మళ్లీ వచ్చి ఇంకెవరితోనో మాట్లాడడం, మళ్లీ లోపలికెక్కడికో వెళ్లడంమాకు నీరసం రావడం మొదలు పెట్టింది.

మా పక్క కౌంటరులన్నీ గబగబా కదిలిపోతున్నాయి. మొత్తానికి మా టిక్కెట్ల మీద స్టాంపు ముద్రించి బోర్డింగు పాసులు చేతికిచ్చి "హేవ్ ఎ నైస్ జర్నీ'' అన్నాడు కౌంటరు లోని వ్యక్తి.

"హమ్మయ్య'' అని ఊపిరి పీల్చుకుని అక్కణ్ణించి లిఫ్టు ఎక్కి పై అంతస్థుకి వెళ్లేం. డోము బిల్డింగు దాటి చిన్న బ్రిడ్జి మీద ప్రవేశించాం.

ఎదురుగా పదంతస్థుల భవనం కనిపించింది. చుట్టూ నీటిని చూస్తే మాత్రమే అది భవనం కాదు అందంగా నీటి మీద ఠీవిగా తేలియాడే అతి పెద్ద నౌక అని అర్థం అవుతుంది.

బ్రిడ్జి దాటి నౌకలోని ఆరో అంతస్థులోకి ప్రవేశించాం.చుట్టూ బంగారు రంగు లతలతో, ఎర్ర కార్పెటుతో, ఖరీదైన సామగ్రితో విలాసవంతమైన నౌక గొప్ప ఇంద్ర భవనంలా ఉంది లోపల.

ఏదో ఫైవ్ స్టార్ హొటల్‌లోకి ప్రవేశించినట్లు మధ్య హాలులోంచి చుట్టూ కనిపిస్తున్న అంతస్థులు, గ్లాస్ లిఫ్టు.

గుమ్మం దగ్గిరే పూర్తిగా తువ్వాళ్లతో తయారు చేసిన దుస్తులలో పెద్ద ఏనుగు ఆకారపు మనిషి చిన్న పిల్లలకు ప్రత్యేక స్వాగతం పలుకుతున్నాడు.

పిల్లలు ఫోటోలు తీసుకుంటుండడంతో సిరి అటు దుముకింది "ఆఫెంట్'' (ఎలిఫెంట్‌ని సిరి "ఆఫెంట్'' అంటుంది) అంటూ.

అక్కడి ఫోటో గ్రాఫర్తో బాటూ నేనూ ఫోటో తీసేను. చప్పున నా దగ్గిరికి వచ్చి అలా వాళ్ల ఫోటోలు తీస్తున్నపుడు అదే ఫోజులు మేం తియ్యకూడదని చెప్పేడు ఫోటోగ్రాఫర్. ఎందుకనేది చివరిరోజు అర్థమయ్యింది. ఇలా అక్కడక్కడా తీసిన ఫోటోలని ప్రింటు చేసి అమ్మకానికి పెడతారు.

ఒక్కొక్క కాపీకి పదిహేను డాలర్ల చొ.న వసూలు చేస్తారు. అదీ సంగతి. మేం ప్రవేశించిన అంతస్థులో పై నించి సూర్యకాంతి లోపలికి పడేటట్లు పై డూముకి అద్దాలు బిగించి ఉన్నాయి.

ఎదురుగా హాలు మధ్య చుట్టూ ఎత్తు కుర్చీలతో బార్ ఉంది. చుట్టూ ఉన్న రకరకాల గిఫ్ట్ షాపులకు, ఈ బార్కు మధ్య ఉన్న ఎత్తు వరండాలో నిలబడి మధ్య కనిపిస్తూన్న అంతస్థుల గుండా పైకి చూసినా, కిందికి చూసినా వేనవేల నక్షత్రాలు తల చుట్టూ తిరుగుతున్నట్లు కాంతుల తళతళలు. అందులో అడుగడుగూ అత్యద్భుతం.

బార్ దగ్గర ఉన్న చిన్న స్టేజీ దగ్గిర గంటకోసారి గిటారు ఆర్టిస్టులు వచ్చి మంచి సంగీతం వాయిస్తూ పాటలు పాడుతూ చుట్టూ అందరినీ అలరిస్తున్నారు.

ముందుగా మా గదికి వెళ్లి, సామాన్లు భద్రపరుచుకుని, భోజనం చేసి వచ్చి, ఆ రోజంతా అసలు షిప్పులో ఒక్కో ఫ్లోరు తిరిగి విశేషాలన్నీ ఒక రౌండు చూసి రావాలని అనుకున్నాం.

షిప్పులో మేం ప్రవేశించిన అంతస్తుకి దిగువన ఉన్న అంతస్తు మాంచి ఖరీదైన గదులతో కూడినది. నాలుగు, మూడు అంతస్తులలో ఉన్న రెండు వందల గదులలో సముద్రం కనిపించే అంచుల వైపు ఉన్న గదులు, సముద్రం కనిపించని వైపు గదుల కంటే కాస్త ఎక్కువ ఖరీదైనవి.

షిప్పులో దాదాపు 75 ప్రయాణీకులు అక్కడే బస చేసినట్లు ఎక్కడా ఖాళీలు లేవు. అంతకు కింది అంతస్తు నౌకా సిబ్బంది నివాసం. ఆ అంతస్తుకి, దిగువన నౌకా యంత్రాంగం. అందులోకి సిబ్బందికి తప్ప ఎవరికీ ప్రవేశం లేదని రాసి ఉంది.

నాకైతే షిప్పులో పనిచేసే మిత్రులో, చుట్టాలో ఉంటే బావుణ్ణు ఆ అంతస్తులు కూడా చూసి రావడానికి అని అనిపించింది.

ఇక మూడో అంతస్తులో సముద్రం కనిపించే వైపు ఉన్న గది మాది. అంతే కాకుండా ఫామిలీ రూము. బహుశా: అన్ని గదులకూ పరిమాణం ఒక్కటే. ఫామిలీ రూములో డబల్ బెడ్డు పైన, పక్కన మరో రెండు సింగిల్ బెడ్లు గాలిలో వాల్చుకుని పడుకునే అవకాశం ఉంది.

నిజానికి ఇద్దరు పిల్లలతో మాకు ఆ గదిలో బెడ్లు ఎక్కువే అని చెప్పాలి. మరో ఇద్దరు పెద్ద వాళ్ళు కూడా మాతో బాటూ ఉండొచ్చు. గది మొదట్లోనే అతి చిన్న బాత్రూము. కానీ అమెరికాలోని

ఏ మంచి ఖరీదైన హొటల్‌కు తీసిపోనట్లు దీటుగా ఉన్నాయి ఆ గదిలోని ఏర్పాట్లు. గోడకి చిన్న టీవీ కనిపించగానే పిల్లలు ప్రోగ్రాములు చూద్దామని సంబరపడ్డారు.

కానీ అందులో కేవలం షిప్పుకు సంబంధించినలోకల్ చానల్సు మాత్రమే వస్తున్నాయని చూసి నిరాశ పడ్డారు.

కానీ నిజానికి గదిలో నుంచి బయటకు అడుగు పెట్టిందగ్గర్నించి ఎదురయ్యే ఎన్నో విశేషాల మధ్య అసలు గదుల్లో కూచోవడానికే సమయం చాలదని అర్థమయ్యింది మాకు.

*(ఇంకా ఉంది)*

♦ ♦ ♦

# నా కళ్లతో అమెరికా- 66 మెక్సికో నౌకా యాత్ర- భాగం-3
# నౌకలోని వింతలు- విశేషాలు

పదంతస్తుల భవనం లాంటి అతి పెద్ద నౌకలో మా గదిలో సామాన్లు పడేసి వెనువెంటనే నౌకంతా చుట్టి రావడానికి నిర్ణయించుకున్నాం.

మా బస మూడో అంతస్తులో కావడం వల్ల గది బయట ఉన్న వరండాలో నుంచి వచ్చి లిఫ్టు ఎక్కే ముందు కిందికి వెళ్ళాలా, పైకి వెళ్లాలా అని సందేహించాం.

భోజనాల వేళ కావడంతో అన్నిటి కంటే పైన పదో అంతస్తులో ఉన్న ఫుడ్ కోర్టుల దగ్గర్నించీ ఒక పట్టు పడదామని బయలుదేరేం.

పదో అంతస్తు అటు మూల నించి ఇటు వరకు భోజన సదుపాయాలు ఉంటాయి. వరసగా ఉన్న రకరకాల హాళ్లలో, రకరకాల ఫుడ్ వెరైటీలు ఉంటాయి.

బయట కూర్చుని తినేందుకు కూడా అనువుగా దారికిటూ అటూ కుర్చీలు, మధ్యలోచిన్న స్విమ్మింగు పూల్స్ కూడా ఉన్నాయి.

లోపల హాల్స్‌లో ఇండోర్ ఫుడ్ కోర్ట్స్‌కి అనువుగా సిట్టింగ్ ఏరియాలతో అన్నీ ఎక్కడా తీసిపోని విధంగా సదుపాయాలు ఉన్నాయి.

అన్నిటికంటే అందరికీ బాగా నచ్చే విషయం ఏవిటంటే ఫుడ్ టిక్కెట్టులోనే భాగం కాబట్టి తినేందుకు విడిగా డబ్బులు కట్టనవసరం లేదు.

24 గంటలూ ఏదో ఒక ఫుడ్ కోర్టు తెరిచే ఉండడంతో భోజన ప్రియులకు చాలా మంచి అవకాశం.

పిల్లలకు ఇష్టమైన ఉడకబెట్టిన మొక్కజొన్నలు, పీజా, నూడుల్స్ వంటి వాటితో బాటూ రకరకాల మాంసాహారాలు, రకరకాల కేకులు, ఎంత తిన్నా తరగని ఐస్క్రీము మిషన్లు, లిమిట్ లేని జ్యూసులు, కూల్ డ్రింకులు ప్రత్యేకంగా అలరించేయి మమ్మల్ని.

షిప్పులో మొదటగా భోజనం చేస్తున్నాం కాబట్టి ఎక్కడికి వెళ్లాలో, ఏం తినాలో అనే సందిగ్ధత, తీరా తిన్నాక అయ్యో మరేవో చూసుకోలేదే అన్న బాధ కలగడం సహజం అందరికీ.

అందుకే ముందుగా కనబడ్డ ఫుడ్ కోర్టు లైనుల్లో నిలబడకుండా నిజానికి చెయ్యాల్సినదేవిటంటే ముందు క్షుణ్ణంగా అన్ని ఫుడ్ కోర్టులు తిరిగి చూడాలి. చూసేక ఎక్కడ నచ్చితే అక్కడ నచ్చినవన్నీ పళ్లెంలో పెట్టి తెచ్చుకుని తినొచ్చు. అది అర్థమయ్యాక మా పని తేలిక అయిపోయింది.

ఇక కడుపు నిండా తిన్నాక తర్వాత పని షిప్పు లోని ప్రతీ ఒక్క విశేషమూ తిరిగి చూసి రావడం.

ముందుగా అన్నిటి కంటే పైనున్న టెర్రెస్ మీదికి అధిరోహించేం. ఆ టెర్రస్ నించి మధ్యలో ఫుడ్ కోర్టులు ఉన్న పదో అంతస్థు కనిపిస్తూనే ఉంటుంది.

షిప్పు ఆ మూల నించి ఈ మూల వరకూ పైన పదకొండో అంతస్థులో నడవడానికే చాలా సమయం పడుతుంది.

ముందుగా ఒక వైపుగా ఉన్న మినీ గోల్ఫ్ ఆటకు దిగేరు సత్య, పిల్లలు. అది దాదాపు ఒక గంట సేపు పట్టే ఆట.

ఇక నేను వీళ్లకి ఫోటోలు తీయడంతో బాటూ ఆ ప్రదేశానికి ఆనుకుని ఉన్న వరండా లోంచి కనిపిస్తూన్న సముద్రానికి కళ్లప్పగించేను.

బాగా మంచి ఎండగా ఉండడంతో అక్కడక్కడా ఉన్న చిన్న చిన్న నీడల్లో కూర్చుని ఆ కాస్సేపూ గడిపేను.

అక్కడి నుంచి షిప్పు మధ్యకి నడిచే దారిలో షిప్పు బయటి గోడని ఆనుకుని గట్టిగా కట్టిన లైఫ్ బోట్లని చూసి చాలా ఆశ్చర్యం వేసింది. అవి కూడా చాలా పెద్దవి.

అవి దాటుకుని ముందుకు నడిచి మనుషులు గళ్ళలో నడుస్తూ ఆడే చదరంగం కాస్సేపు ఆడేం.

అక్కడే చిన్నపిల్లల డే అండ్ నైట్ కేర్ సెంటర్లు ఉన్నాయి.

షిప్పులో పెద్దవాళ్లు మాత్రమే వెళ్లే కొన్ని షోలకి పిల్లల్ని రానివ్వరు. అటువంటప్పుడు పిల్లల్ని వయసుల వారీగా ఉన్న ఈ కేర్ సెంటర్లలో వదలొచ్చు. ఈ సదుపాయానికి మొదటి ఉచిత గంటలు కొన్ని ఉన్నాయి. ఆ సమయం దాటితే డబ్బులు కట్టాల్సి ఉంటాయి.

షిప్పుకి మరో మూలకి పెద్ద వాటర్ పార్కు ఉంది. పిల్లలు వెంటనే అటు పరుగు తీసేరు. కానీ అతి కష్టమ్మీద వాళ్ళని ఆపాం.

అందులో అడుగు పెట్టడానికి స్విమ్మింగ్ బట్టలు అవసరం కాబట్టి ఆ కార్యక్రమాన్ని మరుసటి దినానినికి వాయిదా వేసేం.

అన్నట్లు మేం ఈ హడావిడిలో ఉండగానే సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో షిప్పులోకి ఎక్కగానే ఇచ్చిన వెల్ కమ్ గురించీ, జాగ్రత్తల గురించీ కూడా చెప్పుకోవాలి.

షిప్పు లోని వారందరికీ వెల్ కమ్ పార్టీ అనౌన్సు మెంట్ వచ్చింది. అంతా ఎనిమిదో అంతస్తులో ఉన్న పెద్ద థియేటర్‌లో కూచోవాలి.

ఎక్కడ చూసినా బంగారం తాపడం పూసినట్లు మిలమిలా మెరిసిపోతూ ఉందా హాలు.

రెండస్తుల్లో అత్యంత ఖరీదైన గొప్ప సీట్లు ఉన్నాయి అక్కడ.

అంతా హాలులో సర్దుకున్నాక స్వాగత నృత్యాలు ప్రారంభమయ్యేయి. అరగంట తర్వాత షిప్పులో పాటించవలసిన జాగ్రత్తల కోసం అందర్నీ టెర్రేస్ మీదికి తీసుకు వెళ్ళేరు. అందులో భాగంగా ఒక వేళ షిప్పు మునిగిపోతే లైఫ్ బోట్లలో ఎక్కేటప్పుడు వహించాల్సిన ముఖ్యాంశాలు ముందుగా చెప్పసాగేరు.

క్లిష్ట సమయాల్లో ముందుగా పిల్లల్ని, ఆడ వాళ్ళని పంపుతామని చెప్తుంటే, టైటానిక్ జ్ఞాపకం వచ్చి ఒళ్లు గగుర్పొడిచింది.

*(ఇంకా ఉంది)*

♦ ♦ ♦

# నా కళ్లతో అమెరికా -67 (మెక్సికో నౌకా యాత్ర- భాగం-4)

ఇక అక్కడి నించి ఎనిమిదో అంతస్థులోకి దిగే సరికి పెద్ద పెద్ద పెర్ఫార్మింగ్ హాల్సు, థియేటర్లు ఉంటాయి.

ఏడో అంతస్థులో ఈ మూల నించి ఈ మూల వరకు, కేసినో, ఫోటో స్టూడియోలు ఉంటాయి. ఆరో అంతస్థులోఅన్నీ షాపులు బట్టలు, గిఫ్ట్ ఐటమ్సు. అన్నిటినీ మించి ఒక మోస్తరు ఖరీదు నించి, బాగా ఖరీదైన రాళ్ళ నగల వరకూ అమ్ముతూంటారు. షాపింగు ఫెస్టివల్ కూడా చివరి రోజు పెట్టేరు.

ప్రతీ అంతస్థులో ఈ చివర నించి ఆ చివర వరకూ ఇలా చూసుకుంటూ మేం మొదట బయట నుంచి ప్రవేశించిన అయిదో అంతస్థులోకి వచ్చే సరికి మళ్లీ రాత్రి భోజనాల వేళ అయిపోయింది.వరు వయసు పిల్లలకి ఉచితంగా "యూత్ క్లబ్" అనీ, చిన్నపిల్లలకు "కిడ్స్ క్లబ్స్" అనీ ఉన్నాయి.

షిప్పు ఎక్కిన దగ్గర్నించీ వరు సాయంత్రం ఈ యూత్ క్లబ్బుకి వెళ్తానని పేచీ మొదలు పెట్టింది.

ఇందులో ఆ వయసు పిల్లలకి కబుర్లు చెప్పుకోవడానికి మంచి సిట్టింగ్ ఏరియాలు, చిన్న టీవీ, బోర్డు గేమ్స్ వగైరా ఎంటర్టైన్మెంట్లు చాలా ఉన్నాయి.

వాళ్లని కాపలా కాయడానికి, సహకరించడానికీ నలుగురైదుగురు కోచ్‌లు కూడా ఉన్నారు.

ఈ క్లబ్బు సాయంత్రం ఆరు నించి పదకొండు గంటల వరకు ఉంటుంది.

షిప్పులోని టీనేజ్ పిల్లలంతా అక్కడే ఉన్నారు.

ఇక సిరి కిడ్స్ క్లబ్బు ఏక్టివిటీస్ నిర్ణీత సమయాల్లోనే బాచ్‌ల వారీగా ఉంటాయి. రాత్రి 9 గంటలకు బాచ్‌లు క్లోజ్ అయిపోయాక, ఇంకా పిల్లల్ని కొనసాగించాలనుకుంటే 11 గంటల వరకు గంటకి పది డాలర్ల చొప్పున కట్టి ఉంచవచ్చు.

మేం వరుని సాయంత్రం 6 గంటలకే పంపకుండా మాతో బాటూ డిన్నర్ అయ్యాక దాదాపు రాత్రి 8.30 గంటల వేళ పంపేవాళ్ళం ఆ రెండు రోజులూ.

సిరినైతే రోజు మొత్తమ్మీద మహా అయితే అరగంట సేపు వదిలి ఉంటాం. అంతే. ఏదేమైనా భార్యాభర్తలు ఇద్దరూ షిప్పంతా తిరిగి హాయిగా ఎంజాయ్ చెయ్యడానికి వీలుగా షిప్పులో ఇలా పిల్లల ఎంటర్టైన్ మెంటు సెంటర్లు ఉండడం విశేషం.

సాయంత్రం పెద్దవాళ్లకు, పిల్లలకు కలిపిన ఎంటర్టైన్మెంట్ థియేటర్‌లో వెల్ కమ్ డాన్సులు, కామెడీ ప్రోగ్రామ్, పాటల కార్యక్రమం చూసేం. ప్రతీ హాలు బయటా కూల్ డ్రింకుల పాసులు కొనుక్కున్న వారికి టిప్పు ఇస్తే హాలు లోపలికి తెచ్చి ఇచ్చే మనుషులు ఉంటారు. లేదా మనమైనా వెళ్లి ఎన్ని సార్లయినా తెచ్చుకోవచ్చు. ఆరంజి, ఏపిల్ జ్యూసులు కూడా అందులోని భాగమే.

దాదాపు పదకొండు గంటల ప్రాంతలో అందరం గదికి చేరుకుని ఆదమరిచి నిద్రపోయేం. షిప్పు బయలుదేరిన దగ్గర్నించీ సముద్ర కెరటాల కదలికలు అంత పెద్ద షిప్పులోనూ లైటుగా తెలుస్తూనే ఉన్నాయి. చిన్నగా బుర్ర తిరుగుతున్నట్లు అనిపించసాగింది నాకు ఓడలో ఉన్నంతసేపు. ఇక సముద్రం అంతర్భాగంలోకి ప్రవేశించినట్లు న్న రాత్రి పూటైతే బాగా ఎక్కువగా కెరటాలలో ఓడ అటూ ఇటూ ఊగడం బాగా తెలిసింది.

పైగా మేం బస ఉన్న అంతస్థు కిటికీ దిగువన కెరటాలు కనిపిస్తూ, సముద్రం వైపు గది కావడం వల్ల దబ్బు దబ్బున ఓడని కొట్టుకునే నీళ్ల సవ్వడికి అసలు నిద్ర సరిగా పట్టలేదు నాకు.

ఉదయం ఏడు గంటలకే మా ఓడ తీరాన్ని చేరనుందని ఎనౌన్సుమెంటు వచ్చింది. కిటికీలోకి ఎక్కి కూచునే గట్టు ఉండడం వల్ల లేస్తూనే అందులోకి ఎక్కి కూచుని ఒడ్డున కనిపిస్తున్న వరస పర్వతాల్నీ, బూడిద రంగు నీళ్లని తెల్లని నురగ కత్తులతో కోసుకెళ్తున్న ఓడ అంచుని చూస్తూ ఒక మహాద్భుత ఉదయాన్ని తిలకిస్తూ ఉంటే నా చిన్నతనంలో ప్రతీ వేసవిలోనూ గది కిటికీ గట్టు మీద కూచుని టామ్ సాయర్, హకల్ బెరీ ఫిన్ ఆశ్చర్యానందాల్తో పదేపదే చదవడం జ్ఞాపకం వచ్చింది.

మబ్బు కమ్ముకుని ఉండడం వల్ల ఉదయం ఆహ్లాదంగా కనిపిస్తున్నప్పటికీ, అయ్యో! ఇవేళంతా బయట తిరగాలి కదా, వర్షం పట్టుకుంటుందేమో అని దిగులు పడ్డాం.

అయితే మేం దిగే సరికి చక్కగా ఎండ కాస్తున్నందు వల్ల సముద్రం లోపల ఉన్న వాతావరణం వేరు, తీరాన వాతావరణం వేరు అని అర్థం అయింది.

మొత్తం ప్రయాణంలో ఆ రోజు రెండవ రోజు. ట్రిప్పు వాళ్ల నిర్ణీత అజండా ప్రకారం ఆ రోజు మేం మెక్సికో భూభాగంలో దిగి నగర సందర్శన చేస్తాం. నగర సందర్శనలో భాగంగా రకరకాల టూర్లు ఉన్నాయి. అవి షిప్పు టిక్కెట్టుతో సంబంధం లేకుండా విడిగా కొనుక్కోవాలి.

వైన్ టూర్, ఫుడ్ టూర్, బీచ్ టూర్ మొదలైనవి. వైను టూర్ల వంటి వాటికి మేం ఎప్పుడూ, ఎక్కడా వెళ్ళం. ఇక దూరాభారాలకి నడిచి తిరిగి చూసేవాటికి సిరితో చాలా కష్టం. అస్సలు నడవకుండా మాటిమాటికీ ఎత్తుకోమని పేచీ పెడుతుంది. కాబట్టి ఉన్న టూర్లలో ఒక ఫుడ్డు టూరొకటి బుక్ చేసుకున్నాం.

ఇలా భూభాగంమీద ఏ టూరుకీ వెళ్లని వారు సముద్ర తీర ప్రాంతపు స్నోర్కిలింగు వంటికి టూర్లకు వెళ్లవచ్చు, లేదా షిప్పులోనే సేద తీరొచ్చు.

*(ఇంకా ఉంది)*

♦ ♦ ♦

# నా కళ్లతో అమెరికా-68 మెక్సికో నౌకా యాత్ర (భాగం-5) నగర సందర్శన- టేస్ట్ ఆఫ్ మెక్సికో టూరు

అనుకున్న విధంగా ముందు రోజు నౌకలోకి అడుగు పెడ్తూనే మర్నాటికి మెక్సికో భూభాగంలో తిరిగే టూరు ఒకటి బుక్ చేసుకున్నాం.

ఉదయం దాదాపు ఏడు గంటల ప్రాంతంలో మా నౌక తీరాన్ని చేరింది.

అమెరికా పశ్చిమ తీరంలో దక్షిణ భాగంలో సరిహద్దుని ఆనుకుని ఉన్న "బాహా కాలిఫోర్నియా" అనే తాలూకాలోని "ఎన్సినాదా" అనే ఊరు అది.

మెక్సికో దేశంలోని ఈ ప్రాంతానికి ఇలా నౌకలో వెళ్లే వారికి వీసా అవసరం లేదు.

మేం బుక్ చేసుకున్నది "టేస్ట్ ఆఫ్ మెక్సికో" అనే ఫుడ్ టూరు అయినా అందులో నగర సందర్శన కూడా భాగం కావడంతో సంతోషపడ్డాం.

అక్కడి సముద్రం లోతు ఎక్కువగా ఉండడం వల్ల నౌకని తిన్నగా ఒడ్డు వరకూ తీసుకెళ్లి ఆపేరు. దిగి చూస్తే తీరాన అదొక పెద భవంతి అనే భ్రాంతి కలిగింది.

షిప్పు దిగగానే అక్కడి ప్రాంతీయ వస్త్ర ధారణతో కొందరు రంగురంగుల ఇంద్ర ధనుస్సుల్లా ప్రత్యక్షమయ్యేరు.

వారికి డబ్బులిచ్చి ఫోటోలు తీసుకోవచ్చు.

ఇక పోర్టు నించి బయటికి వెళ్లే దారి షెడ్డు లాంటి భవనం గుండా సాగుతుంది.

అందులోనే భద్రతా లైన్లు దాటగానే అటూ, ఇటూ గిఫ్టు షాపులున్నాయి. అవి దాటి అటు గుమ్మం బయటికి రాగానే అదొక సాధారణ బస్సు స్టేషనులా అగుపించింది.

టూర్లకు మినీ బస్సులు అక్కడ సిద్ధంగా ఉండి ఎక్కించుకున్నాయి. పోర్టులో నుంచి దాదాపు ఒక కిలోమీటరు బయటికి వచ్చినా దూరంగా నౌక కనిపిస్తూనే ఉంది.

చుట్టూ ఎక్కడా చెట్టూ చేమా లేకుండా బల్ల పరుపుగా ఉన్న ఎర్ర నేల అది.

బస్సు ప్రధాన రహదారికి ఎక్కగానే అమెరికాకు, మెక్సికోకి వెంటనే తేడా తెలిసి పోవడం మొదలెట్టింది.

అతి సంపన్నమైన మొదటి ప్రపంచ దేశానికీ, ఎక్కడ చూసినా దారిద్ర్యం తాండవించే మూడవ ప్రపంచ దేశానికీ ఉన్న తేడా అది.

నిజానికి మేం దిగిన ఎన్సెనాదా అనే ఊరు మెక్సికోలోని అమెరికా దేశపు సరిహద్దులోనే ఉన్న బాహ్ కాలిఫోర్నియా ద్వీపకల్పంలో ఉంది.

సముద్రతీరంలోని ఎడారి ప్రాంతమది. బాహ్ కాలిఫోర్నియా రాష్ట్రంలో ఎన్సెనాదా మూడవ పెద్ద నగరం.

రాష్ట్రంలోని 75 జనాభా రాజధాని తియువానా, ఎన్సినాదా మొ.న నగరాలలోనే ఉన్నారు.

ఎన్సెనాదా సిటీ టూరులో భాగంగా బస్సులో నుంచే రివియెరా ఎన్సెనాడా చూసేం. అది చారిత్రాత్మకమైన కాసినో. ఇప్పుడు మ్యూజియంగా మార్చేరు. ఇక్కడే "మార్గరీటా కాక్ టేల్"ని కనిపెట్టారట.

ఇక అన్నిటి కంటే ముఖ్యంగా చూడవలసినది "సివిక్ ప్లాజా" (Civic Plaza). ఇక్కడ మెక్సికో వీరులు Benito Juarez, Venustiano Carranza and Miguel Hidalgo పెద్ద విగ్రహాలు, అతి పెద్ద మెక్సికో జెండా లను, మెక్సికో అమర వీరుల స్థూపాలను చూడవచ్చు. ఈ విగ్రహాల తలలు మాత్రమే ప్రతిష్ఠించి ఉండడం విశేషం. మా టూరులో మొదటి స్టాపు ఇక్కడే.

మేం బస్సు దిగగానే ఇద్దరు ముగ్గురు పిల్లలు చేతులకు అటూ ఇటూ పూసల దండలు, బ్రేస్లెట్ల గుత్తులు పట్టుకుని కొనుక్కోమని మా వెంట పడ్డారు. అమెరికాలో ఎక్కడా ఇలా చట్ట వ్యతిరేకంగా చైల్డ్ లేబర్ కనిపించరు. వాళ్ళను చూసి వరు, సిరి బెదిరి పోయేరు. వాళ్ళను వదిలించుకుని గైడు వెనక పరుగుతీసేరు.

మా బస్సు గైడు చకచకా ఆ మూల నించి ఈ మూలకి మమ్మల్ని నడిపించి, వివరాలన్నీ త్వరగా చెప్పి మరో అరగంటలో తిరిగి చూసి రమ్మని వెళ్ళి పోయింది.

చుట్టూ సందడిగా, జన సందోహంతో కళకళ్లాడుతూ ఉన్న ఆ జంక్షనులోని దాదాపు త్రికోణాకారపు ఆ పార్కులో ఎండిపోయిన గడ్డిని తడపడం కోసం నేల మీదే పారాడుతున్న నీళ్ళ పైపులు, అక్కడక్కడా లీకయ్యి మడుగులు కట్టిన బురద గుంటలు అచ్చు మన ప్రాంతంలాగానే. బాగా నవ్వు వచ్చింది మాకు. మందారం చెట్టు విరగబూసి ఉంది. చటుక్కున కోసి తలలో ఒక పువ్వు తురుముకున్న నన్ను చూసి ఇంకాస్త నవ్వేరు మా పిల్లలు.

అక్కణ్ణించి దాదాపు పదకొండు గంటల వేళ తిన్నగా మా అసలు సిసలు టూరు "టేస్ట్ ఆఫ్ మెక్సికో" ప్రదేశానికి చేరుకున్నాం.

బయటి నించి చూస్తే ఏదో పాత ఇల్లు అనుకునేలా ఉన్న రెస్టారెంటు అది.

లోపల హాలు ధాబా లాగా ఉంది. అది దాటి వెనక వైపు పెరట్లోకి అడుగు పెట్టేసరికి మా టూరు వాళ్ల కోసమే టేబుళ్ల మీద సరుకు, సరంజామా సర్ది పెట్టేరు. టమాటాలు, ఉల్లిపాయలు, వెల్లుల్లి అవన్నీ కోయడానికి కత్తులు, కటర్ లతో బాటూ మనిషికి ఒక అమందస్తా (చిన్న రోలు) కూడా ఇచ్చే సరికి ఖంగు తిన్నాం.

*-కె.గీత*

*(ఇంకా ఉంది)*

♦ ♦ ♦

# నా కళ్లతో అమెరికా -69-( మెక్సికో నౌకా యాత్ర- చివరి భాగం)

"టేస్ట్ ఆఫ్ మెక్సికో టూరు"లో ఎన్సినాదా నగర సందర్శన కూడా కలిసి ఉండడంతో సంబరపడ్డాం. టూరులో ముందుగా సివిక్ ప్లాజాలో మెక్సికో అమర వీరుల విగ్రహాల్ని సందర్శించేం.

అక్కణ్ణించి దాదాపు పదకొండు గంటల వేళ తిన్నగా మా అసలు సిసలు టూరు "టేస్ట్ ఆఫ్ మెక్సికో" ప్రదేశానికి చేరుకున్నాం.

బయటి నించి చూస్తే ఏదో పాత ఇల్లు అనుకునేలా ఉన్న రెస్టారెంటు అది.లోపల హాలు ధాబా లాగా ఉంది. అది దాటి వెనక వైపు పెరట్లోకి అడుగు పెట్టేసరికి మా టూరు వాళ్ల కోసమే టేబుళ్ల మీద సరుకు, సరంజామా సర్ది పెట్టేరు. టమాటాలు, ఉల్లిపాయలు, వెల్లుల్లి అవన్నీ కోయడానికి కత్తులు, కటర్ లతో బాటూ మనిషికి ఒక అమందస్తా (చిన్న రోలు) కూడా ఇచ్చే సరికి ఖంగు తిన్నాం.

పెరట్లో మాతో బాటూ మరో నాలుగైదు టేబుల్స్ నిండా జనం ఉన్నారు.

ముందుగా మా కిచ్చిన టేస్ట్ ఆఫ్ మెక్సికో ఏప్రాన్లు కట్టుకున్నాం.

ముందుగా మెక్సికో ఫుడ్‌గా అత్యంత పేరు పొందిన "సాల్సా" తయారీ తరగతి ప్రారంభమైంది.

మాకిచ్చిన సరుకుల్లో వెల్లుల్లి రేకను ముందుగా ఇచిన చిన్న రోలులో కనిపించనంత మెత్తగా రుబ్బాలి.

స్థానికంగా పండిన రకరకాల పెద్ద మిరపపళ్లను కాల్చి తెచ్చి ఒక్కొక్కరిని ఒక్కొక్కటి తీసుకోమన్నారు.

అందులో మనకు కావల్సిన అన్ని స్పైస్ లెవల్స్లోనూ ఉన్నాయి మిరపపళ్లు.

మేం కావాలని అత్యంత కారంగా ఉండేవని చెబుతున్నవి ఎలా ఉంటాయో చూద్దామని తీసుకున్నాం.

ఇక్కడ క్లిక్ చేసి ఛాయా చిత్రాలను చూడండి.

ఆ మిరపకాయను కచ్చబచ్చాగా రుబ్బిన తరువాత ఇచ్చిన టమాటా పళ్లని రుబ్బుకుని,

ఉల్లిపాయలు, కొత్తిమీర వంటివి కలుపుకుని టేబుల్ మధ్యలో పెట్టిన చిప్పుతో ముంచుకుని తినేయడమే.

ఇక మేం తీసుకున్న మిరపపళ్లు గూబ గుయ్ మనేంత కారంగా ఉన్నాయి.

కళ్లల్లోకి నీళ్లు వస్తూ ఉన్నా మా సెలక్షనుకి మాకే నవ్వు వచ్చింది.

ఇక రెండవ భాగంగా ఇక్కడి మరో ముఖ్యమైన వంటకాలు ఫిష్, చికెన్, వెజిటబుల్ బజ్జీల తయారీ.

ఎవరికి ఏది తినాలనుంటే అవే తయారు చేసుకోవచ్చన్నమాట.

బజ్జీల తయారీకి అవసరమైన పిండి, ఉప్పు వగైరాలన్నీ మాకిచ్చిన గిన్నెలో కలుపుకుని అందులో ముల్లు తీసిన చేప ముక్కలు లేదా చికెన్ ముక్కలు లేదా కేరట్ ముక్కలు దొర్లించి ఇచ్చిన పళ్లేల్లో పెట్టుకుని వరసగా వేయించే లైనులో నిలబడ్డాం.

అదృష్టం కొద్దీ ఎవరి మూకుడు వాళ్లకిచ్చి వేయించుకోమనకుండా వాళ్లే మాకు వేయించి ఇస్తున్నారు.

ముందుగా కాయగూరల వాళ్లని రమ్మన్నారు.

మొత్తం బాచ్‌లో మా వరు ఒక్కతే వెజిటేరియన్ కావడంతో తన బజ్జీలు ముందుగా రెడీ అయి వచ్చేసేయి.

ఆ తరువాత చికెన్, చివరిగా చేపల వాళ్ల లైనులో నిలబడ్డాం.

మాంచి ఆకలితో ఉన్నా కారం లేకపోవడం వల్ల, ఉప్పు సరిపడా వెయ్యకపోవడం వల్ల వట్టి కార్న్ ఫ్లోర్ బజ్జీలు రుచించలేదు మాకు.

ఫోటోల వరకూ తీసుకుని ఏదో కాస్త తిన్నామనిపించి బయట పడ్డాం.

అంత వరకూ మాకు వంట నేర్పించిన చెఫ్‌తో ఫోటో తీసుకున్నాను నేను.

అక్కణ్ణించి వచ్చేటపుడు షాపింగు కోసం ఒక గంట పాటూ ఎన్సినాదా మార్కెట్టులో ఆపేరు.

స్థానిక వస్తువుల్ని కొనుక్కునేందుకు స్థానికుల్ని పరిచయం చేసుకునేందుకు అవకాశం దొరకడంతో సంతోషపడ్డాను.

స్థానిక మార్కెట్టులో రంగులమయంగా అందంగా ఉంది.

చిన్న సందుల్లో రోడ్ల పక్కనే బయటే వేళాడదీసున్న రంగు రంగుల వస్తువులు, బట్టలు చూడగానే సికింద్రాబాదులో జనరల్ బజార్ గుర్తుకొచ్చింది.

కానీ అంత మంది జనమే లేరిక్కడ. అక్కడే ఎంతసేపైనా తచ్చాడాలనిపించింది.

కానీ సమయానికి బస్సు ఎక్కకపోతే షిప్పు ఎక్కడం కుదరదన్న సత్యం మరిచిపోని సత్య నన్ను వెనకే తరమడం మొదలుపెట్టేడు.

మొత్తానికి సిరికి స్థానిక చేతి వృత్తుల వారు తయారుచేసిన కాటన్ గౌను కొన్నాను.

రంగులో ముంచిన నూలు గుడ్డకి చేత్తో రంగురంగుల దారాల్తో చేసిన చిన్న ఎంబ్రయిడరీ గౌనది.

ఇలాంటి చోట్ల డాలర్లలో కొనే అమెరికా నించి వచ్చిన వాళ్లని చూసి ఎక్కువ ఖరీదు చెబుతారనీ, బాగా బేరం ఆడొచ్చనీ ఎక్కడో చదివాను.

షాపమ్మాయి చెప్పిన రేటులో సగానికి అడిగేను. ఆ అమ్మాయి స్పానిషు యాసలో, వచ్చీ రాని ఇంగ్లీషులో "మీలాంటి వారు కొనుక్కుంటే ఇక్కడ మా స్థానికుల చేతుల్లో తయారైన ~~ఈ~~ వస్త్రం అమెరికా వరకూ వెళ్తుంది కదా'' అని సంతోషంగా ఉంటుంది నాకు. కానీ మీరు అడిగిన రేటుకి ఇస్తే దళారీలకు, అన్ని ఖర్చులకూ పోగా మాకు ఏం మిగులుతుంది? ఇలా డాలర్లలో ఎవరైనా కొనుక్కున్న రోజే నా పిల్లలకు మొక్కజొన్న రొట్టెల్లో మాంసం పెట్టగలిగేది.'' అంది.

మారు మాట్లాడకుండా ఆ అమ్మాయి అడిగిన డబ్బులు చేతిలో పెట్టేను.

టూరు బస్సు దిగి డ్రయివర్ గాను, అప్పటి వరకూ మమ్మల్ని ఊరంతా తిప్పుతూ గైడు గానూ పనిచేస్తున్న అమ్మాయితో ఫోటో తీసుకున్నాను.

తిరిగి వచ్చి నౌక ఎక్కే ముందు షిపు యార్డ్‌లో ఉన్న షాపుల్లో పూసలతో, దారలతో అల్లిన చేతులకు కట్టుకునే చిన్న చిన్న బ్రేస్ లెట్ల వంటివి అదే రేటుకి కొన్నపుడు గౌను కొని ఒక అమ్మాయికి సాయం చేసినందుకు తృప్తిగా అనిపించింది.

తిరిగి లాస్ ఏంజిల్స్ వచ్చేటపుడు అమెరికా భూభాగంలో అడుగుపెట్టడానికి ఉన్న అనేక భద్రతల్లో భాగంగా అందరికంటే చివరలో మా వీసా, పాస్పోర్టుల చెకింగ్ తర్వాత మమ్మల్ని పంపడం మినహా ఆ ప్రయాణం ఎంతో హాయిగా జరిగింది.

సముద్రాన్ని ఒడ్డు నించి చూసి ఆనందపడడానికీ ప్రత్యేకంగా సముద్రమ్మీదే గడపడానికీ

ఉన్న తేడా అందరికీ మొదటిసారి అర్థమైంది. ఎప్పుడెప్పుడు వెనక్కు వస్తామా అని తిరిగి భూమ్మీదకి రాగానే గొప్ప సంతోషంగా అనిపించినట్లు పిల్లలు నౌక దిగి కారెక్కుతునే "హుర్రే" అని అరిచేరు.

*(మెక్సికో యాత్ర సమాప్తం)*